
# సుకవి స్తుతి

తెనుగులెంక
తుమ్మల సీతారామమూర్తి



తుమ్మల
కళాపీఠం
గుంటూరు

# సుకవిస్తుతి

తెనుఁగులెంక

## తుమ్మల సీతారామమూర్తి

సంకలన కర్త

తుమ్మల శ్రీనివాసమూర్తి

# సుకవిస్తుతి
## తెనుఁగులెంక తుమ్మల సీతారామమూర్తి

ప్రథమ ముద్రణ : డిసెంబరు 2007

ప్రతులు : 500

వెల : 10/-

ప్రతులకు :

1. తుమ్మల కళాపీఠము
జె.కె.సి. కళాశాల
గంటూరు -6

2. తుమ్మల శ్రీనివాసమూర్తి
43 - గౌతమపురి కాలని,
ఎఱ్ఱగడ్డ పి.ఓ
హైదరాబాదు - 18

ముద్రణ :
రెయిన్‌బో ప్రింట్ ప్యాక్
అమీర్‌పేట, హైదరాబాద్,
ఫోన్ : 040 - 23731620.

## తెనుఁగులెంక తుమ్మల సీతారామమూర్తి
## జీవితము - కృతులు

**జననము** : 25-12-1901 కావూరు, రేపల్లె తాలూకా, గుంటూరు జిల్లా,

**తల్లిదండ్రులు** : చెంచమాంబా నారయ్యలు.

**గురువులు** : కావూరి శ్రీరాములుగారు, జాస్తి సుబ్బయ్యగారు, తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగారు, దువ్వూరి వేంకటరమణ శాస్త్రిగారు

**విద్య** : ఉభయభాషాప్రవీణ (ప్రథమశ్రేణి) ఆంధ్రవిశ్వవిద్యాలయము 1930

**వృత్తి** : సేద్యము, తరువాత ఆధ్యాపనము, దుగ్గిరాల, బాపట్ల, నిడుబ్రోలు, అప్పికట్ల, మున్నగు చోట్లగల ఉన్నత పాఠశాలలు

**దేశసేవ** : 1920 - 30 వరకు కాంగ్రెసు సేవ; శిక్ష - 1922.

**అభిమాన విషయములు** : గ్రామజీవనము, గాంధీతత్వము, సర్వోదయము, ఆంధ్రాభ్యుదయము, భారతీయుల సమగ్రత, తిక్కన కవితా మార్గము, చిన్నయ్యసూరి సిద్ధాంతము.

**కృతులు** : ఆత్మకథ, మహాత్మకథ, అమరజ్యోతి, గాంధీగానము, సర్వోదయగానము, రాష్ట్రగానము, ఉదయగానము, పఱిగపంట, శబల, పైరపంట, సమదర్శి, కదంబకైత, చక్కట్లు, దివ్యజ్యోతి, ఆత్మార్పణము, ధర్మజ్యోతి, ఎక్కట్లు, సందేశసప్తశతి, నేను, నాకథలు, తపస్సిద్ధి, తెనుఁగునీతి, గీతాదర్శము, హనుమాన్ చాలీసా, రామకృష్ణస్మృతి ఇంకనూ కొన్ని శతకములు, నాటకములు, హరికథలు, జంగంకథలు మున్నగునవి.

**సన్మానములు** : 1949 నిడుబ్రోలులో గజారోహణము, గండపెండేరము, కనకాభిషేకము, సువర్ణకంకణము; 1960 లో అఖిలభారత తెలుగురచయితల మహాసభ సత్కారము; 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ విశిష్టసభ్యత్వము; 1969లో కేంద్రసాహిత్య అకాడమీ బహుమానము (మహాత్మకథకు); 1969లో ఆంధ్రవిశ్వవిద్యాలయము "కళాప్రపూర్ణ". 1985 లో నాగార్జున విశ్వవిద్యాలయము డి.లిట్ బిరుదులతో సత్కారము; 1985లో విశాఖపట్నములో సహస్రపూర్ణచంద్రదర్శన మహోత్సవము; (శ్రీయం.వి.యస్.యస్. మూర్తి); మద్రాసులో యల్.వి రామయ్య చారిటీస్ ఘనసన్మానము; 1987లో గుంటూరు, విజయవాడలలో ఘనసన్మానములు.

**జయంతి మహోత్సవములు** : 1952 నుండి రాష్ట్రమంతటా

**బిరుదులు** : పండితుల, కవుల దృష్టిలో "అభినవ తిక్కన" తన దృష్టిలో "తెనుఁగులెంక"

**మరణము** : 21-03-1990 అప్పికట్ల

## తుమ్మలవారి సువర్ణపద్యచిత్రాలు

### ఆశుకవి, శతావధాని డా॥ రాళ్ళబండి కవితాప్రసాద్

యతుల నెఱింగి, ప్రాసనియమావళినేర్చి, గణానుకూలమౌ
గతిఁ గృతికూర్చువాఁడు కవి గాఁ; డెతఁ డన్యకవీంద్ర దుర్లభ
ద్యుతి నొకటిన్ గడించు నకుతోభయుఁడై, గుణలుబ్ధుఁడై జగ
ద్ధితమగు వస్తువెంచి వరియించు నతండె జయించుఁ గైతలన్.

ఈ పద్యం శ్రీ గుఱ్ఱం జాషువా గురించి శ్రీ తుమ్మలవారు 1966 ఫిబ్రవరి 14 న సమదర్శి గ్రంథములో వ్రాశారు. దాదాపు 40 ఏళ్ళ తర్వాత మళ్ళీ ఈ పద్యం స్మరణీయం.

తెలుగుపద్యాన్ని ఒక సస్యశ్యామలమైన పొలాలమధ్యబాటలో నడిపించిన మహాకవి శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారు. ఆయన పద్యం సతత హరితంగా ఉంటుంది. పైరగాలిలోని చల్లదనం, చలిమంటలో వెచ్చదనం, పంటకాలువలోని నీళ్ళ ధ్వని, పరిగపిట్టల గొంతులోని మార్దవం, పొలంకాపు విసిరిన వడిసెలలోని విసురు, ధనియాలతోటలో గుబాళించు కొత్తిమీర కమ్మదనం, గుమ్మడిపూదుమారాలలోని సౌందర్యపువయ్యారం వెరసి పదహారణాల తెలుగుదనం శ్రీ తుమ్మల వారి పద్యం.

'తెలుగులెంక' అని హృదయంగమంగా పిలుచుకుంటాం. గాంధీజీ ఆస్థానకవి అని గౌరవంగా నమస్కరిస్తాం. ఆయన శబ్దసంస్కారానికి, భావ చమత్కారానికి పరవశించి పోతాం. ఎవరైనా తెలుగు పద్యానికి ఆలయం నిర్మిస్తే ఆ పద్యాలయంలో ఆయనను ప్రముఖదేవతామూర్తిగా ప్రతిష్ఠించాలి. ఇంత ఆప్యాయంగా ఎందుకు వ్రాస్తున్నానంటే దానికి మూడు కారణాలున్నాయి. ఒకటి భావంపట్ల ఎంత నిబద్ధత ఉన్నదో, తెలుగుపదాలపట్ల, సుష్టుశబ్దాలపట్ల, వ్యాకరణ మర్యాదల పట్ల అంత గౌరవం ఉంది. అలా ఉండటంవల్లనే ఆయన పద్యానికి శాశ్వతవిలువ రావడానికి మరింత అవకాశం ఏర్పడింది. రెండు- అభివ్యక్తిలో నవ్యత. ఆకాలంలో పడికట్టుపదాలు, సమాసాలు, ఉపమానాలతో పద్యరచన సాగించేకవులు పుట్టడం ప్రారంభమైంది. తుమ్మల వారి పద్యం వారికి ఒజ్జబంతిగా మిగిలింది. ఆయన వలే పద్యం రాయాలని ప్రయత్నం చేశారు. నిత్య నూత్నమైన అభివ్యక్తి తుమ్మలవారి కవిత్వానికి పెట్టని సొమ్ము. ఇక మూడవ విషయానికి వస్తే పద్యంలో శ్రావ్యం. వినసొంపైన పదాలు, వినసొంపైన క్రమంలో రచించడం. దాని వల్ల పద్యానికి ఒక కాంతి, ధ్వని ఏర్పడింది. మామూలు పదాలతో కొత్త సొంపును పద్యంలో నింపడం తుమ్మలవారి కవితాశక్తికి నిదర్శనం.

ఆయన పూర్వకవులను, తోటికవులను, భావికవులను గూర్చి నమస్కార, అభినందన, ఆశీ:పూర్వకంగా పద్యాలు రచించారు. ఈ పద్యాల సంకలనమే ఈ సంపుటి తుమ్మల కళా పీఠం వారి సమర్పణ.

స్తుతి కేవలం స్తుతి ప్రాయంగా కాక అందులో చరిత్ర, సార్ధకమైన లక్షణ సమన్వయం. ఏకవిని గురించి పద్యాలు చదివినా ఆకవి యొక్క పద్య రచనా శైలి, ఆయన వ్యక్తిత్వం, కవిత్వం మొత్తం అర్ధమౌతుంటుంది. అలా వ్రాయడం ఒక అద్భుతమైన శైలి.

"పారుబోతునకైన పౌరుషం బొదవు నీ సంగ్రామ వర్ణనల్ చదువుతున్న"

- ఇది పోతన గారి పై రచించిన పద్యం

అతఁడు మహాకవిత్వదీక్షావలంబి
యగుచు నంతర్విలోకనం బట్టె విప్ప
యుగయుగమ్ములు దాఁటిన జగములెల్ల
రివ్వరివ్వన సాక్షాత్కరించి తీరు.

-ఇది విశ్వనాథ వారిపై పద్యం :- తొలి మూడు పాదాలలో విశ్వనాథ వారు; "రివ్వరివ్వన" అని నాల్గవపాదంలో తుమ్మలవారు కనిపిస్తారు.

గేయమనుచు రెడ్డి వ్రాయునుగాని ప
ద్యమున కుద్ది యగుచుఁ దనరు నద్ది;
చదురుగన్నవార లెది వ్రాసినను, దాన
నందచందములకుఁ గుందురాదు

-ఇది ఆచార్య సి. నారాయణరెడ్డిగారిపై తుమ్మలవారి పద్యం

ఇలా ఎందరో కవులను తమ పద్యచిత్రాలలో లిఖించి తెలుగు సాహిత్య చరిత్రలో తుమ్మలవారు చిరస్థాయిగా నిలిచిపోయారు. ఈ పద్యాలలో నేటి పిల్లలు కొన్నింటినైనా ధారణచేసే శుభఘడియకోసం ఎదురు చూద్దాం. సంకలనకర్తకు, తుమ్మల కళాపీఠం సభ్యులకు అభినందనలు.

**కృతజ్ఞతలు**

ఆశుకవి, శతావధాని శ్రీ రాళ్ళబండి కవితా ప్రసాదుగారు రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖాధిపతులు. విడుమరలేని కార్యక్రమములున్ననూ ఈ గ్రంథముకు "తుమ్మలవారి సువర్ణపద్య చిత్రాలు" అను తలబంతితో వారు వ్రాసిన మాటలు పసిడి పలుకులు. వారికి నాహృదయపూర్వక కృతజ్ఞతలు.

ఇట్లు
సంకలకర్త:- తుమ్మల శ్రీనివాసమూర్తి

**మరొక్కమాట**

(వివిధ కవులపై తుమ్మలవారు వ్రాసిన పద్యాలలోని పసిడి పలుకులు)

తుమ్మలవారు శ్రీ పోతనపై వ్రాసిన పద్యాలలోని పసిడి పలుకులు

యతి విటుడు కాకపోవునే నీ శృంగారవర్ణనల్ విన్న అని నృసింహకవి వ్రాయగా,తుమ్మలవారు " రహి నపుంసకుడైన రమణులగోరు నీ శృంగారవర్ణనల్ చేరివిన్న" అని కూర్చుట శోభాతిశయము. యతి విటుడగుటలో నాశ్చర్యములేదు; నపుంసకుడు రమణుల గోరుటయే అద్భుతము.

"అజ్ఞానియైన దివ్యవజ్ఞాన రాశియై పొదలు యుష్మద్భక్తి బోధనెన్న"

ఓనమాలు రాని కూనకున్ గేసన్న<br>
కొడుకు కైత వచ్చుఁగొంతయేని<br>
యే తెలుంగు కవికి నీ భాగ్య మబ్బె? వే<br>
మన్న కించుకంత యబ్బె నందు.

శ్రీ చిన్నయసూరిపై చెప్పిన పసిడి పలుకులు - "తెనుగున దుర్గము చిన్నయ" - నీతి చంద్రిక తెన్గునకు వేదం బన్నను దొసంగు కలదా?"

శ్రీ విశ్వనాథపై చెప్పిన పసిడి పలుకులు - "అతడు తెల్గులతల్లి పుణ్యమ్ము పంట" - "అతని హృది రసవాహినియై తొణంకె" - "ముజ్జగంబు చుట్టివచ్చు సమాసంబు కట్టునతడు" - " నీ కేకాగ్రత జీవగఱ్ఱ; కృతులన్ నిర్మించుచో, పాడుచో వాకల్గట్టును బాష్పముల్; రఘుకులస్వామిన్ బ్రకీర్తించుచో, లోకం బన్నది విస్మరించెదవు; నీలో భక్తియోగమ్ము నాలోకింతున్"

భావవిప్లవిధాత శ్రీ త్రిపురనేని పై చెప్పిన పసిడి పలుకులు - " తెలుగు కావ్యమ్ముపై కోర్కి తీవరింప సురల వీడిన కాళిదాసుడవు నీవు" - " ఒక విప్లవ సారస్వత శకమునకున్ కర్తయయ్యె చౌదరి" - "సన్నజాజుల బోని తెలుగు నుడుల కైత దీర్చిపేర్చె"

శ్రీ చెళ్ళపిళ్ళపై చెప్పిన పసిడిపలుకులు - "తెలుగుం కవిత్వపుం బొంకములెల్ల జూపి, రుచిపోయిన శారదసోయగంబులో వంకలు, దిద్దె" - "అంకిలేని ధాటిని సహస్రవధానములా చరించె "

శ్రీ కాటూరిపై చెప్పిన పసిడి పలుకులు - " ప్రాఁతక్రొత్త చక్కనలకు ప్రాపుగాగ వలచివలచి నెఱకైత వ్రాసె నితడు" - " సమస్త నరవికాసము వలచు మనస్వి యితడు"

శ్రీ నన్నయ్యపై చెప్పిన పసిడి పలుకులు- "నన్నయ" మదియున్ మాటయు వెన్నయకద; శైలి సాంధ్యవేశానట దీశోన్నత శిరస్సురద్దివిషన్నది కద" - "నన్నయ

తెల్గుభారతి కొనర్చిన సేవకు నంజలింతు; గాని తెల్గుపై కన్నిడలేకపోయె, నిదికాలమహత్త్వమొ? తత్త్వభేదమో?”

శ్రీ తిక్కన పై చెప్పిన పసిడి పలుకులు:- “ జిగిసెడి మూల్గు తెల్గునకు జీవము నింపి, నిలింపవాణికిన్ సొగసులు దిద్దె” - “ఒక తిక్కన సాలడె యీ సకలాంధ్రమునకును జీవసంపద నొసగన్” - “సమ్యక్కవితానిరూఢము, సమంచిత ధర్మరమాశ్రయమ్ము మా తిక్కన భారతమ్ము నినదింపని తెల్గుపొలమ్ము లేదురా!”

శ్రీ వేలూరిపై చెప్పిన పసిడి పలుకులు:- “ మీసములు మొల్చియు మొల్వనినాడె ప్రోడయై కవికుంజరులన్ జళిపించు ధీరునిన్ మరవగ తెల్గువారి తరమా!”

శ్రీ రాయప్రోలుపై చెప్పిన పసిడి పలుకులు :- “సముచిత వాక్కుల దేశాభిమాన మొదవించి తెలుగు బిడ్డకు కర్తవ్యము నేర్పిన తొలికవి రాయప్రోలు”

“ తెలుగుదనమునకును,భారతీయతకును సమవికాసమ్ము వలచిన సరసుడితడు”

శ్రీ మాధవపెద్దిపై చెప్పిన పసిడి పలుకు:- “ నినుజూచుటె పండువు తెల్గువారికిన్”

శ్రీ కన్నెకంటిపై చెప్పిన పసిడి పలుకు :- “శిల్పివీవు, చేపట్టిన వస్తువెల్ల రుచిబంధుర సుందర రూపకల్పనా హట్టముగా రసజ్ఞహృదయము లాచికొనున్”

శ్రీ జాషువాపై చెప్పిన పసిడి పలుకులు :- “ రారాజు విధాన భవ్య రసరాజ్యమునేలిన సుకృతీ”! - “అణగారు దీనులన్ గైకొని వారికష్టమయ గాథలు చక్కవచించి తీవు” నీవొక క్రొత్తనోట కమనీయపథమ్మున తెల్గుగుండెకున్ జీవమునిచ్చు పల్కున విశిష్ఠత గంటివి” - “ నందనవాటికాకుసుమ నవ్యమరంద ఝరీతరంగముల్ చిందగ కృతులు సెప్పితివి” - “నీదు సృష్టికిన్ జావను మాటలేదు కులశైలము లబ్ధులు క్రుంగిపొంగినన్”

శ్రీ తాడేపల్లిపై చెప్పిన పసిడి పలుకులు :- “ ఏకశ్లోక రహస్యబోధనముచే నెవ్వాడు శిష్యున్ సుధీలోకాగ్రేసరు జేయు నవ్విబుధు గొల్తున్ వేంకటప్పార్యున్”
- “ ప్రన్నని బాటలో నడిపి రామకథన్ పున్నెపుముద్ద నా నిలిచి పోయెను మద్గురు డంధ్ర సాహితిన్”

శ్రీ మధునాపంతులపై చెప్పిన పసిడి పలుకులు :- “ తీయని కైతతోడ, గడితేరిన పాండితితోడ, నాంధ్రరాష్ట్రీయవికాసమున్ వలచు డెందముతోడ, నపార శౌచ లక్ష్మీయుత జీవన ప్రవణ శీలముతోడ నెసంగు సత్యనారాయణ శాస్త్రి”
“చదురుల నిండియున్ వినయసంగతి వీడడు శాస్త్రి” ఈపసిడి పలుకులలో తుమ్మలవారు దర్శనమిస్తారు.

శ్రీ దేవులపల్లి పై చెప్పిన పసిడి పలుకులు :- “ సమత సర్వయోగ సారముగా

విశ్వసించునట్టి మధుర శీలుడు'' - '' కరుణకలదు, ప్రేమ కలదు, ఈవికలదు, ఆత్మ కలదు కృష్ణ శాస్త్రి కవితయందు''

శ్రీ కొండవీటిపై చెప్పిన పసిడి పలుకులు :- '' నిన్ను జూడ త్రిపురనేని మహార్షి నామదికి వచ్చు తీవ్రమంజుదీప్తి''

శ్రీ వేమన్నపై చెప్పిన పసిడి పలుకులు :- ''విమతుల యెడందలకు బాకు వీని వాకు'' - ''పల్లె పల్కుతోడ పరతత్త్వమును జాటి విశ్వకవిగా నిల్చె'' - దీను పాలి పెద్ద దిక్కు వేమన; పేదపెంపు వీని కృతికి బీజము''

శ్రీ ఓగేటిపై చెప్పిన పసిడి పలుకులు :-'' దైవసంపద కీత డాస్థాని'' - ''పొలముదున్ని పొట్ట పోరణగించును; కలముపట్టి దివ్యకవితవ్రాయు; చలముపూని చిత్త జయమందు; ఇతడు పోతరాజె''

కవయిత్రి, ఉపన్యాసకురాలు శ్రీమతి వూటుకూరి పై చెప్పిన పసిడి పలుకులు :- ''కలదు కలదు లక్ష్మికాంతమ్మకు రసజ్ఞజాతి కింపుగూర్చు కైతచదురు'' - ''మామిడి గున్నమీద మునిమాపుల కోయిల క్రోల్చులీల నీలేమ సభావితర్ధి నవలేపవిదూర మృదూక్తులాడుచో జాములు జాములేగు నిముసమ్ములు బోలె''

శ్రీ జాపూడిపై చెప్పిన పసిడి పలుకులు :- ''ఈవు కళాయోగివి, నీ భావమ్ములు విశ్వమానవత కంకితముల్'' - ''బ్రౌను కృష్ణనీరు త్రాగి వేమనయోగి నెటి నెటింగెనన్న నీదుతలపు, నీ తెనుంగు వలపు కవి కోటికి తృప్తినిచ్చు''

నవావధాని శ్రీమేడసానిపై చెప్పిన పసిడి పలుకులు :- '' నాడు రసతోయధి మున్గిన తెల్గువారికిన్ మరల నవావధానములు మంజుతరాశు కవిత్వముల్ పొరింబొరిగ నొనర్చితివి''

శ్రీ రంధి సోమరాజు పై చెప్పిన పసిడి పలుకులు :- '' తెలుగు పేదల నాల్కనురలెడి పలుకుపస నీపాలిదాయెను'' - ''కరుణనేర్పును, సమత నేర్పును, ఓర్మినేర్పును, ఈవినేర్పును, నేర్పునార్తుసేవ నీ కవితల్''

శ్రీ ద్వారము పై చెప్పిన పసిడి పలుకులు :- '' పోయిన చూపు లోపలికి బోయి హృదంతరదివ్యలోకబృందాయమునాతటీవిహరణ ప్రవణ ప్రభువేణు నిస్వన చ్ఛాయల దెచ్చుకొన్న యొక చక్కని నాదము పొమ్ము నీదహొ! నాయడ!

సంకలనకర్త!



**శ్రీ పాలడుగు లక్ష్మణరావు సి.ఎ., (విజయవాడ)**

సాహితీ పోషకులు, సమాజసేవకులు

(తుమ్మలశతజయంతి సంఘ కోశాధికారి)

"సుకవిస్తుతి" సంకలనగ్రంథము వీరికి కృతజ్ఞతాకానుకగా

సమర్పించబడినది

**కృతజ్ఞతా కానుక**

ఆధునికతెలుగుసాహిత్యచరిత్రలో మహాకవి తుమ్మలవారికి ఒక ప్రత్యేక స్థానము కలదు. సాహితీ లోకమున వారు అజాతశత్రువులు వారు కవులందరిని అభిమానించినారు; కవులందరూ కూడా వారిని అభిమానించినారు.

గ్రామ్యవాదులు నాస్తికుల్ గాంధిసరణి
మెచ్చమనువారు గలరు నా మిత్రులందు
నడ్డగించునె సిద్ధాంత మచ్చమైన
ప్రేమగల రెండు గుండెలు బెరసినపుడు

దారులెట్టివైన రా రమ్మటంచు నన్
గారవించు కవిని గౌరవింతు
నెడ౧ద పెంపులేని వెడమాసి యీగుట్టు
గానలేక తద్ద కళవళించు - అని వారు ఒక చోట వ్రాసినారు.

అందువలననే వారు ఆధునిక కవులను - సందర్భము వచ్చినపుడు - ప్రశంసించుచూ పద్యములను వ్రాసినారు. ఈ పద్యములలో ఆయా కవుల విశిష్ట గుణములు, కవితాత్మ, కవితా వైభవములు, మంచి మనసుతో వర్ణించబడినవి. అటులనే కవులందరు తుమ్మలవారిని గూర్చి ప్రశంసా పద్యములను వ్రాసినారు.

భవభూతి చేమకూరల
అవఅవ లే నెఱు౧గ నద్దిరా!ప్రజలు, మహా
కవులు, సమకాలికులు మ
త్కవితం గొనియాట వింటి౧ గంటిన్ సభలన్ - అని వారు వ్రాసినారు.

"అనుబంధము" అను శీర్షికలో ఆయా కవులు తుమ్మలవారిని గూర్చి వ్రాసిన పద్యములు చేర్చబడినవి. ఇంకను కవులతో పాటు గాయకులు, నటులు, సద్గురువులు, సంఘసంస్కర్తలను గూర్చి కవిగారు వ్రాసిన పద్యములు కూడ కలవు. వీరందరూ మానవుని సంస్కారవంతునిగాజేసి, సమాజమును ఉన్నతీకరించుటకు కృషిచేసిన వారేకదా!

ఈ పద్యములన్నియు "సుకవిస్తుతి" అను పేరుతో ఒక చిన్నగ్రంథముగా ప్రచురించబడినది. దీనిని "సంక్షిప్తకవులచరిత్ర" అని అనవచ్చును. ఈ పద్యములను పాఠకులు చదువుచున్నపుడు ఆయా కవులను తమ మనస్సులలో దర్శించగలరు.

ఈ పద్యముల నడక - నల్లేరుపై బండి నడకవలె - సాఫీగా సాగిపోవుచుండును. ఈ పద్యములు సాహితీ ప్రియులకు ఒక కవితావిందు. అంతేగాక ఇవి విజ్ఞాన దాయకములు, సందేశాత్మకములు.

ఈ చిన్న గ్రంథమును తుమ్మల శతజయంతి మహోత్సవ సంఘ (2001) కోశాధికారి శ్రీ పాలడుగు లక్ష్మణరావుగారికి కృతజ్ఞతా కానుకగా సమర్పించబడినది. వారు వృత్తిచే ఆడిటర్; ప్రవృత్తిచే సాహితీ ప్రియులు, సంఘసేవకులు. వారికి తమ వృత్తియందు మంచి పేరు ప్రఖ్యాతులు గలవు. వారు తమ సంపాదనలో కొంత భాగమును సాహిత్య పోషణకు సమాజ శ్రేయస్సుకు వినియోగించుచుందురు. 2001లో గంటూరులో వైభవముగా జరిగిన తుమ్మల శతజయంతి సభల నిర్వాహణకు, కవిగారి సమగ్రసాహిత్య ప్రచురణకు సంఘాధ్యక్షులు

శ్రీ డా॥ కొండబోలు బసవపున్నయ్యగారు, కన్వీనర్ శ్రీ డా॥ ముద్దన హనుమంతరావుగార్లతో కలసి వారు సాహితీపోషకులను కలసి కావలసిన ధనమును సేకరించినారు. ఇంకను వారు మానవతావాదులు, ఆధ్యాత్మిక చింతనము గలవారు కూడ.

ఇట్లు
సంకలనకర్త శ్రీనివాసమూర్తి

**ఒక చిన్నమాట**

మా అన్నయ్య శ్రీనివాసమూర్తి సంకలనము చేసిన "సుకవిస్తుతి" గ్రంథమును ప్రచురించుట మా మహాభాగ్యముగా భావించుచున్నాము. తుమ్మల కళాపీఠ నిర్వాహకులకు, సాహితీ ప్రియులకు మా నమస్కారములు.

ఇట్లు
నారాయణ
శ్రీపతి

## ప్రశంస

2001 డిసెంబరులో తెనుగులెంక శ్రీతుమ్మలసీతారామమూర్తి శతజయంతి సభలను డా॥ కొండబోలు బసవపున్నయ్యగారి అధ్యక్షతన ఏర్పడిన తుమ్మల శతజయంతి సంఘము చాలా వైభముగా నిర్వహించినది. అంతే గాక జాతీయకవితామూర్తి సీతారామమూర్తిగారి రచనలన్నింటిని నాలుగు సంపుటములుగా ప్రచురించుటయే గాక, ఒక అమూల్యమైన సావనీర్‌ను కూడా ముద్రించినది. ఇంకను డా॥ కొండబోలు బసవపున్నయ్యగారి అధ్యక్షతన తుమ్మల కళాపీఠము నెలకొల్పబడినది. ప్రతి సంవత్సరము తుమ్మల వారి జయంతి, వర్ధంతి సభలు నిర్వహించబడుచున్నవి. అంతేగాక ఉత్తమ రచయితలను "తుమ్మల సాహిత్యపురస్కారము"తో సన్మానించుకొంటున్నది. 2003లో శ్రీ మన్నవ గిరిధరరావు గారికి, 2004లో శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు గారికి, 2005లో శ్రీ గుండవరపు లక్ష్మీనారాయణ గారికి, 2006 లో శ్రీ యార్లగడ్డ వేంకటసుబ్బారావు గారికి, 2007లో శ్రీ కసిరెడ్డి వెంకటరెడ్డి గారికి తుమ్మల సాహిత్య పురస్కారములను అందించి, సన్మానించినది.

తుమ్మల వారి పెద్దబ్బాయి శ్రీ శ్రీనివాసమూర్తి విషయ ప్రధానముగా మహాకవి పద్యరత్నములను సేకరించి తుమ్మల కళాపీఠము ద్వారా ప్రచురించి ఆంధ్రపాఠకలోకమునకు అందించుచున్నారు. "ఆంధ్రప్రశస్తిని" చరిత్రకారులు, బహుభాషావేత్తలు, కీర్తిశేషులు పులిచెర్ల సుబ్బారావుగారి జ్ఞాపకార్థముగా; "పండుగ కవితలు"ను ప్రముఖవాణిజ్యవేత్తలు, విద్యా పోషకులు శ్రీ పోలిశెట్టి ఏకనాథ గుప్తగారికి ఉడుగరగా, "తెనుగుతీపి"ని ఆదర్శవైద్యులు డా॥ ముద్దన హనుమంతరావుగారికి కృతజ్ఞతా కానుకగా; "కథాకవిత్వమును" వారి తల్లి గారైన అన్నపూర్ణమ్మ గారికి కృతజ్ఞతా కానుకగా సమర్పించినారు. నేడు" సుకవిస్తుతి" అను గ్రంథమును ప్రముఖ ఆడిటర్ సాహితీప్రియులు పోషకులు అయిన
శ్రీపాలడుగు లక్ష్మణరావుగారికి కృతజ్ఞతా కానుకగా సమర్పించుట సముచితము, సంతోషకరము. ఈ సంకలన గ్రంథము తుమ్మలవారి విశాలహృదయమును వివిధ కవుల కవితాత్మను ఆవిష్కరించుచున్నది.

సర్వధారి ఉగాది
2008

డా॥ పులిచెర్ల సాంబశివరావు
కార్యదర్శి
తుమ్మల కళాపీఠము, గుంటూరు

## కృత్యాది

రాష్ట్ర సిద్ధికొఱకు రక్తమ్ముగార్చిన
కవిని నేను గాంధికవిని నేను
బడలిబడలి తల్లిబాస కూడెముసేయు
కవిని నేను దేశకవిని నేను

అల నన్నయ్యకు లేరు, తిక్కనకుఁగా కాంధ్రప్రజానీక హృ
జ్జల జోన్మీలనకృత్ ప్రభాకరవిభాసంకాశ సాధూక్తి మం
జుల పుంభావసరస్వతుల్ గుణగరిష్ఠుల్ భావుకుల్ భక్తు ల
స్ఖలితస్ఫారయశోమహోధవళి తాశాసానువుల్ మాదృశుల్.

నేలవిడిచి సామునెఱపిన యట్లుండు
సంఘగతికి దవ్వు సాగివ్రాత
యుక్తిచణతగాదు యుగలక్షణము గుబా
ళింపవలయుఁ గావ్యలేఖనమున.

గిఱిగీచుకొన్నకవి కృతి
చిరకాలము నిల్వ; దెల్లసిద్ధాంతములన్
దరియించి విప్లవముదెస
కరిగినకృతి సత్యదర్శియై రాణించున్.

కళకొఱకేకవిత్వమని గంతులువేయక రోఁతరోఁతగా
వలపులునింపి కబ్బములువ్రాయక విశ్వజనీనబోధ్భుతా
లలిత ముదారవృత్తము కలాకమనీయము సంస్కృతిప్రభా
మిళితమునైన సృష్టి నెదమెచ్చితి జాతికిఁ గాన్కలిచ్చితిన్.

ఎవ్వ రెంద ఱెంతదవ్వైన నేను భా
షా విపర్యయమ్ము సైఁపలేను
సాధుశీల మాభిజాత్యమ్ము చెలువమ్ము
ననసి మెఱయువనిత నాదు కవిత.

భావవిప్లవమ్ము ప్రచరించుకవి శాబ్ద
విప్లవమున కంగవింపఁడేని
గెలువఁడని బిభీషికలుకొట్టువారు నా
సృష్టిఁజూచి యేమి సెప్పఁగలరొ!

ఈ మేనెంత నలంగిన
నామనుగడ లోకసేవనమ్మున కిడెదన్
సామాజికకల్యాణము
కామించెద నవ్యభవ్యకవితాసృష్టిన్.

## ఆకాంక్ష

ఎట్టి కఠోరదీక్షలు సహించితినో తొలుబామునందు, నీ
కెట్టిదళంబు లెట్టివిరులిచ్చి నమస్య లొనర్చినాఁడనో,
పుట్టితి నీ సుతుండనయి పోఁడిమిగంటిని తల్లి! వీనికిన్
బెట్టుము భిక్ష నీ యనుఁగుబిడ్డఁడుగా నెపుడున్ జనింపఁగన్

నీ రమణీయమూర్తి కమనీయవచస్స్ఫురణంబు దాతృతా
గౌరవ మద్వితీయరసికత్వవిభూతి విశిష్టశౌర్య వి
ద్యారుచిరత్వ మెంత కొనియాడిన మత్కవితాపిపాస చ
ల్లాఱ దదేమి తల్లి! యిది యాఱక మాఱక యిట్లె నిల్చుతన్.

నాకే కాదు భవచ్చరిత్రము లనన్యప్రాప్యధారా రస
శ్రీకందమ్మన నందగించు కవితన్ చిత్రించు భాగ్యంబు ను
ద్రేకస్ఫూర్తియు నస్మదీయమగు పుత్రీపుత్రకశ్రేణి కీ
వాకల్పాంత మనుగ్రహింపఁగదవమ్మా! ఆంధ్రవీరప్రసూ!

# విషయసూచిక


| శ్రీయుతులు | పేజి |
|---|---|
| 1. బమ్మెర పోతన | 1 |
| 2. కొప్పరపు కవులు | 3 |
| 3. పరవస్తు చిన్నయసూరి | 5 |
| 4. విశ్వనాథ సత్యనారాయణ | 8 |
| 5. కవయిత్రి మొల్ల | 11 |
| 6. విశ్వనాథ సత్యనారాయణ | 11 |
| 7. త్రిపురనేని రామస్వామి చౌదరి | 13 |
| 8. ఏటుకూరి వేంకట నరసయ్య | 15 |
| 9. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి | 16 |
| 10. కాటూరి వేంకటేశ్వరరావు | 18 |
| 11. బూదూరి రామానుజులురెడ్డి | 20 |
| 12. పింగళి - కాటూరి (జంటకవులు) | 21 |
| 13. నన్నయ్య | 22 |
| 14. ఎఱ్ఱన | 23 |
| 15. తిక్కన్న | 23 |
| 16. విశ్వనాథ సత్యనారాయణ | 25 |
| 17. పెనుమెచ్చ సత్యనారాయణరాజు | 27 |
| 18. వేలూరి శివరామశాస్త్రి | 28 |
| 19. రాయప్రోలు సుబ్బారావు | 29 |
| 20. గుఱ్ఱం జాషువా | 30 |
| 21. సి. నారాయణరెడ్డి | 32 |
| 22. మంగిపూడి వేంకటశర్మ | 33 |
| 23. దువ్వూరి వేంకటరమణ శాస్త్రి | 34 |
| 24. తాడేపల్లి వేంకటప్పయ్య శాస్త్రి | 36 |
| 25. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి | 39 |
| 26. దేవులపల్లి కృష్ణశాస్త్రి | 40 |
| 27. యార్లగడ్డ రంగనాయకులు | 42 |

| శ్రీయుతులు | పేజి |
|---|---|
| 28. తిరుపతి వేంకటకవులు | 43 |
| 29. కొండవీటి వేంకటకవి | 43 |
| 30. నమశ్శివాయ | 45 |
| 31. శిష్ట్లా సత్యనారాయణ రాజశేఖరము | 46 |
| 32. కొసరాజు రాఘవయ్య | 48 |
| 33. యోగి వేమన్న | 49 |
| 34. ఓగేటి పశుపతి | 50 |
| 35. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ | 51 |
| 36. జూపూడి అమ్ములయ్య | 53 |
| 37. యార్లగడ్డ వేంకటసుబ్బారావు | 56 |
| 38. అంతటి నరసింహము | 57 |
| 39. మేడసాని మోహన్ | 59 |
| 40. మరుపూరు కోదండరామరెడ్డి | 59 |
| 41. రంధి సోమరాజు | 60 |
| 42. నల్లపనేని మార్కండేయులు | 62 |
| 43. బమ్మెరపోతన | 63 |
| 44. వడ్లమూడి గోపాలకృష్ణయ్య | 65 |
| 45. త్రిపురనేని రామస్వామి చౌదరి | 66 |
| 46. చిట్టిప్రోలు కృష్ణమూర్తి | 67 |
| 47. ఉల్లి రామసుబ్బయ్య | 67 |
| 48. చిట్టిప్రోలు వేంకటరత్నం | 68 |
| 49. ద్వారము వేంకటస్వామినాయుడు | 68 |
| 50. చిత్తూరు నాగయ్య | 69 |
| 51. సద్గురువులు | 70 |
| 52. అనుబంధము | 86 |
| (తుమ్మలవారిపై వివిధ కవుల ప్రశంసలు) | |

## శ్రీ బమ్మెర పోతన

శ్రీ మద్బమ్మెర పోతనాహ్వయ! యశస్సీమంతినీకామ! శ్రీ
రామస్వామిపదారవింద భజనాప్రహ్లాద! రాజద్గుణో
ద్దామా! కేసనపుత్ర! ధీరసుకవీంద్రా! దివ్య చారిత్ర! నీ
సామర్థ్యం బెఱిఁగింప నల్వ కయినన్ శక్యంబె ముమ్మాటికిన్.

బళిరే! నీ పదకోమలత్వమును, నీ పాండిత్యమున్, నీ విని
ర్మల నారాయణపాదభక్తియును, నీ మాధుర్యపాకంబు, నీ
లలితంబైన పదప్రయోగము, రసాలంకారచాతుర్యమున్
దలఁపన్ వేఱొక సత్కవీంద్రునకు లబ్ధంబౌనె? నిక్కంబుగన్.

నన్నయతిక్కనాది కవినాథు లనేకులు సంస్కృతంబునం
దున్న పురాణరాజముల నొప్పుగ వ్రాసిరి తెన్గుబాసయం
దెన్నగ, నాంధ్రభాగవత మీవు రచించితి వాపురాణముల్
విన్ననువైన మీ మృదుకవిత్వ విధేయతఁ జూపకుండునే?

వినుత కవీంద్ర! కొంద ఱవివేకులు గాకవులందునం దలా
క్షణికుఁ డటంచు మిమ్ములనుఁ జాటిరి; దానఁ గొఱంతగల్గునే!
ఘనతరగంధసింధురము గ్రామమునం బయనం బొనర్చుచో
శునకములన్నియున్ మొఱుఁగుచో గజరాజున కేమిలోటగున్?

ఘనపండితోత్తముల్గని మెచ్చి శీర్షంబు-లూఁచు చందంబున నొక్కచోట
సత్కవిప్రకరంబుఁ జదివి సెబాసంచు-నుల్లాసపడురీతి నొక్కచోట
పౌరాణికశ్రేణి పరికించి యిది పురా-ణోత్తమం బనునట్టు లొక్కచోట
భక్తాగ్రగణ్యులు బఠియించి హరిభక్తి-జిక్కి చొక్కెడు లీల నొక్కచోట

నాంధ్రదేశీయులెల్ల రాహా ! యనంగ
భాగవత సత్పురాణంబు భవ్యశయ్య
దెనుఁగుఁ జేసిన నిన్నుఁ గీర్తింపఁదరమె?
బుధనుతివిరాజ బమ్మెరపోతరాజ!

పాఱుఁబోతునకైనఁ బౌరుషం బొదవు నీ - సంగ్రామవర్ణనల్ చదువుచున్న
రహి నపుంసకుఁడైన రమణుల గోరు నీ-శృంగారవర్ణనల్ చేరి విన్నఁ
గటికవానికినైనఁ గఱఁగుఁ జిత్తంబు నీ-కరుణారసార్ద్ర సత్కథలఁగన్న
నజ్ఞానియైన దివ్యజ్ఞానరాశియై-పొదలు యుష్మద్భక్తిబోధ నెన్న
క్షితి భవద్విరచిత భాగవతపురాణ
రత్నమున కెద్దిసాటి పురాణకోటి
మాన్యచారిత్ర! కేసనమంత్రిపుత్ర!
సద్యశస్సాంద్ర! పోతరాట్సత్కవీంద్ర!

అనఘ! నీ కావ్యకన్యా మోహితాత్ములై-నీ చెంత కరుదెంచి నిఖిల నృపులు
షడ్రసోపేతభోజనముఁ బెట్టెద మన్న-గూడదం చంబలి గ్రోలినావు
పసిడిమేడలలోన వసియింపుఁ డీరన్న-నొప్పక పాకలో నుండినావు
పట్టుపుట్టంబులఁ గట్టఁ బెట్టెదమన్నఁ-గాదని పేలిక ల్గట్టినావు
ఎన్నిశుల్కంబు లొసఁగెద మన్న నీచ
మానవున కీయ మామక మానసీయ
కావ్యకన్య నటంచు సద్గతుల గోరి
చెలఁగి శ్రీరామమూర్తి కిచ్చితివి, బళిరె!

పాపనాశన మిహపరసౌఖ్యదము భాగ-వత పురాణంబు భవద్రచితము
నీ యిష్టదైవము నిఖిలేశ్వరుండగు-రఘుకులాభరణుఁడు రామమూర్తి
మది నెంచ నీ బావమఱఁది సర్వకళా స-నాథుఁడై వెలయు శ్రీనాథసుకవి
కవిశిరోమణి యనం గణుతి కెక్కిన యట్టి-మల్లన్న నీదు కుమారకుండు
బళిరె! నీ వంటి సత్కవి ప్రవరుఁ గన్న
యాంధ్రమాత యదృష్ట మేమనఁగ వచ్చు
వసుధ నేతల్లి గాంచె నీ వంటి కొమరు
భూరిగుణధుర్య! బమ్మెరపోతనార్య!

ఆంధ్రకవిశ్రేష్ఠు లందఱు నిన్గవి-సార్వభౌముఁడ వంచు సన్నుతింప
వ్యాకరణాచార్య లోకచూడామణి-వని సత్కళావిదుల్ వినుతిఁ జేయ
తర్కశాస్త్రజ్ఞులు తార్కికోత్తముఁడ వ-టంచు నిన్నెంతయు నభినుతించ
స్థిరభక్తి, వేదాంత జిజ్ఞాసువులు మహా-వేదాంతివని నిన్ను వేడుచుండ

పరమభక్తుఁడ వని భక్తవరులు గొల్వ
జగతి హాలికవృత్తి స్వచ్ఛందజీవ
నం బొనర్చిన నిను వర్ణనం బొనర్పఁ
బుడమి నెవఁడోపు బమ్మెరపోతరాజ!        (1923 దివ్యజ్యోతి)

## శ్రీ కొప్పరపు సోదరకవులు
## (వేంకట సుబ్బారావు-వేంకటరమణరావు)

ఆశుకవిచక్రవర్తులై యాంధ్రభూమి
నల్గడ యశఃపతాకలు నాటినట్టి
కొప్పరపుసోదరుల్ తమ గొప్పతనము
పగటి రొకసారి మజ్జనపదమునందు (కావూరు)

శ్రీ సుభద్రపెండ్లి చిన్నారి పొన్నారి
పలుకుతో రవంత నిలుపులేని
ధారతో సదస్సు లౌర! మేల్ మేలని
పొగడఁగాఁ గవీంద్రయుగము నుడివె

మేటివలువ లిచ్చి నూటపదాఱు లొ
సంగి యూరివారు సత్కరించి
రాశుకవనవీరు లైనట్టి సుబ్బరా
ద్రమణకవుల భక్తిరమ్యు లగుచు        (1925)

వారి కణఁకువ చాటి జోహారు వొసఁగి
మూరిఁబోయెడు నుత్సాహమునకు లోగిఁ
నా యలంతితనమ్ము గానక నుతించి
నాఁడ నిట్లు కవీంద్రుల నాణియంబు

శ్రీశివ సత్కృపాగరిమచే సుకవీశబుధేశు లౌననన్
దేశములన్నిటన్ దిరిగి దిగ్విజయంబు గడించి దుర్మతా

వేశులఁ గింకవీశులను విక్రమలీల నడంచినట్టి మా
యాశుకవీంద్రసింహములకంజలిపట్టి నమస్కరించెదన్

మా కావూరికి నేగుదెంచి కడుసామర్థ్యంబుతోడన్ సుభ
ద్రా కల్యాణము నాశుధోరణి రసోత్కర్షమ్ముఁగాఁ జెప్పి య
స్తోకానందము గూర్చినారు కవిరాజుల్ వీరు సభ్యాళికిన్
శ్రీకాంతుం డనయమ్ము వీరి మనుచున్ శ్రేయమ్ములం గూర్చుచున్.

గడియకు నూరుపద్దెములఁ గల్పనచేసెను భట్టుమూర్తి యం
చెడఁదల నబ్బురంబు గననేటికిఁ గొప్పరపుంగవీశ్వరుల్
తొడిఁబడ కౌచితీగతికి దూరముగాని పదాళిఁగూర్చుచున్
గడియకు రెండువందల నఖండముగా వెడలించుచుండఁగన్

వేయి వచింపనేల పృథివీస్థలి నాశుకవిత్వ సత్కళా
ధ్యేయులు నేఁడు లేరని మదిం దలపోసి కొఱంతదీర్ప వా
గ్నాయకుడెంచి కొప్పర మనన్ దగువీట సృజించె నౌర! సు
బ్రాయకవిప్రభున్ రమణరాయని వేంకటశబ్దపూర్వులన్

సంస్కృతాంధ్రములందు సర్వతోముఖమైన-పాండితీసంపత్తి పడయఁజాలి
యఖిలరాజాధిరాజాస్థానముల యందు-వివిధావధాన వైభవము చాటి
శరవేగమునఁ బంచశతపద్యరత్నముల్ - గంటలోన వచించి గణుతికెక్కి
ఘనకవీంద్రుల నెల్లఁ గదిసి హోరాటమైఁ-దూలించి విజయదుందుభిని గొట్టి
యాశుకవిలోక చక్రవర్త్యాది సుప్ర
సిద్ధ బిరుదాళితో విరాజిల్లుచున్న
మీకు సరివార లెవ్వారు వాకొనంగ
క్షితిని గొప్పరపుం గవిశ్రేష్ఠులార!

తిక్కనార్యుఁడు వోయె దివికంచుఁ దలవంచి-కందోయి నశ్రువుల్ కార్పనేల
కవిసార్వభౌముఁ డక్కట! మహానటుఁగూడె - నిం కేమిగతి యంచు నేడ్వనేల
పూతభాగవత ప్రణేత పోతన రమా - నేతఁ జేరె నటంచు నెగు లదేల
ఘనుఁ డల్లసానిపెద్దన కవీంద్రుఁడు లేఁడు-నేఁ డిఁకేదిక్కంచు గోడదేల

తల్లి! వారలులేని లోటెల్లఁ దీర్చి
పొంకముగ నూత్నగతి ని న్నలంకరింపఁ
బ్రథిత కొప్పరపుం గవీశ్వరులు లేరె
సకలగుణపేటి! యాంధ్రభాషావధూటి!

కొప్పరంపువార లప్పుడు కరఁగి నన్
బెద్దమెచ్చి రైదుపద్దెములను
దక్కఁగలవు నీ కుదాత్తసమ్మానము
లెక్కఁగలవు చరిత నీ వటనిరి (నా కథలు- 28-6-1925)

## శ్రీ పరవస్తు చిన్నయసూరి

అంకిలిలేని పాండితియు, నన్యదురాసద శాబ్దికత్వపుం
బొంకము నీక దక్కినది పొమ్ము! తెలుంగుల నెల్లకాలమున్
లెంకలఁ జేసికొంటివి బలే! కనుసన్నలఁ గోవిదాళిచే
సుంకము లందికొంటివి యశోనిధివైతిగదయ్య చిన్నయా!

గాసటబీసటల్ సదివి కర్జ మెఱుంగఁగలేక సంతతా
యాసమునందు సోదరుల నారసి వాఙ్మయవార్ధి శేముషీ
భాసురమంథదండమునఁ బట్టి మథించి సుధీజగత్తు సే
బాసన లక్షణామృతము పంచితి వంచితవైభవంబునన్

అన్నన్న! నీతిచంద్రిక - నన్నుఁ గడున్ దనిపెఁ;దెన్నుగనకు నిది వేదం
బన్నను దొసంగు కలదా?- చిన్నయ మన పున్నెమునకుఁ జిహ్నము కాఁడా?

పురుషార్థము తురీయము నెఱుంగఁ గోరుచో-నుపనిషద్రాజమై యొప్పుదాని
భాషాస్వరూపంబు పరికింపనెంచుచో-శబ్దలక్షణమై యెసంగుదాని
లోకజ్ఞతా విశేషాకృతుల్ సూచుచో-నీతిశాస్త్రంబయి నెగడుదాని
చేతోహర రసానుభూతి నర్థించుచో-నుత్తమకావ్యమై యుండుదాని

సకలధర్మతత్త్వ సారమై విశ్వజ
నీనమై వెలుంగు "నీతిచంద్రి
కను" రచించి తెల్గుజనయిత్రి కిచ్చు నీ
పుట్టు ధన్యమయ్యెఁబో! కవీంద్ర!

వ్రాయఁగవచ్చుఁ గబ్బములు వందలు వే లెటులో శ్రమించి దే
శీయులు వానిఁ గైకొని భజింపరయే నవియేల? భాస్కర
చ్ఛాయలు నీదు సత్కృతులు సంచరణం బొనరింపకున్న చో
టీ యఖిలాంధ్రభూమిఁ గలదే! వలదే! యిటువంటిభాగ్యముల్.

జాతిద్వేషపిశాచదాస్యమున కిచ్చ న్మెచు దుశ్చిత్తులన్
నీతిత్యాగుల నిన్ సమస్తవిబుధానీకస్తుతున్ జేరు వి
ఖ్యాతిన్ దూల్పఁ గడంగి దొంగకృతులన్ గల్పించుదోషజ్ఞులన్
జేతోవీధిఁ దలంచువారలకు నిస్సీ! రోఁత వాటిల్లదే?

ఏతద్ధర్మతు లెంతచేసినను నీ కేలోటు వాటిల్లదీ
ర్ఘ్యాతీతుల్ సమబుద్ధు లుత్తములు సంఖ్యావన్మఖుల్ సూనృత
ప్రీతుల్ పూతచరిత్రు లీజగతి లేరే? పల్వురుత్సాహులై
చేత:పూర్వకగౌరవం బొసఁగి నిన్ సేవించు తెల్గుంబ్రజల్.

వేంకటరమణుఁడు సూనృత (శ్రీ దువ్వూరి. వేంకటరమణశాస్త్రి)
కింకరుఁడై ధూర్తవిబుధ కృత్రిమసృష్టిన్
జంకక చాటఁడె విద్వ ద
లంకృతి కాతనికి మ్రొక్కులం బచరింతున్.

ఎందాఁక గౌతమీ కృష్ణవేణీ తుంగ - భద్రా స్రవంతులు పరువులెత్తు
ఎందాఁక దెల్గుల కిలువేలుపై వేంక - టేశుండు లోకంబు నేలుచుండు
ఎందాఁక నమృతనిష్యంది కవిత్రయ - రచిత కావ్యంబు భారతము వెలయు
ఎందాఁక నాంధ్రుఁడ నే నంచు భావించు - మానిసి జగతిపై మలయుచుండు

ప్రాక్పయోనిధి వీచికాపాణిదత్త
మర్ఘ్యపాద్యాదిపూజనం బందికొనుచు
నీ తెలుఁగుతల్లి యెందాఁక నెసఁగుచుండు
నీకు దక్కినకీర్తి యందాఁక నిలుచు.

ఉన్నయ్యలలో దివికిం - జన్నయ్యలలో నెవండు సరి? తెల్గుపసల్
కన్నయ్యకుఁ బరవస్తువు - చిన్నయ్యకు నీకు నాంధ్రచింతామణికిన్.
16-2-1935 - పఱిగపంట.

ఓ చిన్నయసూరి! పరో - క్షాచార్యుఁడ వీవు నాఁకు, నస్మద్వాణీ
వీచుల కజస్రజీవన - రోచిష్మత్త్వమ్ము సమకుఱుత! నీకరుణన్.

ఆంధ్రపణినసూను వగుటయకాక ర
స ప్రలుబ్ధ హర్ష సంవిధాతృ
క్రమనీతికావ్యకర్తయునై సదా
తనత గన్న చిన్నయను భజింతు.

తిక్కన్నకుఁ జిన్నయ్యకు
మ్రొక్కెద, నాపాలి తెనుఁగుముద్రకు వీరే
దిక్కైరి, యెంతపలుకుం
జక్కన మెఱయించె సూరి శాస్త్రమునందున్!

తెలివిడికి సూరి చూపిన
పలుకులలో నెంతతెనుఁగు ప్రబ్బె!నయారే!
తెనుఁగున దుర్గము చిన్నయ;
పొలియదు తద్వర్గ మెట్టిపోరాటములన్.

నన్నయ తిక్కన యెఱ్ఱన
మున్నగు నాచార్యకవులముద్ర వడని ప
ల్కెన్నఁడు మెచ్చను; నాలోఁ
జిన్నయ కొల్వున్నవాఁడు జీవాత్మవలెన్

**శ్రీ విశ్వనాథ సత్యనారాయణ**
**(మహాకవి లేమిడిని స్వయముగా గాంచినతతి**
**"ఆవేదన"(అను తలబంతి)తో వ్రాసిన కవిత)**

అతఁడు తెల్గులతల్లి పుణ్యమ్ముపంట
యతఁడు తెల్గులబాస భాగ్యంపురాశి
యతఁడు కవిరాజు సంఖ్యావదగ్రగణ్యుఁ
డేల పుంభావభారతియే యతండు.

అతని గంభీరకవితారహస్య మెఱిఁగి
        మేలు మేలనువారు వేల్వేలె కాని
బెగ్గడిలి యూరసంబెత్తి మ్రగ్గుచున్న
        వారు లక్షలు లక్షలున్నారు జగతి.
కల్పమునఁబోని యుత్తమకావ్యసృష్టి
        వాని కలవోక, వాణి యవ్వానిరాణి,
యతనికి వచోవిధేయమై యఖిలశాస్త్ర
        పటలమది భీతిమై బరాబరులొనర్చు.
అతఁడు పల్కినపల్కు పాటై ధ్వనించె
నతఁడు వ్రాయుచ్చు వాక్యంబు హారికావ్య
రాజమై దేశదేశాల రాణకెక్కె
నతనిహృది రసవాహినియై తొణంకె

అతఁడు మహాకవిత్వదీక్షావలంబి
యగుచు నంతర్విలోకనం బట్టె విప్ప
యుగయుగమ్ములు దాఁటిన జగములెల్ల
రివ్వురివ్వున సాక్షాత్కరించి తీరు.

రంగ దుత్తుంగ వీచీ పరంపరాంచ
దభ్ర గంగా ప్రవాహమ్ము ననుకరించి
సజ్జనశ్లాఘనీయమై ముజ్జగంబు
చుట్టివచ్చు సమాసంబు కట్టు నతఁడు.

కుకవులకు నాతని విమర్శ గుండె గాల
మల్పబుద్ధుల కేనా(టి కంద( డత(డు
ప్రాచ్యపాశ్చాత్యవిజ్ఞానపండితుండు
పండితు(డె కాదు పండితాఖండలుండు

తెలు(గుహృదయమ్ము నందున్న తీపి నెఱి(గి
తెలు(గునుడికార మందున్న మెలపు నెఱి(గి
తెలు(గుసంస్కృతి యందున్న చెలువ మెఱి(గి
తెలు(గున కతండు సరిక్రొత్తవెలు(గు లిచ్చె.

పెటపెటార్భటుల దిక్తటులు వ్రయ్యలువాఱ( - జిచ్చఱపిడుగులం జిమ్మునొకట
నానందమాధుర్యమది సోడుముట్ట(గా( - దీయని తేనె లందించునొకట
జగమెల్ల( బులకించి సొగయు నట్టులు - కమ్మపసిగాలితర(గల విసరునొకట
జంతుకోటికి నూత్నచైతన్యము నొసంగు - తఱపివెన్నెల చాలు పఱవు నొకట
సొరులకొటారు తెఱగంటిసానిచేత
విశ్వమోహన గీతికల్ వెల్లివిరియ
రీవి చివురింప నాట్యమాడించు నొకట
నాతనికి లేదు దుష్ప్రాప మను గుణంబు.

ఇంతటికవీంద్రు లేమిడి యిట్టిదనుచు(
జెప్పుటకు నాదు లేఖిని సిగ్గువడియె
నిస్సిరో! యెంతదుష్కాల మీ తెలుంగు
జాతిలో( జీమునెత్తురుల్ సచ్చెనొక్కొ.

రాజరా జీగడ్డపై జన్మమెత్తెనా? - యేలినా(డా రాయ లీ పొలంబు?
సర్వజ్ఞసింగ మిచ్చటి గాలిపీల్చెనా? - భాస్కరుం డీనేల బ్రదికినా(డె?
తిక్కన్నగంట మీ దిబ్బపై మొరసెనా? - పెద్దన్న యిచ్చోట( బెరి(గెనొక్కొ?
కవిసార్వభౌము(డిక్కడ మెప్పులందెనా? - వేమభూవిభు( డిందు వెలసెనోటు
కటకటా! నే(టి కివి స్వప్నగాథలయ్యె( - దులసివనమందె గంజాయి మొలకలెత్తె
నెన్ని నాళ్ళుండు నాంధ్రున కీ తమస్సు - కలదె యేనా(టికైన మోక్షంబు మనకు.

కవితారసాస్వాద కౌతుకవ్యగ్రులై - దండయాత్రలు నిల్పు దండిదొరలు
రమణీయకావ్య సారస్వతావేశులై - కవుల పల్లకిమోయు నవనివిభులు
తెల్లవారకముందె దినవెచ్చముల నంపి - కృతికర్తలను గొల్చు పృథివిపతులు
కనకాభిషేకసత్కారమ్ము లర్పించి - కవికృపా విభవంబు గాంచు ప్రభులు
నృపుల యౌదార్యమునకు వన్నియలొసంగి
శారదాపూజ లొనరించు సచివమణులు
నేఁటి కవిశేఖరుని దైన్యపాటు సూచి
కుములుచున్నారు చచ్చి స్వర్గమున నుండి.

బెంగాలీకృతికర్త పాదముల కర్పించు న్నమస్కార, ము
ప్పొంగుం బారసి లేఖినీ విలసనంబుల్సూచి; రావయ్య! నా
బంగారంబ! యటంచు నాంగ్లకవి నాహ్వానించు; నే పాపమో
రంగా! మెచ్చఁడు తెల్గుబిడ్డ కవిసమ్రాట్టున్ స్వదేశీయునిన్.

బ్రతికి నన్నాళ్ళు దుర్భరాపదలఁ గుడిపి
చచ్చినంతనె యాత్మకు శాంతివల్కి
వీరపూజలు గావించు వెఱ్ఱితనము
తెలుఁగుదద్దమ్మకే సమృద్ధిగ లభించె.

ఇది వెఱ్ఱితనంబని ప
ల్కుదునా? మఱి తోడివాని గుణగౌరవ సం
పద కోర్వలేని నైచ్యా
స్పద మీర్ష్యాదాస్యమనుచుఁ బ్రకటించెదనా?

లోక మితనికి నేవమ్ము గాకమున్నె
యాఁకటికి డస్సి జీవముల్ పోకమున్నె
పట్టుఁడీ! బ్రహ్మరథము నీ భావుకునకు
నవల నేడ్చిన లాభ మావంతలేదు.

చవియు సారంబు నెఱుఁగని చచ్చుకవులు
పుట్టకొక్కులవలె సదా పుట్టుచుండ్రు

సర్వతంత్ర స్వతంత్రుఁడౌ సత్కవీంద్రుఁ
డెన్నఁడో కల్పమున కొక్కఁడే లభించు. (పెద్దకాపు 8-2-1938)

### కవయిత్రి మొల్ల (రామాయణమును రచించెను)

మల్లెలు పూచెఁబో! మలయమండల మారుతశాబకంబు ల
ల్లల్లన వీచెఁబో! చవుల కాశ్రయముల్ మకరందవాహినుల్
వెల్లువ లయ్యెఁబో! తెలుఁగులేమ కపూర్వయశం బొసంగుచున్
నెల్లురి మొల్ల రామధరణీపతిపుణ్యచరిత్ర పల్కినన్.

కుమ్మరిపిల్లవంట, పలుకుంజవరాలికి నీకు బాంధవం
బెమ్మెయి నబ్బె, నీకుఁ జదు వెవ్వఁడు సెప్పె, నుదారతానిధా
నమ్మగు నమ్మహాపురుషునామము సెప్పెదవేని, హృద్యప
ద్యమ్ము లొసంగి వాని శతథా నుతిసల్పుదునమ్మ! సోదరీ!

తెలుఁగులనోముపంటయగు తిక్కనకావ్యము తాటియాకుపైఁ
దొలుత లిఖించు భాగ్యమును దోఁచిన వ్రాయసగానికోవలో
మొలచినమొక్కవా చరితమున్ వినిపింపుమ, యట్లుగానిచోఁ
గలుగునె నీకు నింతనవకమ్మునఁ గబ్బముగూర్చు నేరుపుల్.

చూచినయంతనే, చదువఁజొచ్చినయంతనె యర్థభావముల్
పూచి ఫలించునేని యదెపో! సుకవిత్వపదంబు నందఁగా
నోఁచిన కైతయం చతిమనోహరఫక్కి వచించి, నీ ప్రతి
జ్ఞాచరణంబు సార్థకమ యౌనటు సల్పితి వింతయొప్పునే!
6-4-1938 - పఱిగపంట.

### శ్రీవిశ్వనాథ సత్యనారాయణ

పనిఁబూనెన్ యువరాజు సత్కృతిసభాప్రారంభముంజేయవా
రని వేడ్కన్ బ్రకటించె విజ్ఞుఁడు మహారాజేంద్రుఁ డధ్యక్షుఁడై
యనవద్యంబగు నిట్టిసేఁత "కవితాయద్యస్తిరాజ్యేనకి"
మ్మను లోకోక్తికి వన్నెదెచ్చెఁ గవిరాజా! సత్యనారాయణా!

ఏనుఁగు నెక్కినారు, ధరణీశులు మ్రొక్కఁగ నిక్కినారు, ప్ర
జ్ఞా నిధులైన నీదు గురుచంద్రులు తిర్పతివేంకటేశ్వరుల్;
ఏనుఁగు నెక్కి, రాజులు కవీంద్రులు మ్రొక్కఁగ నిక్కి, దేశిక
శ్రీనెఱి నిల్పఁబెట్టితివి, శిష్యత సార్థకమయ్యె సత్కవీ!

పండెం బండెను దావకీనము తపఃప్రారంభ మాశాతతిన్
నిండై పారద శారదాంబుద సుధానీహార గీర్వాణవే
దండాఖండల హేతిపూత రుచిసంతానాభిమానంబులన్
జెండెన్ గీరితి యుష్మదీయము; జయశ్రీ గంటి వోసత్కవీ!

కైవసంబయ్యె సంఖ్యావన్నుతంబు నీ - ధీ చాతురికి సాహితీజగత్తు
కైసేసికొనియె నీ కవితాపరిష్క్రియల్ - రాణించు పత్రికారాజి యెల్ల
పింపిళ్ళుగూసెఁ బొంపిరివోవు నీ కృతుల్ - రసికజిహ్వా దివ్యరంగభూమి
కడలొత్తి మొరసెఁ గింకవిలోకసంతాప - కారి నీ విజయశంఖారవంబు

మల్లడించెఁ గదోయి సమస్త భూప
మస్తకన్యస్త మకుట ప్రశస్త మౌక్తి
కస్త బకజాయమానరోచిస్తరంగ
సంతతి నిరంతరంబు త్వచ్చరణ పీఠి.

దిద్ది తీర్చెద వహెూ! తిక్కనార్యుని భంగి - శబ్దార్థ గాంభీర్యసంగతముగ
భాషింతు కవిసార్వభౌము చందమ్మున - సర్వాగమజ్ఞానధూర్వహముగ
సంతరించెద వల్లసాని పెద్దనవోలె - రమణీయ కల్పనా రాజితముగ
రచియించెదవు రామరాజభూషణుఫక్కి - నిరుపమశ్లేషార్థ నిర్భరముగ

కూర్ప నేర్చెద వల చేమకూరవాని
రీతి జాతీయవాణీ నికేతనముగ
వినుతిగాంచితి విశ్వమోహనకవిత్వ
శిల్పవిన్యాసపటిమ నార్జించి సుకవి!

వలచు నొక్కొకచోట వాసంతమల్లికా - ప్రసవస్తబక హారిపరిమళంబు
వీచు నొక్కొకచోట వివిధసంతాప ని - ర్మథనార్హ శీతల మారుతంబు
కవియు నొక్కొకచోటఁ గువలయానంద సం - పత్ప్రద జ్యోత్స్నాగభస్తిచయము
చిందు నొక్కొకచోట జిహ్వాప్రమోద కృ- న్మందారమకరంద బిందుకోటి
తరలు నొక్కొకచోట సుధాస్రవంతి
ఉబుకు నొక్కొకచోటఁ గవోష్ణరక్త
ములియు నొక్కొకచోట గీతోత్సవంబు
తరమె కొనియాడ నీ కవితాప్రశస్తి.

12-1-1942 (పఱిగపంట-మొదటికూర్పు)

**భావవిప్లవవిధాత శ్రీత్రిపురనేని రామస్వామి చౌదరి**

యుగయుగమ్ములు బొజ్జనునిచి కృష్ణమతల్లి-యాంధ్రలక్ష్మి కొసంగు నమృతకలశి
అందందుఁ జెదరి సొంపఱి నేఁటి కొక్కచో-ముద్దగట్టిన ముద్దుముద్దు తెలుఁగు
దివినున్న సకలాంధ్రకవిరాజ రాణ్మహః-ప్రాతినిధ్యము బయల్పఱుచు వెలుఁగు
శ్లాఘావిలంఘన జాంఘికప్రతిభచేఁ-గమనీయకావ్యముల్ గన్న గేస్తు
ఏడుదీవుల కవ్వాల నేపుసూపు
కొండనెత్తమ్ముపై నైజగుణలతాళి
కల్లువెట్టిన గడుసరి హాలికుండు
త్రిభువనీ పూజ్యతముఁడు మా త్రిపురసుకవి.

కృత్స్న వేధస్సృష్టికిని మాఱు కల్పించి - సడిసన్న గాధిపుత్రుఁడవు నీవు
విశ్వకల్యాణంబు వెలయింప జీవముల్ - ముడుపుగట్టిన శాక్యమునివి నీవు
దుర్వాద దుర్మత ద్రుచ్ఛిదావిధిలోన - రాటుదేలిన కుఠారంబ వీవు
నిఖిలధర్మాధర్మనిర్ణేతయై జగ - ద్గురుపదం బేలు సూతఋషి వీవు

తెలుఁగు కావ్యమ్ముపైఁ గోర్కి తీవరింప
సురల వీడిన కాళిదాసుఁడవు నీవు
పరిణతాంధ్రప్రసూతపః ఫలమ వీవు
త్రిపురనేనికవీ! నీ కిదే జొహారు

సన్నని సంస్కృతాంధ్రముల సొరులు గుప్పెడు నీకలమ్ములో
నన్నయతిక్కనల్ కదలి నాట్యముసేయుదు; రాంధ్రవాణి బల్
ప్రన్నని హైమనూపుర ఝుళంఝుళలన్ లయ చక్కదిద్దు; నీ
కెన్ని భవంబులం దొదవె నింతటిపుణ్య మగణ్య మగ్రజా!

వెన్నెలజల్లు, సొరవనవీథులు పంపెడి కమ్మగాలి, క్రొం
గొన్నన పచ్చితేనె, జిలుఁగుం గపురంపు బిడారు, తెల్గులేఁ
గన్నె పసిండిమట్టె బయకారి ఘలంఘల, నీదు కైతకుం
జిన్నరి తోడఁబుట్టువులు సెప్పఁగనేటికి నీ యదృష్టముల్

క్షత్రకులంబునందుఁ గవిసత్తము లెందఱొ లేరుగాని లో
కత్రయమేని కిమ్మనదుగా ననెచోడనితో నృసింహరాట్
పుత్రుఁడు కృష్ణరాయ కవిపుంగవుతోఁ దమతో సదృక్షులై
ధాత్రిఁ బ్రసిద్ధిగన్న కవితల్లజు లెవ్వరు లేరు లేరనన్.

చాళుక్యనరపాల సంపత్పయోధిలో-మునిఁగి తేలినవాఁడు మొదటిసుకవి
మనుమసిద్ధిని వెట్టిమామయ్య నొనరించి-దిక్కులేలినవాఁడు తిక్కయజ్వ
రడ్డివేమన రాజ్యరమ లేఁతనవ్వులోఁ - జివురించినాఁడు కాశీప్రబంధ
సార్వభౌముని భుజాస్కందమ్ముపై నెక్కి -తద్ద వెల్గినవాఁడు తాతగారు
గ్రుడ్లు ఱిక్కించి పెదవులు కొఱుకుకొంచు
నబ్రపడఁబోము వీరి కావ్యమ్ము లరసి
ముసురుకొన్న దిగుళ్ళలో మున్కలిడుచు
నెట్లు సూతపురాణ మూహించితయ్య.

తెన్నాలిన్ నివసించి, ప్రౌఢకవితా దీవ్యన్మతిన్ రామకృ
ష్ణన్నన్ మ్రింగితి, వంతఁబోక గురజాలామాత్యురేచెర్ల బ్ర
హ్మన్నన్ జీర్ణము చేసికొంటి, విఁక మా హక్కైతి వీ మాట కా
దన్నన్ గెల్తుము కోర్టులోన భయమేలా మాకు బారిష్టరూ!

గురువులు నేర్చునాఁడె గురుకుంజరుఁడౌ చెళపిళ్ళశాస్త్రి కా
దరువయి కొప్రపుం గవులధాటి కెదుర్కొని పౌరుషప్రభల్

కురియుట కేమి? యీ గడియకున్ సడలింపని కాసెకోకతో
దురము దురం బటంచు రణదోహలముం బ్రకటింతు వీ వనన్.

ఎన్నోబాధలు, ప్రాణగొడ్డములు, ని న్నేడాటలాడింపఁగా
విన్నంబోవక, జాతిగౌరవసమావిర్భూతికై, నీతికై
యన్నా! సర్వము ధారవోసితివి, నీ యౌదార్యమున్ శేముషీ
స్కన్నుల్ దున్నలు మన్నుజెఱ్ఱు లెఱుగంగా లేరు వీరోగ్రణీ!

నేఁటికి వక్కలాకు లిడనేర్చిరె నీకుఁ దెలుంగువార, లీ
నాఁటికి మెచ్చుకొంటయు మనస్సున కించుక శాంతిఁగూర్చులే
మాటల కేమిపో! తెలుఁగుమానిసివై మఱి కమ్మబిడ్డవై
పాటిలకున్న ని న్నెపుడొ బంగరుపువ్వుల ముంచియెత్తరే!(16-2-1942-పఱిగపంట)

### శ్రీ ఏటుకూరి వేంకటనరసయ్య

నీ కవితామహత్తకు ననేకశరత్తులనాఁడె సమ్మద
శ్రీ కలితుండనై చెలిమి చిందఁగ నుజ్జ్వలమైనభావి నీ
కై కలదంచు నుత్తరము నంపితి, నింపితి నాశిషమ్ము, నా
లేక ఫలించె నేఁడని చలింపనిగర్వము గంటి సోదరా!

ఎపు డీ పండుగు వచ్చునో, తెలుఁగునాఁ డేనాఁడు నీనాణెముల్
విపులాసక్తిని మెచ్చునో యనుచు, నువ్విళ్ళూరు నస్మాదృశుల్
తపముల్ పండినయట్లు పొంగి, రఖిలాంధ్రక్షోణియున్ నీకు నేఁ
డుపదల్ పెట్టి వివేకమున్ గురిసె నీయోగమ్మొ భోగమ్మురా!

భవదీయంబగు "వీరభారత" మహెూ!ప్రత్యక్షరప్రౌఢమై
నవలావణ్యశరణ్యమై ఋషివరుల్ నన్నయ్యభట్టాది స
త్కవిమూర్ధన్యుల శిల్పసంపదలకున్ గాణాచియై యుంట నీ
భవమున్ ధన్యముఁగాఁ దలంతురు రసప్రాజ్ఞుల్ కళారాధకుల్

కారెమపూఁడిరంగమునఁ గయ్యము రేఁగిననాఁడు పౌరుష
శ్రీరుచిరుండవై రిపులఁ జెండిన యోద్ధవు నీవు; నాఁటి నీ
దారుణఖడ్గ మా నిశితధర్మము వీడని గంటమై పురా
వీరపరంపరా ప్రధనవిక్రమరేఖ వెలార్చు నేఁటికిన్.

పద్యమున గద్యమున గేయపద్య నొఱపు
నెట్లు వడసితి నరసయా! యిది పురాణ
పుణ్యములు సంతరించిన పొలి యటంచుఁ
దలఁచి పులకింత్రు సాహితీతత్త్వవిదులు

ఒసపరి తెలుంగు నీ కై
వసమ్మురా! నీ వచించువాణికి నసువై
పసగుల్కున్ నుడికారము
ప్రసన్నమై రసికభావ పర్వోదయమై

ఏను దిక్కనాఖ్య నెసఁగుటఁ దత్ "కవి
బ్రహ్మ" పట్ట మీవు పడసియుంట
నేన నీవు, నీవ యే నైతి-మగుట నీ
గరిమ నాదుగరిమగా సుఖింతు. (శబల-22-4-49)

**ఆస్థానకవి, శతావధాని శ్రీచెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి**

కింకవిరాజమత్తగజకేసరియై తెలుఁగుం గవిత్వపుం
బొంకములెల్లఁ జూపి, రుచిపోయిన శారదసోయగంబులో
వంకలు దిద్ది, సత్కవుల వందల వేల సృజించె నెవ్వఁ డా
వేంకటశాస్త్రి కంచిత కవిత్వవిధాతకుఁ గేలుమోడ్చెదన్.

అంకిలిలేనిధాటిని సహస్రవధానము లాచరించి స
ర్వంకష నైపుణుల్ మెఱసి వారికి వీరికి నంధ్రసాహితీ
కింకర తానురక్తి నొలికించి రహించినవీరుఁ డెవ్వఁ డా
వేంకటశాస్త్రి కంచిత కవిత్వవిధాతకుఁ గేలుమోడ్చెదన్.

జంకనిశేముషీపటిమ సాయముగా ననిరుద్ధవృద్ధతా
పంకమునందుఁ జిక్కియు నభంగురశిల్పసమగ్ర నూతనా
లంకరణమ్ములన్ నుడివెలందికిఁ బండువుసేయు నెవ్వఁ డా
వేంకటశాస్త్రి కంచిత కవిత్వవిధాతకుఁ గేలుమోడ్చెదన్.

లెంకలవోలె నెవ్వనిఁ జలింపనిభక్తి భజింతు రాంధ్రు ల
భ్రంకషకీర్తి పెంపున సుపర్వధునీ విహరన్మరాళి కా
హంకృతిఁ దూల్చు నెవ్వఁ డజరామరవాఙ్మయమూర్తి యెవ్వఁ డా
వేంకటశాస్త్రి కంచిత కవిత్వవిధాతకుఁ గేలుమోడ్చెదన్.

ఓ కవిసార్వభౌమ! భవదుజ్జ్వలయోగ మపూర్వ మెన్నఁడున్
నీకడ రామశబ్దమును నేర్చు టెఱుంగనివార లెందఱో
మాకును జెళ్ళపిళ్ళకవిమండనుఁడే గురుఁడం చహో!నమో
వాకములిచ్చి నిన్నుఁ గొలువన్, బులియున్ గనువారిదంతముల్.

మాటలు పెక్కేలా, తొలి
నాఁటి కవిబ్రహ్మ తిక్కనప్రభుఁ; డీవో
నేఁటి కవిబ్రహ్మవు; నీ
నాటిన మల్లియలు తెల్గునాఁటి కవీంద్రుల్.

తోఁటఱవజాతి నీయది
యౌటన్ దోహదము కరతలామలకంబై
వాటిల్లె నందనవనీ
వాటీ సౌరభము నీదు వనవీథికలన్.

చెన్నక్ష్మాపరిపాలకుల్ శతముఖశ్రీమత్కళా సాగరున్
నిన్నాస్థానకవీంద్రుఁ జేసిరటె యాంధ్రీకీర్తి చిహ్నంబుగన్
నన్నూతేఁడులనాఁటివైభవము కన్నా రిచ్చటన్ దెల్గువా
రన్నా! పున్నములెల్లఁ జేరినవి సహ్యాగ్రావజాతీరమున్.

కంటిమె యిట్టివింత, సరకారు కడుంగడు గాసి కోర్చి, నీ
యింటికె వచ్చి, నీకు బిరుదిచ్చిరి మెచ్చిరి కాన్కపెట్టి; నీ
వంటి కవీంద్రుఁ డిట్టివిభవమ్మున కర్హుఁడ, కాని దీనిఁ గ
న్గొంట ప్రజాప్రభుత్వమునకున్ సరిక్రొత్త వెలుంగుఁదెచ్చెడిన్.

రాచఱికమ్మువారు కవిరాయని కిచ్చుటఁ బుష్పమాలికల్
వైచుటఁజేసి యీవిజయవాడ తెలుంగులరాచవీడుగా
నోఁచినమాట నూటికిని నూఱువిధాల యథార్థ మమ్మహా
రోచికి నేఁటిపర్వ మవిరుద్ధ ముపశ్రుతిగాఁ దలంచెదన్.

7-9-1949 - పఱిగపంట

**శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు**

గౌతమునియందు గాంధిని గనియె నితఁడు
గాంధిలో గౌతముం బొడగాంచె నితఁడు
ప్రాఁతక్రొత్త చక్కనలకుఁ బ్రాపుగాఁగ
వలచివలచి నెఱాకైత వ్రాసె నితఁడు

యుగధర్మ మెఱిఁగి లోక
ప్రగతికి నాధారమైన పద్యము గద్యం
బగురా!యని జగ మలరన్
నిగదించి యితండు కవులనేర్మిని జాటెన్.

కోవిదుఁ డీకవి మానవ
తావాదము నాదరించు తమి గలఁ డగుటన్
మావర్ణమ గొప్పదియను
జీవన్మృతవాద మెపుడు సేయఁడు, వినఁడున్.

ఎళ్లనవలెఁ దెలుఁగుంబస
వళ్లులుగాఁ బఱవఁ గైత వ్రాయు నితండున్;
గుళ్లము నిక్కవి తన చదు
విళ్లింకఁగ బండివెనుక కీడ్వఁడు పూన్పన్.

ఏది పొసఁగకున్న నేమి, టాగూరు కా
వ్యములు చదువుభాగ్యమబ్బె నాకు
నీఫలంబ చాలు నీజన్మమున కన్న
కవి యితండు తెల్గురవి యితండు.

చెళ్ళపిళ్ళ మహాకవి యుల్ల మలరు
బాటలో గురుభక్తిని జాటినట్టి
సరసుఁ గాటూరి వేంకటేశ్వరుఁ దలంచి
మేలు మే లని కవికోటి మేను మఱచు.

పాకమును మార్చి కవితను బ్రజల యందు
పాటునకుఁ దెచ్చె వైదుషీపేటి గురుఁడు;
భావమును మార్చి కవనమ్ము ప్రజలమదికి
బింబ మనిపించె శిష్యుఁ డభిజ్ఞు లలర.

అంతనిర్దుష్ట, మంతయొయ్యారి యైన
కైత నేర్చిన కాటూరికవి యితండు
నిండుకుండవిధానఁ గన్పించు నదిర!
వినయ మీతనితోన యావిర్భవించె.

సరళస్వభావుఁ డగుటన్
బరమోదారమ్ము భువనపావనగంగా
ఝరసోదర మగుకవనము
కురిసెను గాటూరిపుణ్యకులుఁడు ఘనుండై.

కవిగుణమ్ము లతని కవితన్ బయల్పడు
శైలి నంటి భావసరణిఁ బట్టి
పోతరాజు పుణ్యపురుషుండు కానఁ ద
ద్భాగవతము మనకుఁ బాసె మయ్యె.

పింగళికవిపంచానను
సంగతితో నితఁడు పల్కు 'సౌందరనందం'
బంగద నడంచె రసికున
కింగలమై వెట్టగూర్చె నీర్ష్యాళునకున్.

హరిజనుఁడు తిర్మలేశుగర్భాలయమున
నర్చసేయంగ వలచి యుదారు లలరఁ
గావ్యమల్లిన విప్రుఁ డీకవి; సమస్త
నరవికాసమ్ము వలచు మనస్వి యితఁడు.

రావణుని వైరభక్తిపై వ్రాసినట్టి
కబ్బ మితనిది చిన్నదౌఁగాక, యదియ
చాలు నపరవాల్మీకినా నేల నాల్గు
దిశల నితఁ డజరామరయశము నంద.

ఈ సర్వము నొకయెత్తుగ
నీసునకున్, గర్వమునకు నెంతయు దవ్వౌ
నీసుజనత యొకయెత్తుగ
దాసిన చుట్టంబ వైతి ధర నెల్లరకున్.

ఒండొరులు చేరినపుడు "కాటూరి" కులుఁడు
మిక్కిలిగ నన్నె నన్నె ప్రేమించు ననుచుఁ
బెనఁగుదురు నీప్రసక్తిలోఁ దెనుఁగువార
లెంత పండి తహెూ! వేంకటేశ్వరకవి! (నా కథలు)

**శ్రీ బూదూరి రామానుజులురెడ్డి (రాయలసీమ)**

రామానుజరెడ్డికి ననుఁ
బ్రేమించు నుదారమతికిఁ బిన్నలు పెద్దల్
తోమాలియ లర్పించుట
శ్రీమద్భారతికి భక్తిసేయుట యనెదన్.

శిక్షితచిత్తుఁ డాంధ్రబుధసింహుడుఁ ముప్పదియేండ్ల సాహితీ
దీక్ష ఫలింప శిష్యుల సుధీజనమాన్యుల సాధుజీవికా
దక్షులఁ జేసినట్టి గురుతల్లజుఁ డీమహనీయుఁ డంచు నేఁ
డీ క్షణమున్ ఘటించి సుకవీంద్రుల నుత్తమశాస్త్రభారతీ
రక్షకులన్ రసజ్ఞుల నిరంతర సత్కవితా సమర్చ నా
తిక్షుధితాత్ములన్ బిలిచి తియ్యమునెయ్యము చూపి దేశికున్
లక్షణచోదిత క్రమములన్ గొనియాడి బహూకరించు న
ధ్యక్షులు సభ్యులున్ నుతికి నర్హులు, వీరి కఖండధాత్రిలో
నక్షయకీర్తి కల్గుత! మదాప్తుఁడు బూదురుసత్కులుండు ప
ద్మాక్ష దయాబలమ్మునఁ జిరాయువు నంది నిలింపరాడ్వ నీ
వృక్ష లతాంతకాంతకృతి విశ్వవిరించనుఁడై త్రిలింగ వా
ఙ్మక్షర చారిమప్రదగ ణాగ్రసరత్వము గాంచి శాంతి దాం
తిక్షముఁడై ముముక్షుకులదీపకుఁడై హవణించుఁ గావుతన్!

(26-10-1954 - సమదర్శి)

**జంటకవులు**

**శ్రీపింగళి లక్ష్మీకాంతము-శ్రీకాటూరి వేంకటేశ్వరరావు**

**(కావలిలో సమ్మానము జరిగినతఱి)**

జయ!జయ! లక్ష్మీకాంతకవిసత్తమ! పింగళివంశవర్ధనా!
జయ!జయ! వేంకటేశకవిచంద్రమ! కాటురివంశమండనా!
నయన మహస్సుగాఁ దెనుఁగునాఁడు సమస్తము నేఁడు మీ మహో
దయమును గాంచి ధన్యతకుఁ దావలమయ్యె రసప్రశస్తమున్.

వా గపరావతారమన వచ్చిన వెంకనపల్కుఁదేనియల్
వాఁగులువాఁగులై తెలుఁగువాడల సాగిననాఁడు పుణ్యపుం
దీఁగలు మీవి పూచినవి దివ్యదఖండకవిత్వభావ నో
ద్వేగము నిండి వాఙ్మయసవిత్రికి మీ రుడిగమ్ము సల్పఁగన్.

వందలు వేలుగాఁ గృతులు వ్రాయరు మీ-రటులైన నేమి? మీ
"సౌందరనంద" మొక్కటియ చాలును జాతికి నెల్లకాలమున్

విందులుసేయ ధర్మపదవీనదవీయసియైనబుద్ధి నీ
యం, దురితమ్ముఁ ద్రోయ, సకలాధిలతల్ మొదలంటఁ గోయఁగన్.

మఱచిన బుద్ధగౌతముని మాటలు బాటలు; కంటిముందటన్
జరిగిన బాపుజీబ్రదుకుచందము లందము; లొక్కతావునన్
మెఱయునటుల్ మహామతులు మీ రొనరించిన సృష్టిలో వినూ
త్న రుచినిధానమై యొక సనాతనధర్మము గోచరంబగున్. (1-1-1955 - శబల)

**ఆదికవి నన్నయభట్టు**

నన్నయ మదియున్, మాటయు
వెన్నయ కద;శైలి సాంధ్యవేశానట దీ
శోన్నత శిరస్సర ద్దివి
షన్నది కద; మెత్తు నితని సాధీయస్తన్.

నన్నయ తెల్గుభారతి కొనర్చినసేవకు నంజలింతుఁ, గా
ర్కొన్న మొగుళ్ళఁజీల్చి తెలుఁగుం జదలింట నతండ మున్నుగాఁ
బ్రన్నని దివ్వెపెట్టె; నది పల్మఱుమెచ్చెదఁగాని తెల్గుపైఁ
గన్నిడలేకపోయె; నిది కాలమహత్త్వమొ? తత్త్వభేదమో?

ఇంచుక సందుఁజూచి తలయెత్తిన క్రొత్తమతమ్ముతోఁ బ్రవే
శించెను సంస్కృతంబు మన సీమకు; సత్తులు చిత్తు లెన్నుచున్
మంచిదటంచు నాదికవి మక్కువసూపి తదీయవాణిలో
ముంచెను దెల్గుభారతము; మోసిన దయ్యది పల్లెపల్లెలన్.

ఎఱుఁగని పల్కుగాదు తెలుఁగీ కవిమౌళికి; సోమయాజులన్
మఱచువిధానఁ దాఁ దెనుఁగుమాటలతేట లొకొక్క తావునం
బఱపెను; గాని తెన్గులకుఁ బల్కెడి కైతల నెంతసంస్కృతం
బురలిననేమి యన్న తెఱఁ గొక్కటినేర్పె; నిదెంత పాడియో?

(1955-ఉదయగానము)

**ఎఱ్ఱన**

జోతలు వెట్టెద ముద్గల,
గౌతమ గోత్రజుల నడుమ గదలని కవితా
సేతువు గట్టిన ధిషణా
జ్యోతికి శ్రీవత్సగోత్రజునకు వినీతిన్.

**తిక్కన సోమయాజి**

అతడుఁ నితఁడు గాడు హరిహరనాథుఁడే
కరము సాఁచె నీదు కైత కలరి
తెనుఁగుబాస కెంతదీప్తి దెచ్చితివయా!
తిక్కనార్య! నీ కిదే జొహారు.

ఒక తిక్కన సాలఁడె యీ
సకలాంధ్రమునకును జీవసంపద నొసఁగన్
వికసించినట్టి తప మి
ట్టి కొడుకుగా నవతరిలె నటే! కొమ్మనకున్.

కొమ్మన్నా! నిను మెచ్చుటన్ దనియ, నీకుంగూర్చు నిల్లాలి నా
యమ్మం గొల్చెద నన్నమాంబను, దెనుంగాటాడు గుంటూరిలోఁ
గమ్మంగాఁపురమూని యా వెలఁది యీ కన్నయ్య పెన్నాఁకటిన్
జిమ్మన్ ఱొమ్మిడునాఁడె చేఁపినదిరా! చిన్నారి తెల్గుం బసల్

ఒగుడయి కుందు నాటినుడి కూఁటసెప్పి, మహాకవిత్వ దీ
క్ష గొని పదేనుపర్వములు సాత్యవతేయకృతిన్ దెలుంగు పెం
పు గునియఁ బల్కినట్టి కృతపుణ్యుని తిక్కనపుట్టుగడ్డ యా
నగరము గుంటవీడు తొలునాళులఁ బట్టిననోము లెట్టివో!

కూఁకటి సొంపులన్ బెరుఁగు కొట్టరుతిక్కన కృష్ణగట్టునన్
దూఁకుచు, మేనమామలు కుదుర్కొని వెల్గెడి వెల్లటూరఁ దా

టాకులమీఁద వ్రాసికొనె నక్కరముల్ పదముల్; తదుర్వి నన్
సాఁకిన కాణయాచి సరస స్గల దంటకు మేను పొంగెడిన్.

తనదెస దండనాథుఁడయి తన్ను గదించిన కొమ్మమంత్రికిన్
దనయుఁడు తిక్కనార్యుఁ డుపధాపరిశుద్ధచరిత్రుఁ డౌట న
మ్మనుమ విభుం డెఱింగి బతిమాలి మహామతి నీతనిన్ నిజ
ప్రణిధి ఫలింప నిల్పుకొనెఁ బజ్జల నుజ్జ్వలకీర్తి దక్కఁగన్

కొఱటిపాటిరెడ్డి గుంటూరిప్రెగ్గడ
యేటుకూరికాఁపు పాటిమాల
గారపాటి కమ్మవారి నెన్నుడి కవి
బ్రహ్మ నోట మొరసె భారతముగ.

తోఁచినతావు, దేశికులతో శ్రుతిశాస్త్రపురాణకావ్యముల్
లోఁచిన తావు, తెల్గునుడి లోఁతులు సూచినతావు, జవ్వనం
బాఁచినతావు, గర్తపుర; మైనను గొమ్మనపట్టి గంటమున్
సాఁచినతావు మన్మనృపసత్తము నోలగ;మేమి సెప్పుదున్

చుక్కలమేలుముల్ గననిచోటులు, భానుమయూఖమాలికా
రుక్కులు సోఁకి వెల్గుట యెఱుంగని తావులు, నుండుఁగాక; స
మ్యక్కవితానిరూఢము, సమంచిత ధర్మరమాశ్రయమ్ము మా
తిక్కన భారతమ్ము నినదింపని తెల్గుపొలమ్ము లేదురా!

జిగిసెడి మూల్గు తెల్గునకు జీవమునింపి, నిలింపవాణికిన్
సొగసులు దిద్దు విన్నువు చూపి, తగన్ బృహదంధ్రభారత
ప్రగతి ఘటించి, పుణ్యములు పంచినవేలుపు తిక్కయజ్వ, నా
మొగదల నిల్చి, కావ్యపథముల్ సుగమమ్ములుగా నొనర్చుతన్.

మున్నటి తిక్కనాదికవిముఖ్యు లొసంగిన వాసి నిల్పఁగాఁ
గన్నిడి, కబ్బముల్ నుడువు కైసరు లీసడిసన్నసీమ నీ

పున్నెపునేల మాదృశులు పొల్తురు నేఁడు; తెలుంగుబాస కీ
యన్నలు సేయు నూడిగము లచ్చము లగ్గలముల్ నెఱాసరుల్

అల నన్నయ్యకులేరు, తిక్కనకుఁగా కాంధ్రప్రజానీక హృ
జ్జల జోన్మీలనకృత్ ప్రభాకరవిభాసంకాశ సాధూక్తి మం
జుల పుంభావసరస్వతుల్ గుణగరిష్ఠుల్ భావుకుల్ భక్తు ల
స్ఖలిత స్ఫార యశోమహోధవళి తాశాసానువుల్ మాదృశుల్.

సుకృతమ్ము పండి పలుగుం
డ్రకు నందని తెనుఁగు నుడుగునన్ జనవు గడిం
చి కవిశ్రేణిం జేరితి
వికత్థన పరంపరలకు వినతుఁడ నైతిన్.

తిక్కనయజ్వ వరించిన
ఫక్కిని దెనుఁగుందనమ్ము పాయక, సుమనో
వాక్కులు విడువక, యౌచితి
తక్కక, మనకవి కృతార్థతన్ గనవలయున్.

(ఉదయగానము +++ 1955)

**శ్రీ విశ్వనాథ సత్యనారాయణ (షష్ఠి పూర్తి సమయము)**

జయ!జయ!షష్టివర్షవయసా! పరిపక్వ రసైకభావనా!
జయ!జయ!నిర్నిరోధయశసా! పరిపూర్ణ కవిత్వజీవనా!
జయ!జయ!చిక్కణోక్తిపయసా! పరిపోషిత సాహితీవనా!
జయ!జయ!విశ్వనాథమహసాపరిపూత! కృతాంధ్రసేవనా!

అఱువదియేండ్లఁ జుట్టుచు నిరంకుశమై పరువెత్తు కాలపుం
దురుసులు సైఁచి మానవుఁడు తొల్లిజనించినయేఁటిపట్టు క్ర
మ్మఱఁ గనుఁగొంట భాగ్యము సుమా! సుకృతమ్ములు పండిపండి ము
మ్మరమయి నీ కనేకములు మన్మథదర్శనముల్ ఘటిల్లుతన్!

చిక్కనిసౌరభమ్ము విరఁజిమ్మెడి కమ్మనితెల్గుఁదోఁట నీ
త్రొక్కనిబాటఁ గాన, మకుతోభయతన్ రసరాజ్యవీథి నీ
వెక్కనిగద్దెఁ జూడము; కవీంద్రులు నన్నయతిక్కనాదికుల్
దక్కిరి మాకు, నేఁటి కిటు తావకరూపమునన్ మహాకవీ!

ఒఱపుగాఁ బండిన మిరెపగుమ్మటములోఁ- గుంకుమాంకితఁ బెండ్లికూఁతుఁ జూచి
పాయలు దీసిన పంటపొలాలలో - సస్యసీమంతినిసౌరు నెంచి
మిడియెండలోఁ జేల నడుచుచు వరిమ్రోళ్ళు - చిలికిన మంచుబొట్టులను దడిసి
ఆ వీనినట్టి రే యాలితో జాగర్య - గావించు రైతుసౌఖ్యము భజించి

అద్దిరా! కాఁపుఁదనమెల్ల నాఁచికొన్న
భావుకున్ నినుఁ గన్న నాపండ్లుపులియు
విశ్వతోముఖశేముషీ విభవలబ్ధ
నిఖిలధర్మానుభూతి మానితుఁడ వీవు.

నీ కేకాగ్రత జీవగఱ్ఱ; కృతులన్ నిర్మించుచోఁ, బాడుచో
వాకల్ గట్టును బాష్పముల్; రఘుకులస్వామిన్ బ్రకీర్తించుచో
లోకం బన్నది విస్మరించెదవు; నీలో భక్తియోగమ్ము నా
లోకింతున్ గవితామయమ్ము నఘదూర్లుంటాకమున్ సత్కవీ!

గుట్టుల్ మట్టులు విప్పి, రామకథనిగ్గుల్ చాటి, నిర్భీకయై
పుట్టం బుట్టినవానితోఁ దొడరి గెల్పుంగన్న నీవాణి, ప్రా
బుట్టిం బుట్టినవానితో నెదిరి మెప్పుల్వొంది, యందాలకుం
బట్టుంగొమ్మగ, జాతికిన్ బ్రియతరప్రాణమ్ముగా నిల్చుతన్!

కవులు ప్రజల్ పరస్పరవికాసములన్ మది నిల్పి, సత్యమున్
శివమును సుందరమ్మునగు జీవనమున్ గడియించి, దేశవై
భవమున కండదండలుగ వర్ధిలుచుందురుగాక! విశ్వమా
నవ నవభావసీమ "సహనావవతుల్" రవళించుఁగావుతన్!

14-1-1956- పైరపంట.

### శ్రీ పెనుమెచ్చ సత్యనారాయణరాజు

పాయక దిగ్గజేంద్రముల పజ్జ వసించెన కాని "లాకలూ
కాయల" చెంత నిల్వ మమకారము చూపఁడు మా తెనుంగురా;
జే యిడుమల్ కడల్కొనిన నింగువకట్టినగుడ్డ యౌట నీ
రాయఁడు తేఱితేఱి గజరాజముగా నెగడెన్ జగమ్మునన్.

నేలవిడిచి సామునెఱపని లోకజ్ఞ
పుంగవుఁడు కదా! తెలుంగురాజు
తేనెతేటవోని తీయనిమాటతో
నుర్వినెల్ల గెలుచుయోద్ధ యితఁడు.

రెండవకృష్ణరాయలు వరించెను విక్రమదేవవర్మ యీ
పండితు, నీకవీంద్రుఁ, బలుపల్కు లిఁకేటికి రాజు సాహితీ
చండిమ నుగ్గడింప నిది చాలదె, చాలనిచో 'నలంద' యీ
పండువొనర్చి యాకొఱఁతఁ బాపెఁగదా! 'పెనుమెచ్చు' బిడ్డకున్.

అఱువదేండ్లు నిండెనా సత్యనారాయ
ణాఖ్య! నీకు; నిది యథార్థమైనఁ
దగ్గ దేమి నీదునిగ్గు నీజగ్గు నీ
మిసిమి నీదుకైతపసయు బిసయు

నా కర్థమయ్యేలే కథ
నీకున్న జితేంద్రియత్వ నియతి వినా వే
ఱే కారణమ్ము కలదా?
యీ కాంతికి నీమనీష కీచక్కనకున్.

ఓ తెల్గురాజ! ఓహో! కవిరాజ! - వరణీయ! మహనీయ! వైదుషీతేజ!
రిత్తమాటలు వెల్వరింప నేఁ జాల - నుత్తమాటలమీఁది యుత్సాహ మేల
మనము పుట్టినవేళ మంచి దోరాజ! - మనము నేర్చినవిద్య మంచి దోరాజ!
మనబాట నన్నయ మలచిన బాట - మనబాట తిక్కన్న మరగినమాట
మనబాట చిన్నయ మది కెక్కుబాట - మనబాట యుగయుగాల్ మాఱనిబాట

యీ బాటనే కైత సృష్టింపు మయ్య! - రాబాటనే కవీంద్రా! సాగుమయ్య!
తెలుఁగువాణికి నీవు తీర్చినకృతులు - జిలుఁగువెల్గులు చిందు చిన్నారినగలు
అర్చింపు! మర్చింపు! మాంధ్రి నప్పటియు - జీవింపు! జీవింపు! చిరసుఖోన్నతిని
జయ! వాఙ్మయతపస్వి! జయ!తెల్గురాజ! - జయ 'నలందా' దత్త సాహితీపూజ!
(22-1-1956- సమదర్శి)

**శ్రీ వేలూరి శివరామశాస్త్రి**

పరువపురేకసాగి మెయిఁబ్రాఁకియుఁ బ్రాఁకనినాఁడె మోముపై
మురువులుచిందు మీసములు మొల్చియు మొల్వనినాఁడె ప్రోడయై
గురువుల కోపుగాచి కవికుంజరులన్ జళిపించు ధీరునిన్
మఱవఁగఁ దెల్గువారి తరమా! శివరామకిశోర సింహునిన్.

ఇతనికిఁ గష్టముల్ సుఖము లెట్లుసమంబులొ యట్లెజాతులున్
మతములు వంగసమ్ములును; మాయురే! వీని తపోగ్నికీలలో
హుతమయిపోయె సర్వవిషమోహముమోహము; సుప్రసన్నతా
స్థితమతు లంతనంత వికసించిన వీతని జీవితమ్మునన్.

ఇతఁడోహెూ!ఋషిచక్రవర్తి; ధిషణాహేతిన్ హృదంతర్విరో
ధితతిన్ జెండి, నిరంతరాత్మసుఖవీథిన్ ధర్మపీఠస్థుఁడై
శ్రుతిసామ్రాజ్యము నేలు; నీతని గుణస్తోమం బుదాత్తమ్ము, సం
స్తుతి పాత్రంబగుచున్ గవీంద్రులకుఁ గూర్చున్ నిర్భరానందమున్.

అన్నిటికంటె నాకు నితఁడాప్తుఁడు, నాత్మసఖుండు; మున్నుగాఁ
బ్రన్ననిగద్యమం దితఁడు పల్కిన గాంధిచరిత్రమున్ జగ
త్సన్నుతిపాత్రమున్ నుడువఁజాలితిఁ బద్యమునందు నేను; నే
నన్నఁ గరంగు నీతఁ; డితఁ డన్నను నేను ద్రవింతు నెంతయున్

నాకీ 'యాంధ్రనలంద' మున్ను ఘనసన్మానమ్ముతో మోదమున్
రేకెత్తించెను; గాని దాని కుఱవౌ నిర్వృత్తి చేకూర్చె నేఁ
డీ కవ్యగ్రణి కీ మహాఋషికి నీ హేవాకవారాశి కీ
నైక బ్రాహ్మికి నర్చనల్ నెఱపి గణ్యంబైన విద్వత్సభన్. (21-12-1957-పైరపంట)

## శ్రీ రాయప్రోలు సుబ్బారావు

రాయప్రోలువారి రమణీయకవిత శా
రదకు నింపు నింపు; రాయప్రోలు
సుబ్బారావు సుకృతసుందరుఁ డీ మహా
కవి శతాధికాబ్దకలితుఁ డగుత!

సముచితవాక్కుల దేశా
భిమాన మొదవించి తెలుఁగుబిడ్డకుఁ గర్త
వ్యము నేర్పిన తొలికవిగా
నమస్య లొనరింతు నీ మనస్వికి నర్థిన్.

తెనుఁగుఁదనమునకును భారతీయతకును
సమవికాసమ్ము వలచిన సరసుఁ డితఁడు
గ్రామజీవనమాధురీగరిమ సాధు
కవిత మెఱసిన బాఁపనకాఁ పితండు.

ఎందఱు రవీంద్రుసన్నిధి
నందరు సాహిత్యశిక్ష? నందఱు నవతా
సుందరకవితాకౌశల
మందిరొకో సుబ్బారావునట్టు లయారే!

కవనము తోడన యితఁ డు
ద్భవమందినవాఁడు సహజభావుకతా వై
భవసంపన్నులె జాతి
చ్ఛవికారణ భవ్యకావ్యసర్గవిధాతల్. (21-2-1963-సమదర్శి)

నా తెనుంగుజాతి నడతలోఁ, బలుకులోఁ - గడిమిలోఁ గడిందిగారవమ్ము
సంతరించుకొన్నజాతిరా యనుకొంటి - రాయప్రోలువారి రచన లరసి.
(సందేశసప్తశతి)

### శ్రీగుఱ్ఱం జాషువా

రాజులు ప్రెగ్గడల్ మతివిరాజులు కావ్యకళారమా సమ
ర్చాజయశీలు రాదరధురానతులై నుతు లాచరింప రా
రాజువిధాన భవ్యరసరాజ్యము నేలుచునున్న మద్యశ
స్తేజము నందుకొన్న సుకృతీ! పరమాయువు నీకు జాషువా!

వందలు వేలు పొత్తములు వాములువాములు కూర్చినంతనే
పందెముగెల్చునా కవికిఁ బాఠకలోకపుముద్ర లేనిచో
నందనవాటికాకుసుమ నవ్యమరందఝరీతరంగముల్
చిందఁగ నీవలెన్ గృతులు సెప్పక విందులు గుప్పకున్నచో.

నీ వొకక్రొత్తనోటఁ గమనీయపథమ్మునఁ దెల్గుగుండెకున్
జీవము నిచ్చుపల్కున విశిష్టత గంటివి; లేతఁకారు నీ
త్రోవల నిచ్చమెచ్చి శ్రమతో నిను వెన్కొనె; నీదుసృష్టికిన్
జా వనుమాట లేదు కులశైలము లబ్ధులు క్రుంగి పొంగినన్

ముమ్మరమైనపాపముల మోసిన తా వగుఁగాక, వాఁకలై
కమ్మనిదేశి పొంగునెడ, కావున నీ నెల వింతమంచి పా
కమ్మునఁ బల్కనేర్చితివి, కైతలు రోచిరుపేత లగ్రహా
రమ్ముల నాఁచికొన్న కవిరాజులమోములు వెల్లఁబాఱఁగన్.

"త్రోసిన నేమిలే రుచులఁదోఁగెడి గారెలబుట్టలోఁ బడెన్
దోసము లేనికుఱ్ఱఁ" డను ధోరణిగా నతలంబుదాఁక ధీ
రాసులు నిన్నుఁ ద్రొక్క నవురా! ధ్రువుకైవడి నున్నతోన్నత
శ్రీసముదీర్ణమౌ పదముఁ జెందితి వందితి వక్షరత్వమున్.

మాలల, పంటకాఁపుల, యమాత్యులవోలెఁ దెలుంగునేలఁగాఁ
జాలినవారు లేరనుట సత్యము; ప్రత్యయముల్ తగిల్చినన్
వాలినముక్కు ద్రుంచినను వచ్చునొకో!సురభాషకెన్ని జ
న్మాలకునైనఁ దెన్గుపస? మల్లియతావి గులాబి కబ్బునా?

ఆఁకటిమంటతోఁ గులధనాగతవైభవ దృప్తకల్పితా
నేక నిరాకృతుల్ కుడుపునెవ్వగతో నణఁగారుదీనులన్
గైకొని వారి కష్టమయగాథలు చక్కవచించి కానుకల్
చేకొని తీవు, నీ ప్రజలు జేనకు వేనకువేలు కావునన్.

ప్రజలను జూచి, సంఘమునఁ బైకొనుకోర్కి గణించి, స్వార్థపుం
గజిబిజి డిగ్గఁద్రావి, పరిణామవశంబు సమాజ మన్ నెఱా
నిజము నెఱింగి, నిర్మలుఁడు నిశ్చలుఁడై కృతి సెప్పువానికిం
ద్రిజగములున్ హసాదని విధేయములౌ టరుదా? మహాకవీ!

హైందవనాగరాజు విషమాశయుఁడై బుసకొట్టి సంఘమున్
వందకులాలుగాఁ బఱియవాపి, దురాపద ముంచి, శ్రామికున్
గ్రిందికిఁద్రొక్కి, సోమరిని గేవలుఁగాఁ బయికెత్తెఁ, గాని నీ
ముందఱ బందయై వెఱపుముంపులతోఁ దలవంచె నేఁటికిన్.

తిక్కన పుట్టుగడ్డగ నుతింగను గుంటురిసీమ, నియ్యెడన్
లెక్కకు నెందఱోకవులు లేచిరి, గాని రవీందుతారకల్
మిక్కిలుదాఁక నిల్వఁగల మేలిమి నల్గురకే లభించె, నీ
వొక్కఁడ వందు, నందు బెగడొందక నిక్కము వక్కణించెదన్.

యతుల నెఱింగి, ప్రాసనియమావళి నేర్చి, గణానుకూలమౌ
గతిఁ గృతికూర్చువాఁడు కవి గాఁ; డెతఁ డన్యకవీంద్ర దుర్లభ
ద్యుతి నొకటిన్ గడించు నకుతోభయుఁడై, గుణలుబ్ధుఁడై జగ
ద్ధిత మగువస్తు వెంచి వరియించు నతండె జయించుఁ గైతలన్.

కవితచక్కఁదనము గరితచక్కఁదనమ్ము
కోటికోటిగతులఁ గుల్కుఁ గాన
నిలకుఁ గాళిదాసుఁడే మహాకవి కాఁడు
రతియె సోయగంపురాశి కాదు.

డెబ్బదియేండ్లునిండినఁ బటిష్ఠమ నీతనుయష్టి; దుష్టపుం
బెబ్బులిరీతి జాతినెఱిపీల్చునధర్మము నూఁచముట్టుగాఁ
ద్రొబ్బుకృతుల్ రచింపఁగల దొడ్డసిరిన్ మెఱయించు నేఁటికిన్
ప్రబ్బుత! నీ ప్రబంధములు; ప్రాభవముల్ భువినెల్ల సుబ్బుతన్!

నవఁతలు సైఁచిసైఁచి భువనప్రియముల్ నవతామనోజ్ఞముల్
కవితలు సృష్టిసేయు మొనగాంఢ్రు జనింతురుగాక! వారి ప
ల్కవునని గారవించు రసికాగ్రణి లేనపు డేమిలెస్స? యీ
భవికముపై మనం బిడిన పాములపాటిప్రసాదు నెంచెదన్.
(రాష్ట్రమంత్రి - నిడుబ్రోలు, గుంటూరు జిల్లా.)      (14-2-1966, సమదర్శి)

**శ్రీ సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె)**
**(జ్ఞానపీఠ బహుమానగ్రహీత)**

ధీరస్తు సకలవిద్యా
పారమ్యావ్యాప్తిరస్తు! పరిషద్విజయ
శ్రీరస్తనియెద నెయ్యరి
నారాయణరెడ్డికిన్ మనస్వికి నర్థిన్.

జాను జవరయైన నూనూఁగుమీసాల
వయసునందె రెడ్డి వాసి గాంచె
ముసలితనము గాదు సిసలైన ప్రతిభయే
కారణమ్ము కవుల గరిమమునకు.

గేయమనుచు రెడ్డి వ్రాయునుగాని ప
ద్యమున కుద్ది యగుచుఁ దనరు నద్ది;
చదురు గన్నవార లెది వ్రాసినను, దాన
నందచందములకుఁ గుందురాదు.

వెనుక ముందు చూచి జనతాహితంబగు
కైతగూర్చు హృద్యగతి నితండు

యుగయుగాల నుండి జగమునఁ బేరిన
దుమ్ముదులుప నలఁతఁ దోఁగు నితఁడు.

ఉసుఱుగలతెల్గు వలచిన
రసజ్ఞులు పఠింపవలయు రడ్డికృతుల; నీ
పస కాఁపుబిడ్డ యగుటన్
వసంపడియె సింగిరెడ్డివారి చిఱుతకున్. (29-7-1967, సమదర్శి)

**శ్రీ మంగిపూఁడి వేంకటశర్మ**

వంగవసుధఁ జీల్ప నాంగిలేయులు కుట్ర
పన్నినంత నఖిలభారతమ్ము
నిద్రవిడిచి దాస్యనిగళవిచ్ఛేదనా
సక్తమయ్యె నుష్ణరక్తమయ్యె.

దేశభక్తి సాహితీసరస్వతి కపు
డాత్మ యగుట, బిరుదులైన కవులు
సంతరించి రేకజాతీయతా సము
త్పాదకము లపూర్వభవ్యకృతులు.

చిలకమర్తివారు చెన్నాప్రెగడవారు
తెరువుసూపఁ గదలి తీయ తీయ
వెచ్చవెచ్చకైతలిచ్చి రాంధ్రుల కాత్మ
దేశ ముక్తి నభిమతించు కవులు.

నాఁడు తెల్గునాట నవకవితాసృష్టి
కర్తలైన కవుల గణనపట్ల
మంగిపూఁడి కులజమౌళి వేంకటశర్మ
పేరు కొసకుఁ జెప్పువారు లేరు.

స్వాతంత్ర్యపిపాసా వశ
చేతసుఁ డీకైసరుఁడు సృజించిన గీత

వ్రాతమ్ము పల్లెపల్లెకుఁ
జైతన్యము నిడె యుగార్హసందేశములన్.

సంఘసంస్కరణాసక్తి సందడింపఁ
బలికె నీసత్కవి "నిరుద్ధభారతంబు"
నంటరానితనమ్ము దూష్యం బటంచుఁ
జాటు కబ్బములన్ సడిసన్నదాని.

"బాలవితంతు విలాపము "
ఱాలైనఁ గరంగుభంగి వ్రాసెను, బాపూ
మేలిగుణమ్ములు శత కం
దాలన్ గొనియాడె భక్తితత్పరమతియై.

రామమోహనుండు రక్కొసనమ్మికల్
సమయఁ జూపినట్టి సాదుపథము
బ్రాహ్మధర్మమునకు బంటుగా బ్రదికిన
నరుఁ డితండు ధన్యతరుఁ డితండు.

"మడ్డుకత" నేర్పరించె నీమంగిపూఁడి
కవివతంసము తెనుఁగుఁజక్కనలు కులుక
భారతికి నూత్నశోభరాన్ బయలుమెఱసి
యది రసజ్ఞప్రశంసల నందుకొనియె. (27-7-1971, నా కథలు)

**శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రి**

చదువ దొరఁకొంటి "నుభయభాషాప్రవీణ"
పట్టమునకు నా యెఱుకయ ప్రాపు గాఁగ;
నెంత త్రచ్చిన నేమి వ్యాకృతిరహస్య
మంతుపట్టక తలక్రిందులైతి నపుడు.

గురువులేనివిద్య గ్రుడ్డిది పొ మ్మని
బడికి సెలవుపెట్టి బందరునకుఁ
జేరుగడఁ దనర్చు చిట్టిగూడూరికి
నరిగినాఁడ నాస లగ్గలింప.

విశ్రుతచరితుండు విద్యాపయోధి - యౌదార్యనిధి వరదాచార్యు లిచట
నఖిలాంగ సంపన్నమైన సంస్కృత క - లాశాల నిల్పి వలంతులౌ బుధుల
రావించి దేశికరాజ్యంబు లిచ్చి - తాఁ బ్రధానాచార్యతను దలఁదాల్చి
మతకుల భేదముల్ మఱచి విద్యార్థి - తతి నాదరించుచుఁ దన సరస్వతికి
నఖిలావనీ స్తుతు లార్జించిపెట్టు.

నపరచిన్నయసూరి యంచితాచార - విభవుండు దువ్వూరి వేంకటరమణ
శాస్త్రి యేతత్కళాసదనమ్ము నందు - నాంధ్రశాఖాధ్యక్షుఁడై హవణిల్లు.
నీ విద్వదగ్రణి కృపకేను నోఁచి - యీ సాధుసత్తము హృది నేను దోఁచి
చదువంగఁ దొడఁగితి శబ్దశాస్త్రంబు - నేర్వంగఁ బూనితి నెఱవైన విద్య.

ముత్తు లిత్తులు పీఁటముడులెల్ల విప్పి
ప్రౌఢప్రయోగ మర్మములెల్లఁ జాటి
తొలఁగించె నా భీతి దువ్వూరి సూరి
రహి నేలె వేంకటరమణుండు నన్ను.

నిపుడైన నా శంక లీ యొజ్జ కనిపి
తగు నుత్తరము లంది తనివోవుచుందు
మనుఁగాక మా శాస్త్రి మహిని వేయేండ్లు
కనుఁగాక తచ్ఛాత్రగణ మా మహత్త. (1971, నా కథలు)

శబ్దశాస్త్రాది లక్షణ సంప్రదాయ
మెవ్వఁ డెఱిఁగించె నాకు నయ్యిద్ధచరితుఁ
బ్రస్తుతించెదఁ బుంభావపద్మజాత
రమణి దువ్వూరి వేంకటరమణశాస్త్రి. (1951, బాపూజీ ఆత్మకథ)

అంచితకవి ప్రయోగరహస్యవిదురు
జేసి న న్నలరించిన శిక్షకునకు
నమిత సుకృతికి వేంకటరమణశాస్త్రి
కంజలి యొనర్తుఁ గృతికి మే లావహిల్ల.

కోపమెఱుంగఁ, డీర్ష్యదెసకుం జననొల్లఁడు, శిష్యగౌరవ
శ్రీ పరమార్థ మంచు మతిసేయును, సత్యము సత్వమున్ నిజా
లాపమునందు నెల్లయెడలన్ వెడలించు దువ్వూరిసూరి; యే
నే పగిదిన్ భజించి నుతియించిన నీ గురు నప్పుదీర్తునా?

లలితోక్తుల శాబ్ద మహః
కలి తోభయసాహితీ ప్రగల్భత నదిరా!
తలఁపించు నితఁడు చిన్నయఁ
దెలుఁగునకున్ దీపమిడిన ధీ మద్రమణున్. (1968, మహాత్మకథ)

తలఁచెద మదీయ దేశికుఁ జుళుకితాఖి
లాంధ్ర లక్షణ జలరాశి ననఘచరితు
రచితరమణీయు వేంకటరమణశాస్త్రి
నపరచిన్నయసూరి నేకాగ్రమతిని. (1976, ఎక్కట్లు)

సత్యనిష్ఠ, శబ్దశాస్త్ర మర్మజ్ఞత,
కరుణ కల్గి నన్నుఁ గలఁచు నిరులఁ
దొలఁగఁ ద్రోసినట్టి దువ్వూరి వేంకట
రమణరవికి వందనము లొనర్తు. (1981, సందేశసప్తశతి.)

### శ్రీ తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రి

ఏ సద్దేశిక సర్వతోముఖకళా హేవాకరోచిస్తతిన్
నాసాహిత్య మెలర్చె నద్రితనయానాథార్చ నాధీన ధీ
వాసున్ వాగపరావతారు నతనిన్ వర్ణింతుఁ దాడేపలి
శ్రీ సంతత్యుదితున్ గృపాప్తతి నఘచ్ఛి ద్వేంకటప్పార్యునిన్.

ఏకశ్లోకరహస్య బోధనముచే నెవ్వాఁడు శిష్యున్ సుధీ
లోకాగ్రేసరుఁ జేయు, నవ్విబుధుఁగొల్తున్, వేంకటప్పార్యు న
స్తోక శ్లోక మయూఖ రాజదఖిలాశున్ రామగాథామృతా
ఖ్యాక గ్రంథమతల్లికా జనకు మద్గైర్వాణభాషాగురున్.

వెలనాటిరాచవీటికి (చందోలు)
వెలనాటినబుధుని భువన విస్మయ శీలా
కలన ప్రియభావను నీ
వెలనాటికులీనుఁ దలఁతు వేకువవేళన్.

ఆఁపఁడెపుడు జపము, నంతేవసత్వార
వివరణమ్ము విడఁడు, కవిత మానఁ,
డింటనున్న, దారినేగుచున్నను, వేంక
టప్పగురుఁ డనుత్తమావధాని.

అర్ధమరేయిదాఁకఁ బొల మారసి క్రోసులురెండు దూసి యే
నొద్దిక నొద్దికిం జన గురూత్తముఁ డీకరుణాసరిద్విభుం
డద్దిర! నిద్దురన్ వదలి యయ్యయిపాఠము లుగ్గడించె; నీ
పెద్దతనంపు సొంపు కనిపింపద లాఁతులయం దొకింతయున్.

పదపడి తాడెపల్లికులపావనుఁ బుంవపురీద్యమాన శా
రద నల వేంకటప్పగురు "రామకథామృత" కావ్యకర్త న
స్మ దనుపమాన పుణ్యమహిమమ్మునఁగొల్చి రసాశ్రయమ్ములన్
జదివితిఁ గాళిదాసకవిసత్తము కబ్బము లమ్మనీషితోన్.

ఒక్కశ్లోకమునైన నాయొద్ద నేర్చు
నతఁడు కృతమతి యగుట తథ్యం బటంచు
నా దిగులు మాన్పె నొజ్జ యానాఁడు, చిరము
చదువుసాగక నే నొచ్చుసమయమునను.

నేర్చినది చాలు నీకేల నెగులు దిగులు
వాసిగందువు నీ వాంధ్రవాఙ్మయమున
విశ్వసింపుము నన్నని వేంకటప్ప
గురుఁడు పల్కుట నా చెవిన్ మొరయు నెపుడు.

వినతుఁడనై నిక్క మొక్కటి వినుతు వింతవారికడ
నను మించి యపుడు చదివిన కుఱ్ఱలు నా నేస్తగాండ్రు
కనరైరి నేర్మి నించుకయును గురుని కడివోనిపల్కు
పెనుపుమై నేన రేకెత్తి మెఱవడి పెద్దయుం గనితి

వచ్చిన శిష్యులకున్ జదు
విచ్చుటయే కాక యన్నమిచ్చెను, వస్త్రం
బిచ్చెను, మా యయవా రీ
వెచ్చము దుస్సహమయైన వెఱవఁడు లవమున్.

ఆనాఁడు చర్లబ్రహ్మయ
కానంబడె నిట్టి యీవికలదేశికుఁడై
యేనాఁడు జాతిగర్వ ని
దానము లీదృక్ష కోవిదప్రాగ్రసరుల్.

నన్నయ తిక్కనాది కవినాథుల నేర్పులు తోఁచుకైవడిన్
బ్రన్ననిబాటలో నడిపె రామకథన్ మహనీయకావ్యమున్
పిన్నలుపెద్దలున్ దెలుఁగుపేఁటల నారతులిచ్చి కొల్వఁగాఁ
బున్నెపుముద్ద నా నిలిచిపోయెను మద్గురుఁ డంధ్రసాహితిన్.

గురుని నేర్మి యోర్మి కరుణ కవిత్వ మ
హత్త ఋషిత రూపునందె నన్ఁగ
రాణకెక్కె సుతుఁడు రాఘవనారాయ
ణాహ్వయుండు లోక మబ్రపడఁగ.

ఉత్తరరామకథన్ రస
వత్తరముగఁ బల్కె బయలువడని కవిత, న
చ్చొత్తించె నహో! పితౄణము
నిత్తెఱఁగునఁ దీర్చు చేవ యెందఱ కబ్బున్!

అఱఁకువ రాఘవనారా
యణశాస్త్రికి నంజలింతు నాత్మజత మహత్
ప్రణతుల్ గను మద్దేశిక
మణికి సమీచీనధర్మమయ ధీఘృణికిన్. (24-9-74-కదంబకైత)

**శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి**

తీయనికైతతోడ, గడితేఱినపాండితితోడ, నాంధ్ర రా
ష్ట్రీయ వికాసమున్ వలచు డెందముతోడ, నపారశౌచ ల
క్ష్మీయుత జీవనప్రవణశీలముతోడ నెసంగు సత్యనా
రాయణశాస్త్రికిన్ జయపరంపర సంతతమై లభించుతన్!

ఱాలను రాగిఱేకులఁ బురాతనవాఙ్మయ కందరమ్ములన్
మూలుగుచున్న తెల్గుకథ ముమ్మరపుం బడ లోర్చి, తీర్చి, మేల్
మే లని కోవిదుల్ పొగడ మేటిప్రబంధముగా సృజించి, ని
ర్వేలయశమ్ముగన్న సుకవిన్ గొనియాడెద నిమ్మహామతిన్.

మన మనుజేశ్వరుల్, కవు, లమాత్యులు, యోద్ధలు, దాతృతాపరా
యణులు, మనీషిపుంగవు, లహస్కరసోములు, నిల్చునంతకున్
మనఁగలకీర్తినంది రని మాటికిమాటికిమెచ్చు లోక మీ
యనఘుని సాధుసుందరము " నాంధ్రపురాణ" కృతిన్ బఠించుచున్.

కులమతవాద భేదములకున్ దవుదవ్వుల నిల్చి సత్యమున్
బలుకుట వేయిజన్నములపాటి ఫలం బిడు నన్న ధర్మువున్
వలచుచు శాస్త్రి కూర్చు కవివర్యచరిత్రము తెల్గువాణికిన్
జెలువము సంతరించు కయిసేఁతలలోఁ దొలిబంతి దొఁగదా!

తొలుతను జోళభూపతులతో నిటు వచ్చిన కంచిద్రావిడుల్
తెలుఁగునకున్నతిపి గని దిగ్గన మానిరి మాతృభాష; నే
వెలితియులేని తెల్గులయి వెల్గిరి; చెళ్ళిళసత్కవీంద్రుఁ డీ
వలతిఁయు నెవ్వ?రా తమిళవాసన వాసిన బాఁపలే సుఁడీ!

అచ్చపుఁదెల్గువార లదిరా! యనఁ గమ్మనికైత సెప్పి, వి
ద్వచ్ఛయ మెన్నఁగా నమరవాణికి వన్నెలు దిద్ది, శాస్త్రముల్
త్రచ్చి, శ్రుతుల్ పఠించి, ఋషిధర్మముఁగొల్చి తెలుంగుజాతి కీ
సచ్చరితుల్ ఘటించిన ప్రశస్తిఁ దలంచి శిరమ్ము వంచెదన్.

చదురుల నిండియున్ వినయసంగతి వీడఁడు శాస్త్రి; దైవ సం
పద లభయాదులంచు హరి పల్కుచు నమ్రత నందుఁ జేర్చె; ని
య్యది కొఱవడ్డనాఁడు నరుఁ డర్హుణకున్ దగఁ డెన్నిశాస్త్రముల్
చదివిన, నెన్నికావ్యములు సల్పిన, శిల్పములెన్ని కూర్చినన్.

మన్నన చేయఁదగ్గ నెఱమానిసియౌ మధునాకవీంద్రుఁ డీ
యన్నను సత్కరించు ప్రజలైన నలంతులె! పూజ్యపూజకున్
బన్నుట సంఘధర్మమనుపాడి నెఱింగిన కార్యకర్తలన్
బిన్నలఁబెద్దలన్ సుగుణపీఠములన్ మనసార మెచ్చెదన్.

నేఁ డొకఝుంఝు రేఁగినది, నెట్టన దీనికి జంకి ధర్మువున్
వీడఁడు శాస్త్రి, వెన్కడుగు వేయఁడు, మున్నటి నన్నతిక్కనల్
ప్రోడలు చన్నమార్గమునఁ బోవుచు రేపటినుండి యర్వదా
ఱేఁడులు నిల్చి పల్కఁగలఁ డిద్ధకృతుల్ శతముల్ సహస్రముల్

(12-2-1975- కదంబకైత)

**శ్రీదేవులపల్లి కృష్ణశాస్త్రి**

ఋషినోట వెల్వడిన యుప
నిషదుక్తులు కృష్ణశాస్త్రి నిగదితకృతు; లీ
సుషమకు నెలవై తెనుఁ గు
న్మిషమై పరభారతీ సమీడిత మయ్యెన్.

తన యెడఁదన్ రఘుపతి నా
యని పదచిహ్నాములు చెఱుగవని మానవతా
ఖని కృష్ణశాస్త్రి పల్కుట
విని విజ్ఞులు తనియుదురు దివిన్ భువి నొకటన్

తెనుఁగురవీంద్రుఁడు నా నితఁ
డనవధియశ మందుకొనె; నిజాధ్వమునకు రాఁ
బెనఁగెడి కవులన్ బెక్కురఁ
గనుఁగొనె; ధన్యత్వ మింతకంటెను వలెనా?

పరమసత్యమైన పలు కేమతమ్మున
దోఁచుఁగాక దాని సైఁచు నితఁడు
సమత సర్వయోగసారముగా విశ్వ
సించు నట్టి మధురశీలుఁ డితఁడు.

లిబ్బికొఱకు వ్రాయలేదు కైత, చెనంటి
కట్టెకొఱకుఁ బదము కట్టలేదు,
పలికెఁ గృష్ణశాస్త్రి పరమేశ్వర ప్రీతి
కొఱకు, సత్యధర్మగుప్తికొఱకు.

భక్తుఁడై నిజార్తి పలుకు నీశ్వరుముందు
ప్రేయసీత్వమూని ప్రియుని వెదకు
బంటుగా నొనర్చుఁ బ్రభున కూడిగ మెల్ల
జగ మెఱుంగు శాస్త్రి సగుణసేవ.

శాస్త్రి కూర్చు లిమేఘసందేశమున్ విని
కాళిదాసుఁడెంత కరఁగినాఁడొ;
యితని గీతి మఱవ దీజాతి, పయ్యెర
వీచు దనుక, మల్లె పూచు దనుక.

*(మల్లీశ్వరి సినిమాలోని "అందాల ఓ మేఘమాలా!" అను పాట).

కరుణ కలదు, ప్రేమ కల, దీవి కల, దాత్మ
కలదు కృష్ణశాస్త్రి కవితయందు;
టన్నుబరువు దాని కున్నదా?యని నొస
లెత్తి యడుగువాని కేటికోళ్ళు. (14-3-75, కదంబకైత)

**శ్రీ యార్లగడ్డ రంగనాయకులు (కారంచేడు)**

సాధుతారమణీయ చారిత్రవల్లరి - కల్లుపందిరియైన హాలికుండు
అన్న వెంకన వదాన్యత కృతార్థత నందఁ - గట్టలంతలు సైఁచు కార్యకర్త
సకలసంపదల కాస్థాని యయ్యు రవంత - గర్వగంధంబు సోఁకని మనస్వి
ధర్మ విజ్జింకిన తఱి "సత్యసద" నాఖ్య - తన యింటి కిడి ప్రజన్ దనుపు గేస్తు.
శూరతా నరపాలతా సుజనవినుత
దాతృతా శుభశీలతా ధన్యమైన
యార్లగడ్డాన్వయమ్మునం దలరుమేటి
రంగనాయకు లభిమతార్థములు గనుత!

ఇతఁ డాంగ్లమ్మున, దిట్టయయ్యు మన సాహిత్యమ్మునన్ బ్రోడయై
నుతులందం బ్రయతించు; నిచ్చలు కవీంద్రుల్ ప్రాక్తనుల్ నూతనుల్
మతిమన్నొళులు కూర్చుకబ్బములు పల్మాఱుల్ పఠించున్; దద
ద్భుతసృష్టిం గొనియాడుచున్ సొగసి నింపున్ బాష్పవా:పూరముల్.

సకలజనుల్ ప్రసిద్ధకవిసత్తము లౌననఁగా మహర్షి క
న్నకవి రవీంద్రనాథుఁ డధునాతనగీత రచింప, రంగనా
యకులు తెనుంగు చేసెనటె! యక్కవితన్ రుచులూరుపల్కుతో
నకుటిలధారతోఁ జిరతరాస్తికతా పరిణద్ధ బుద్ధితో.

చక్కని తెల్గుఁగైతల దెసన్ వల పగ్గలమౌట రేపవల్
తిక్కన భారతం బితఁ డతీవరతిన్ బఠియించు, నమ్మహా
వాక్కుల మర్మముల్ దెలుపు "వాహిని" లోఁ, బ్రజకా మెఱుంగులన్(వారపత్రిక)
డక్కఁ గొనన్ దపస్వివలె డయ్యును లోకము విస్మయంపడన్.

పరువపు సొంపునన్ గొఱఁతపా టిసుమంతయురాని వీనికై
యఱువదియేండ్ల పండువని యాప్తులు మన్ననచేతఁ చూడ నా
కరుదగుఁగాని లోభహతు లందనివాని జరాదు లంటఁగా
వెఱచు నటన్న సూక్తి ఋజువేయగు నీదృశులం గనుంగొనన్.

తెలువులకెల్ల మిన్నయగుతెల్వి పరాత్పరుగుట్టు గంట, ని
శ్చలము నిరస్తదోషమగు సంయమ మిందు శరణ్యమందు, నీ
కలిమికి నొగ్గుచున్ దనివిగాంచుచు బుచ్చమసేవ లందుచున్
నిలువుము రంగనాయక! మనీషిమణీ! శతమానపూర్తిగన్.

(24-10-1975,కదంబకైత)

**తిరుపతి వేంకటకవులు**

**(శ్రీ దివాకర్ల తిరుపతి శాస్త్రి - శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి)**

తిరుపతి వేంకటకవు ల
బ్బురముగ నానావధానములు సల్పుచు నాం
ధ్ర రసజ్ఞులకుం దను పిడు
తఱి యది మేధా కవిత్వధారా ప్రౌఢిన్.

రాజధానియంద రాణించుకవనమ్ము
పల్లెటూర మెప్పు వడయ దిద్ది;
రుద్దిలేని సేవ కొగ్గి తిర్పతివేంక
టేశకవులు చవుల నిడిరి నుడికి.

ఎవరు తిరుపతివేంకటకవుల తోడఁ
దొడరి గురుభక్తిలో సరితూఁగఁగలరు
చర్లబ్రహ్మయశాస్త్రి యశం బశేష
జగమునకుఁ బ్రాఁకె నీశిష్యయుగము కతన.

**శ్రీ కొండవీటి వేంకటకవి**

షష్టితమ జనురుత్సవ సత్సభా ని
విష్టుఁడై శిష్టలోక కోవిదసమాజ

కవికదంబ ప్రశంసలఁ గరఁగు కొండ
వీటి వేంకటకవికి దీవెనల నిడుదు.

పండితులఁ గొల్చి మెప్పించి పడసినట్టి
ప్రజ్ఞకున్ జరితార్థతాభాగ్య మొదవ
విప్లవాత్మకరచనాప్రవీణుఁ డగుచు
నలరు కవిరాజునకు జయం బగుత సతము.

మన మతమ్ముల, వర్ణాల, మన పురాణ
గాథల నణంగియున్న తెక్కలితనమ్ము
క్రుళ్ళు, కుట్ర వెలారించి కుటిలమతుల
యాటకట్టించె నితఁడు సత్యార్థియగుచు.

ఏన్గుపీఁపుమీఁది కెక్కి యూరేగెడి
గుంటనక్క యొడలు, గుండె లదర
బెదరి తూలి బిళ్ళబీటుగాఁబడి బొట్టె
నొదుఁగబాఱె నితని యుదుటు సూచి.

వేలయేండ్లనుండి వెడవెడనమ్మికల్
కఱపి కఱపి ప్రజలకన్ను గప్పి
సాముదయ్యమైన సోమరి పరకకున్
గొంచెపడియె నితఁడు గొంతువిప్ప.

వేంకటకవీంద్ర! మను మీ
వింకను వేయేండ్లు కవనహేతి నిశాతా
గ్రాంకురిత వహ్నికీలా
సంకర్షణమున సమాజ జడతలు సమయన్.

సాంస్కృతికమైన దాస్యంబు స్రగ్గదనుక
రాజకీయవిభూతికి రాణ లేదు;

కంచమున గూఁడుగట్టిన కసటు తొలఁగు
దనుక మృష్టాన్నమునకు నాదరము రాదు.

నిన్నుఁజూడఁ ద్రిపురనేని మహర్షి నా
మదికి వచ్చుఁ దీవ్రమంజు దీప్తి
విడువ కితని భావవీథి సినీకథా
దృష్టినైనఁ గావ్యసృష్టినైన.

నీకు నీధర్మనిష్ఠయ నైకసుఖము
లీయఁగలదు, దీర్ఘాయువు నీయఁగలదు
చుక్కలు వెలుంగు నందాఁక మొక్కవోని
గౌరవము నీయఁగలదు వేంకటకవీశ! (22-11-1976-కదంబకైత)

**శ్రీ నమశ్శివాయ**

ఇతఁడు నమశ్శివాయ జగదీడిత భావపరీత భారతీ
కృత మహనీయకావ్య సుకవీంద్రనికాయ బహూపచార వి
స్తృతసుఖ సాధుజీవన విశిష్టత షష్టిశరద్వయస్కుఁడై
నతుఁ డయినాఁడు నేఁడు సుజనప్రకర ప్రథితన్ సదస్సునన్.

కవులకు వర్గభేదములు కక్షలు కయ్యము లెన్నియున్న నా
రవరవ లంట వీతనికి, రమ్మను నెవ్వరినైన నాదృతిన్;
తవుల మనారతమ్ము సమతాసరణిన్ బయనింప నెంతగా
నవసి తపఃక్రియల్ సలిపినాఁడొ యితండు పురాభవమ్మునన్.

పలికిన కైసరుండు తనపద్యము సర్వము నొక్కనాఁ డెదన్
వెలయక క్రిందు మీఁదు గనువేళ, నితండు పఠించి, ధారణా
బలము వెలార్చి, నివ్వెఱఁగుపాటు ఘటించును గోష్ఠి; కెందఱీ
కలిమి గడించినారు? నుతిగన్నవధాని నమశ్శివాయయున్.

అసలే చక్కనివాఁడితండు, చిఱున వ్యామోమునం దెల్ల ప్రొ
ద్దు సిరుల్నింపుటఁ, దేనియల్ తొనఁకు నుక్తుల్ వీని సొమ్మౌట, ని

త్య సదాచారపరత్వ మీతనికి నత్యర్థమ్ముగా నుండుటన్
రసలుబ్ధప్రజ లాదరింతు రఖిలాంధ్రక్షోణి నీసజ్జనున్.

అఱువదియేండ్ల కేమి యితఁడప్పటి యర్వదియేండ్ల మన్గడన్
నిరుపమశాంతిసౌఖ్యముల నిర్భరకీర్తి నెసంగుఁ దెల్గు లీ
గఱువను గాంచి నేర్చెదరు కావ్యకృదర్చన మింద్రకీల భూ
ధరశిఖరాగ్రదుర్గ బహుధా విజయం బిడు నిమ్మనస్వికిన్.

(31-8-1979-కదంబకైత)

**శ్రీశిష్ట్లా సత్యనారాయణ రాజశేఖరము**

సీతారాఘవసత్కథల్ శ్రుతిశిరశ్శ్రీసూక్తిసారంబు లు
ద్ధూతాఘంబులు వస్తువై తనర మాధుర్యప్రవాహమ్ము సం
గీత బ్రాహ్మిని వెల్వరించి భువనక్షేమమ్ము చేకూర్చి య
ద్వైతానందము నందుకొన్న ఋషికిన్ ద్యాగయ్యకున్ మ్రొక్కెదన్.

లిభావపురి నేఁడు రసికప్రపంచహర్ష (బాపట్ల)
హేతువై నుతిగన్న సంగీతకళకు
మెఱుఁగుదిద్దిన రాజశేఖరుని మెచ్చి
మెప్పులందెను గోష్ఠి నామ్రేడితముగ.

చెలఁగి తన రెండుపాలిండ్లు చేఁపె జనని
భారతీదేవి యీ ముద్దుబాలకునకు;
పొట్టియయ్యు నీతఁడు పెద్దపొట్ట యుంట
మస్తుగాఁ బీల్చె నమ్మ కమ్మనిపయస్సు.

శిష్టత, సత్యసంధతయు, శ్రీరమణీగిరిజాప్రియార్చనా
దృష్టియు, ధర్మనిష్ఠయు, నతీవ వితీర్ణియు, నైక సత్కళా
పుష్టియు, నేర్చినేర్చి యొకపోఁచకొలందియుఁ ద్రుళ్ళు నేర్వఁగా
నిష్టుఁడుగాక చాటు నితఁ డిప్పటికిన్ వెలనాటితత్త్వమున్.

ఒక సంగీతమునందె మిన్నయని మీ రూహింతు రిమ్మేటి; నే
సుకృతంబో బహుసాహితీకుశలుఁగా సూరివ్రజస్తోత్రపా

త్ర కవిత్వమ్ముల దిట్టఁగాఁ జలిపె; నందంజూచెనా వైదుషీ
నికరంబెల్ల నితండు లోఁగొనుజుఁడీ! నేఁ డర్వదిన్ దాఁటినన్.

గాంధితలఁపు మెచ్చి కన్యను హరిజను
చేత నిడె; వినో వచించినట్లు (వినోబాభావే)
నంజ నిచ్చె నితఁడు నాదారులకు; జీవి
తం బనంగ నిది సదస్యులార!

గాంధియుగమ్మునన్ నుడువఁగాఁ దగువారలు పోవఁబోవ, ధీ
సింధువు లిట్టివారు మనసీమలఁ బొల్చెద రందునందు; మో
హాంధముగాని మన్గడకు నాదరమిచ్చెడివారు వీరికిన్
గంధ మలంది వైచెదరు కప్రపుదండల నోలగమ్మునన్.

ఏదండయు నేభోగము
నాదటసేయండు పరమహంసవిధానన్
సోదరమానవగౌరవ
సాధనకే డయ్యె నితఁడు సంతతదీక్షన్.

పాకీవాడకు విద్యనేర్పు నితఁ, డాప్రాంతంబు నంతర్బహి
ర్భా కేంద్రమ్ము నొనర్పఁ జూచు, సిరులం బాటింపఁ డేనాఁడు, ని
ర్భీకుండై నిజకృత్యముల్ నెఱపుఁ, గీర్తింగోరఁ; డీ యన్నకున్
బాకీపడ్డది లోక, మీతని కగున్ బ్రహ్మాయురారోగ్యముల్!

గాయకసార్వభౌముఁ డనఁగా నుతులందిన పాఱుపల్లి కా
ప్యాయము గూర్చి నేర్చితివి ప్రన్నుపాట; నిఁకన్ గణాధిరాడ్
గేయముతోడఁ దేనె చిలికింపుము కొల్వున; "శిష్టసత్యనా
రాయణ రాజశేఖర"! జయంబగు నీకు మనీషిమౌళికిన్.

(21-9-1980-కదంబకైత)

## శ్రీ కొసరాజు రాఘవయ్య చౌదరి

చక్కని చిక్కని పాటలు
పెక్కులు రచియించి తెల్గుబిడ్డల మదికిన్
జక్కిలిగింతల నిడుచున్
జొక్కెడు కొసరాజుకవికి శుభమస్తనెదన్.

పల్లెపదమ్మున దేశపు
టుల్లము, నుడిసొంపు, జాతియుం, గలదని య
ల్లల్ల నితఁ డెఱిఁగి నేఁ డొక
బల్లిదుఁడై నిల్చె జానపదకవికోటిన్.

దారిదప్పినవారి యుద్ధతి నణంప
దీనజనహిత మధురసందేశ మొసఁగ
నలఁగుఁ గాని రాఘవుఁడు మనస్వియగుటఁ
బచ్చిసింగారమును జాట నిచ్చపడఁడు.

పాటలతో నాఁగక రస
పేటికలౌ కృతులఁ గూర్చి పెద్దల "కాహా"
పాటిల్లఁ జేసి కవ్వడి
పాటిగ నితఁ డొప్పె నంధ్రభాషాజగతిన్.

ఎన్ని చదురు లున్ననేమి వినమ్రతా
రాశిగాఁ జరించు రాఘవుండు;
ప్రాజ్ఞకోటి కితని ప్రన్నని తిన్నని
బ్రదిమిఁ గన్న, విన్నఁ బండ్లుపులియు.

కొండముది నారసింహుండు కొడుకునట్లు
సూచి సాహిత్యమర్మముల్ లోఁచె నితని;
కొజ్జకున్ గీర్తి నొదవించు నొఱపు వీని
పాలిదై మేలిదై కవీశాలిఁ దనిపె.

గురుముచ్చట వచ్చిన మైఁ
మఱచును రాఘవుఁడు బాష్పమంజులుఁ డగుచున్
నెఱిదక్కి కృతఘ్నుగతిం
బఱచి సెడినవారు సిగ్గుపాటున గ్రుంగన్.

సప్తతికి మించి వయసున్నఁ జవ్వనంపు
రవణలకు దవ్వుగాఁడు మా రాఘవుండు;
సజ్జనుల పజ్జ కేతేర జర వణంకు
ననుట కీతని బ్రదు కుదాహరణ మయ్యె.
(15-12-1980-కదంబకైత)

**యోగివేమన్న**

మతములను బేరుకొన్నట్టి మైల నుదికి
బ్రదుకు పండించుకొనె వేమపండితుండు
వెఱ పెఱుంగని సాహితీవీరుఁ డితఁడు
విమతుల యెడందలకు బాఁకు వీని వాకు.

మొక్కలుల కల్మి నల్లన మెక్కి త్రేఁచు
బదనికల గారడము బదాబదలుసేయ
మెత్తనితెనుంగు కరకసాకత్తి జేసి
ప్రజలఁ గాచిన వేమన్నప్రజ్ఞ మెత్తు.

సత్తు చిత్తటంచుఁ జదువునేర్వని ప్రజ
నదరఁగొట్టు మాట లవలఁ బెట్టి
పల్లెపల్కుతోడఁ బరతత్త్వమును జాటి
విశ్వకవిగ నిల్చె వేమయోగి.

తన కెలంకులందు మనువారి మేల్ గీడు
ద్రచ్చి దారిజూపు తాత్త్వికుండు
దీనుపాలి పెద్దదిక్కు వేమన; పేద
పెంపు వీని కృతికి బీజ మదిర!

దుక్కిదున్నువాని, దుబ్బుచెక్కెడివాని
యనుభవమ్మునుండి యవతరించు
సాటువులకుఁ బెద్దపీఁటవైచి యొయారి
కైత గూర్చె వేమకవివరుండు.

వేమన్న కరణిఁ దిట్టిన
ధీమాన్యులు కలరె; తిట్టుదిన్న తులువయున్
వేమాఱు నవ్వు దీనికి;
సామాన్యుల కందరాని చదు రిట్లుండున్.

**శ్రీ ఓగేటి పశుపతి (యాజలి-గుంటూరు జిల్లా)**

ఓగేటివారి పశుపతి
వాగీశ్వరి కరుణ నాత్మవైభవ పిశున
శ్రీ గల కైత నపార
ప్రాగల్భ్యము నందె గాంధిభక్తియు మరగెన్.

పశుపతి సత్కవీంద్రుఁ డని పల్కుట చాలదు, చిద్విశిష్టతల్
వశపడినట్టియోగి యని వాకొను టొప్పు; నిహప్రసక్తిలో
విశదమొనర్చుఁ దత్త్వపదవీ బహుమర్మము, లాంతరాంధికా
విశసన కౌశలం బితని వీడ దహెూ! కల మెట్లు త్రిప్పినన్.

అనఁటిపండు నొలిచి యఱచేత నిడిన చం
దాన గూఢమైన తత్త్వవిద్యఁ
జిన్న చిన్నకథలఁ జెప్పెఁగదా రామ
కృష్ణుఁ డజ్ఞలోకహితము కోరి.

ఆ పరమహంస కథలన్
శ్రీపశుపతి తేనెలూరఁ జిన్నరినుడికిన్
బ్రాపగు తెన్గునఁ బల్కె దు
రాపం బానేర్మి పెఱల కని చెప్పఁదగున్.

పుడమి కెఱుకపడని ప్రోడ యితండు, ని
గూఢవృత్తి బ్రదుకఁ గోరు నితఁడు;
ఐన నెంతకాల మాఁచు నహస్కరుఁ
బీఁచుపీఁచుమబ్బు లేచి యేఁచి.

దైవసంపద కీతఁ డాస్థాని యగుట
నసురశక్తి వణంకు నీయన్నఁ జూచి;
తనివి పశుపతికిన్ బెన్నిధాన మగుటఁ
గలిమిలేములదెస కేగు తలఁపు రాదు.

పొలముదున్ని పొట్ట పో రణఁగించును;
కలముపట్టి దివ్యకవిత వ్రాయు;
చలముపూని చిత్తజయ మందుఁ బశుపతి;
లాఁతిగాఁ డితండు పోతరాజె.

(27-3-1981-కదంబకైత)

**శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ. (బాపట్ల)**

కలదు ప్రతిభ, లెస్సకలదు వైదుష్యంబు
కలదు మొక్కవోని పలుకుబడియు
కలదు కలదు లక్ష్మికాంతమ్మకు రసజ్ఞ
జాతి కింపు గూర్చు కైతచదురు.

తన విశిష్టవిభూతుల వనితవాణి
యొక్కఁడని చాటె మున్ను యదూద్వహుండు
సైరణకుఁ బుట్టినిల్లగు నారినుడికి
మానవుఁడె కాదు పాషాణమైనఁ గరఁగు.

నన్నపాచార్యు నుడిలోని నవకమెఱిఁగి
బడలి తిక్కన్న నుడిలోని పలుకునేర్చి
యీ కవీమణి పుట్టినయింటి జిగికి
మెట్టినింటి వన్నియకును మెఱుఁగువెట్టె.

కవితయందె కాదు కమనీయసంస్కృతి
రక్షయందు గానదీక్షయందు
బహుముఖప్రసంగ పరిపాటియం దీమె
మీనుమిగిలె నాంధ్రవిశ్వమునను.

మామిడిగున్న మీఁద మునిమాపులఁ గోయిల క్రోల్చులీల నీ
లేమ సభావితర్ది నవలేపవిదూరమృదూక్తు లాడుచో
జాములు జాములేగు నిముసమ్ములుపోలె సదస్యకోటి, కే
బాములు సైఁచి సల్పిన తపం బిటు పండెనొ యీటుకూరికిన్.

ఆ 'కావ్యఖండతతి' వా
ణీ కంఠమనోజ్ఞహారనిచయమ్ము కదా!
యే కృతినిగన్న ధర్మ
శ్రీ, కవితావైభవమ్ము చిందులు ద్రొక్కన్.

రాముఁడున్నాఁడు, జానకీరామ కలదు
పల్లవించిన పుణ్యంబు మొల్ల కలదు
అమ్మ కస్తూరి కలదు, మహర్షిగాంధి
కలఁడు కవితాసమీచీనకళల నిందు.

పిఱికివాఱినజాతికి బిగువు, బీర
మలవరించి, రణక్షోణి కరుగు తెగువ
గఱపు క్రొవ్వేఁడి పల్కు లీకవితఁ గలవు
ఝాన్సిలక్ష్మిగ నీలక్ష్మి చాటె వాని.

అమ్మ వాత్సల్యమూర్తిగా, నఖిలశక్తి
దాత్రిగా, క్షమాశ్రయముగా, ధర్మమునకు
రూపుగాఁ దోఁచునట్లు నేరుపులు గుల్క
నుగ్గడించిన యీచెల్లి పగ్గె మెత్తు.

పసితనమ్మునందె పరమహంసగ మాఱి
జగముకన్ను విప్పఁ జాలినట్టి
రామకృష్ణుఁ గనుఁడు, రమణీయ వాణిలో
బలికె నీ నెలంత భవ్యకృతిగ.

శారదాదేవి తన మేలిజవ్వనంబు
పతివిరాగమభాగ్ని కాహుతి యొనర్చి
ధన్యతారాశి యగుట నుదాత్తకవన
ధోరణిం జెప్ప నీవెలందుకకె చెల్లు.

కత్తికోఁతలతోఁ గాదు, చిత్తతురగ
నిగ్రహముతో మితాపత్యనియతి నేర్చి
మన సనాతనధర్మమున్ మనుపుఁడన్న
లక్ష్మిపల్కుల నార్షధీలాస్య మెసఁగు.

కవయిత్రీమండలమున
కవిరళ గౌరవము నిడుచు నాయుస్సుఖ వై
భవముల నీసోదరి నవ
నవకవితా సృష్టి సమభినందిత యగుతన్!

ఎంతనేర్చిన నేవో కొఱంతలుండుఁ
గాన, నిత్యవిద్యార్థిని కరణి వాణి
దయగడించుచు లక్ష్మికాంతమ తెలుంగు
జాతి నలరించుఁగాత విఖ్యాత కృతుల. (సన్మాన సంచిక)

**శ్రీ జూపూడి అమ్ములయ్య**

శ్రీమ "దమూల్యశ్రీ" శుభ
నామా! సద్గుణనికేతనా! మృదుకవితా
సామర్థ్యప్రాప్తయశః
శ్రీమంజుల! నిచ్చ నీకుఁ జేకుఱు జయముల్.

కవిత మన నెయ్యమున కాదికారణంబు
మనసు మన వియ్యమున కండయనుట నిజము;
ప్రథితిగన్న యీ సాహితీబాంధవమ్ము
తనరుఁగాక వాణీకృపన్ దరతరాన.
(తుమ్మలవారు తమ గ్రంథము 'కదంబకైత'ను వీరికి అంకితము చేసినారు).

ఈవు కళాయోగివి, నీ
భావమ్ములు విశ్వమానవత కంకితముల్
నీ వియ్యసేయు పల్కులు
పూవులకున్ మృదుత నేర్పుఁబో! సాధుమతీ!

కులము మతము లేదు గుణమెన్నుతటి నీకు
నార్తుఁగన్న వెన్న యగుదు వీవు
వినయ మార్జవంబు నిను వీడ; వింకేమి
వలయుఁ గవికిఁ, దమము వాపు రవికి.

ఇంటితావి జీవి కంటితీఱు నటన్న
సూక్తి నూఁది నిన్ను సుతుఁగఁ బడసి
చొక్కుగన్న గేస్తు జూపూఁడి వీరయ్య
జగ మలర్చు సాధుచరితుఁ డనెద.

ఇమ్మహి నర్థకామముల కెంతయు లోఁగి, జనాళి ధర్మమో
క్షమ్ముల విస్మరించి, దనుజత్వము నందుట సైఁపలేక, నీ
వమ్ములవంటి పల్కుల నుదాత్తకవిత్వము పల్కి, నామధే
యమ్మును యష్మదీయమును సార్థకమున్ బొనరించితే! కృతీ!

పద్యమును గద్యమును హృద్యలిపద్య నడుపు (బాట)
నొడుపు నీపాలి దని లోక ముగ్గడించు,
సాముచేసిన నబ్బు దీ చదురు, సహజ
వైదుషీ దీప్తిగా నబ్బవలయుఁగాని.

ఎందఱు కృష్ణవేణి పెను పెన్నరు? సహ్యనగంబు మున్నుగా
బందరు దన్క నీతటిని ప్రాపునఁ బండిన దక్షిణాపథా
స్పంద మహత్త్వ నీవలె విచారణచేసి వెలార్చినట్టి వా
రుందురె పెక్కు; రౌర! చరితోదధి ద్రచ్చితివోయి! నెచ్చెలీ!

బ్రౌను కృష్ణనీరు త్రాగి వేమనయోగి
నెఱి నెఱింగె నన్న నీదు తలఁపు
నీ తెనుంగు వలపు నిఖిలాంధ్రకవికోటి
కావహించుఁ దృప్తి నమ్ము లయ్య!

మకరార్కమహస్సు, కవి
ప్రకర ప్రత్యగ్ర కవన పణితవ్యము, భ
వ్య కళామంజుల కృతి సృ
ష్టికి నినుఁ బ్రేరేచుఁగాక స్థిరతరధిషణా!

కవితలు పల్కుచు విద్వ
న్నివహమ్ముల మెప్పుగనుచు నిఖిలానంద
చ్ఛవులన్ గాంతువు నీ వీ
నవాబ్దమున బంధుహితజనమ్ములు తనియన్.

నీ కృతులు తెల్గుశారద
కాకల్పము లగుత! సత్సభావళి విద్వ
ల్లోకము నినుఁ గీర్తించుత!
మీ కుదు రాంధ్రమున మేలిమేలిది యగుతన్.

మానకు మాంధ్రీవరివ
స్యా నిష్ఠను లాఁతిబరువు లవి పెల్లయినన్
మేనికి, నెడఁదకు సౌఖ్య
శ్రీనొసఁగన్ జాలుఁ గావ్యసృష్టి వయస్యా!
(14-1-1982-దివ్యజోతి +)

## శ్రీ యార్లగడ్డ వేంకటసుబ్బారావు
## (నల్లూరు - రేపల్లె మండలము)

పండితపట్టమున్ బడసి, పట్టమువాసికి వన్నెదెచ్చు ను
ద్దండ విపశ్చితుల్, క్షితి శతంబున కిర్వురొ లేక మువ్వురో
యుండెద; రిట్టిదిట్టలకు నొజ్జగ వేంకటసుబ్బరా వహో!
పండె నఖండ కీర్తుల సభల్ జయ పెట్ట మహాంధ్ర వీథులన్.

వేంకటసుబ్బరావు సుకవిత్వమునన్ గణనీయుఁ డయ్యు, నే
శంకకుఁ జిక్కినాఁడొ, తెరచాటుననే కృతికన్య నుంచె, నీ
లియంకిలి మానునట్లు, సకలావనియుం దనివోవ శారదా (అడ్డు)
కింకిణి మ్రోయునట్లు, కృషికిన్ సమకట్టుఁడు మిత్రబాంధవుల్!

ఈతఁడు రాజకీయగతి కేగనిచో గవితాకళారమా
నూతనరత్నహారము లనూనముగా సృజియించియుండుఁ; గా
నీ తనవెల్గు లాసరణి నిండిన చీఁకటులన్ లిదొలంచుటన్ (తొలగించు)
జేతము, కొంతతేఱుకొన సిద్ధమగున్ ననువంటి వానికిన్.

నిక్కముగాక యొండునుడి నేరఁడు, కార్యములైన కర్మముల్
తక్కఁడు సుబ్బరావు, ధృతి, దాతృత వీడఁ, డహంత కింతయున్
మక్కువచూపఁ, డీ విబుధమౌళికి నబ్బినమేటితీరు సౌ
రెక్కడిదన్న నీతఁ డుదయించినవంశ మొసంగి నట్టిదే!

సుతుఁడుగా, నన్నగా, గృహస్థుఁడుగ, నాప్త
జనుఁడు, పౌరుఁడుగా, విశ్వజనహితమ్ము
లినించు మనుజుండుగా నేత దేర్లగడ్డ (కోరు)
కోవిదుఁడు కన్న పేర్మికిం గొలఁది కలదె?

ఉత్తమసంప్రదాయమున కూడిగమున్ బొనరించు సుబ్బరా
ట్చిత్తము లాభలోభముల చెంగటికిం జన, దిమ్మనీషి సం
పత్తి కిదే నిదానమని పల్కెద, రక్షితమైనధర్మ్మ వా
పత్తిని జేరనిచ్చునె? శుభమ్ములు కర్తకులినీవి మానునే? (ఇచ్చుట)

ఒరుని కొఱంతలన్ గనక యొప్పునకున్ నెఱగద్దె వైచు, ని
గ్గఱువను గాంచి యారసపుఁ గ్రందునఁ గుందుచు లాఁతినాణెముల్
(అన్యుని యోగ్యతలు)
మెఱయక దోసమున్ వెదక మేకొనుమాసి కడింది సిగ్గు దొం (ప్రకటింపక)
తర లెసరేఁగి విన్నఁబడుఁ దల్లడమందు వగర్చు ద్రాబయై.

పూతచరిత్రు లాద్యులు తపోనిధు లాఁకలులేనిప్రేమ క
ద్వైతసమాఖ్య చెల్లునని పల్కిరి; కామ్యమునా నిదే కదా;
యీతఁడు సర్వభూతముల నీశ్వరుఁ జూచిన హార్దమూర్తి; య
ద్వైతముఁ బెద్దచేఁత యుచితం బగుధర్మువు నాదరించుటే!

"ఈసిరియెల్ల నీశ్వరుని; దెవ్వనియబ్బది కాదు; నిచ్చలున్
వేసట కోర్చి, చెమ్మటలు పిండిన పిమ్మట దీని ముట్టి, సే
బా సనిపించుకొమ్ము గుణభద్రులచే" నని పల్కుధర్మ మీ
ధీసరిదీశ్వరుం డనుమతించుట మంచికి మోఁకఱించుటే!

తనకున్ లాఁతికి వేఱు లేదనుట యద్వైతమ్ము; సర్వప్రజల్
తన రీతిన్ సుఖముంట మే లనుట యద్వైతమ్ము; లోకంబు దీ
నిని బాటింపదయేని విప్లవము సంధిల్లున్; దదీయోద్ధతిన్
మణఁపన్ శక్యముగాదు తంత్రములకున్ మంత్రాల కేనాఁటికిన్.

ఇంకొక నల్వదేండ్ల వఱ కీవు సమస్త సుఖమ్ములన్ నిరా
తంక జయమ్ములన్ మనుము! తావకపావనజీవనప్రభా
లంకృతమై త్రిలింగ మఖిలక్షితులన్ నుతులన్ గడించు!నో
వేంకటసుబ్బరాయ! సుకవిప్రవరా! శుచితాధురంధరా!
(25-9-1985-చక్కట్లు)

**శ్రీ అంతటి నరసింహము (షష్టిపూర్తి) (హైదరాబాదు)**

అంతటి నారసింహ మని నంతనె పొంగు మదీయచిత్త; మ
భ్యంతరకోటి నోర్చి యితఁ డాంధ్రసరస్వతి ముద్దుబిడ్డఁడై

మంతున కెక్కె; నొజ్జయయి మన్ననలందెఁ; గవీంద్రుఁడై ప్రజా
స్వాంతములన్ గరంచె; నిది చాలదె, వీని మహత్త దెల్పఁగన్.

చాలదు చీలిచీలి జివసచ్చినసంఘము, నుద్ధతవ్యధా
పాళికి లోఁగిలోఁగి చెడఁబాఱినసంఘము నుద్ధరింప ని
మ్మేలిమగండు పెద్దయు శ్రమించుట వాకొనకుండినన్ ద్విష
జ్జాలము నోర్చి పేర్చె నని సత్యము సర్వము చాటకుండినన్.

అఱువదియేండ్లు నిండె నటె!అంతటి; కీ చెలికానిచేవలోఁ
గొఱఁత రవంతయుం గలదొకో! సమతామహనీయయోగ మీ
గఱువకు దక్కి యీ బలిమికల్గె, ఫలస్పృహలేనిసేవ లీ
పురుషున కబ్బి యీ దిటవు పుట్టెను, పట్టె నితండు ధన్యతన్.

ఇంకొక యర్వదేండ్ల వఱ కీ వపరాజిత సర్వసద్గుణా
లంకృత కోరికొల్వ సకలప్రమదంబుల కాశ్రయంబవై
జంకని గద్దెలన్ వెలయు ఛాత్రసమాజము నమ్రమై జగా
లెంకతన మ్మొనర్పఁగఁ జెలీ! సుఖశాంతుల చొక్కు నందుమా!

ఎచ్చట బ్రహ్మవిద్య జనియించినదో, సమబుద్ధిలేనివాఁ
డుచ్చత నంద లేఁడను సదుక్తి యెటన్ రవళించెనో, సెబా
సచ్చట నింటి కొక్కతెర యడ్డముగా నిలిచెన్ నృసింహ!యీ
గచ్చపొదన్ బదాబదలుగా నొనరింపు మిఁకన్ జయంబగున్!

మన మొకనాఁడు పుణ్యమణుమాత్ర గడించినవార మౌటచేఁ
గనుఁగొనినార మీశ్వరుని గాంధిగవచ్చినవాని; బాపుజీ
వినిచిన యెల్లపల్కు నవవేదశిఖంబలె నుంటగంటి; మీ
ఘనతకుఁ దగ్గ మన్గడకు గాసిపడన్ వలె నోయి! నిచ్చలున్.

(1-1-1986) ( షష్టిపూర్తి సంచిక)

**నవావధాని శ్రీ మేడసాని మోహన్**

అప్పుడు బట్టుమూర్తి మొదలైన కవుల్ బుజ మప్పళించి నా;
రిప్పుడు మేడసాని ధ్వజమెత్తె వధానవిధాన చాతురిన్;
ముప్పిరిగొన్న మోదమున మోహనుపైఁ దెఱగంటి తోఁటపూల్
గుప్పి రయారె యంచు సరికొండమనీషియు మాడభూషియున్.

ఆశు వటంచు నీరసములైన పదమ్ములఁ జేర్చి, యన్వయ
శ్రీ శతధా వధించి, కవిసింహులు ప్రాక్తను లేగుత్రోవలన్
నాశమొనర్చువారి వదనమ్ములు వంగ నభంగ భారతీ
కౌశల మాశుధార నిడి కంటి వపారయశమ్ము మోహనా!

తిరుపతివేంకటేశకవిధీరులు, కొప్పరపుం గవీశ్వరుల్
దురము లొనర్చునాఁడు రసతోయధి మున్గిన తెన్గువారికిన్
మరల నవావధానములు మంజుతరాశుకవిత్వముల్ పొరిం
బొరిగ నొనర్ప ని న్నిడిన పుస్తకపాణికి వాణి కంజలుల్.

అవిరత రాజకీయ సమరాంకిత జీవితమై కలంగుచున్
నవయు జనమ్ము సమ్మదసనాథము కావలెనన్న, సాహితీ
ప్రవణము కావలెన్, గళలపట్ల మమత్వము నేర్చుకోవలెన్
కవులకుఁ జుట్టమై మెలఁగఁ గావలయున్ గనువిప్పఁ గావలెన్
(6-1-1986-దివ్యజ్యోతి)

**శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి (నెల్లూరు)**

వేయినెలలఁ గన్న వృద్ధుఁడ వైతె కో
దండరామరెడ్డి ధరకు వచ్చి
యేల రిత్తకోర్కి? యిఁక నైదువందల
నెలలఁ గనుము, సౌఖ్యనిధిగ మనుము.

ఆయువు నాఱడిసేయక
చేయందగుపనులు పెక్కుచేసితి, లోక

శ్రేయమున కాసపడి సమ
తా యోగము నవధరించి ధన్యత పండన్.

ఈ వాంధ్రసరస్వతికిం
గావించిన సేవ కుద్ది కలదా? తెనుఁగుం
జేవగలపల్కునకు నీ
వావిష్కృతిచేయు రచన యాదర్శమగున్.

తిక్కన మెఱసిన పలుకుం
జక్కన గుర్తించి, దాని చందము చాటన్
మిక్కిలి నలంగి గెల్చితి
వక్కు విఱిచి నిక్కువార లవనతి నందన్.

ఆస్తికుఁడ వీవు, శివకేశవాంతరంబు
లేని బుధుఁడవు, కర్మఫలానురక్తి
లేని యోగివి, నిను వంటి జ్ఞాని బ్రదుకు
సంస్కృతికి నండదండగా సాగవలయు.

(10-1-1986-చక్కట్లు)

**శ్రీ రంధి. సోమరాజు (రసోరాజు) (విశాఖపట్టణము)**

అఱువదేండ్లకు నేమి? యింకొక
యఱువదేండ్లీ ధరణి నిల్వుము
సోమరాజా! నీ కలమ్మున
సుధలు కురియంగన్

తెలుఁగుపేదల నాల్క నురలెడి
పలుకుపస నీ పాలి దాయెను
కలిమివాసనలేని బ్రతుకుల
కథలు నీ వాయెన్.

అగ్రహారమునందుఁ బెరిఁగిన
అయ్యు లెఱుఁగరు తెనుఁగుసొరులు

పల్లె పట్టున కంకితంబై
పరఁగు నీ సొబగుల్.

గ్రాంథికమ్మున కంటె బిగువై
కండపెంచిన వ్యావహారిక
మడుగువారికి బడుగువారికి
హర్ష మెట్లొసఁగున్?

చదువునేర్చినవాఁడ వయ్యును
సాములెఱిఁగిన ప్రోడవయ్యును
ఇచ్చపడవు బడాయి బాసకు
నెడఁద మృదు వగుటన్.

అసురశక్తుల రెచ్చఁగొట్టుట
కాస చేయని కైసరుండవు
మానవత్వము నాదరించెడి
మంచితనముంటన్.

కరుణనేర్పును, సమత నేర్పును
కష్టసుఖముల నోర్మి నేర్పును
ఈవి నేర్పును, నేర్పు నార్తుల
సేవ, నీ కవితల్.

కల్ల యెఱుఁగని, కపట మెఱుఁగని
కాసులకుఁ బెడదారి త్రొక్కని
వలపు లోఁతులు చాటు నిపుణత
వలచెఁబో! నిన్నున్.

సంప్రదాయము మానినంతనె
చక్కచక్కనికైత పుట్టదు;

ఆర్జవం, బావేశ మున్నపు
డది బయల్ వెడలున్.

కులగిరుల్ తూఁగాడి క్రుంగిన
జలనిధిన్ బడబాగ్ని రేఁగిన
బ్రజామానిత రసోరాజా!
వరలు నీ కవితల్.

మల్లియై జేజేలఁ దనిపెడి
వెల్లియై పున్నమనెఱా జా
బిల్లియై నీ కీర్తి దిశలకు
వెల్లవేయు నయా!

(2-2-1986- దివ్యజ్యోతి)

**శ్రీ నల్లపనేని మార్కండేయులు (చీరాల)**

మేలి మేలికైతల నను
మెచ్చిన మార్కండేయా!
యేల వీనికొఱ కీశ్రమ
నీకొంటివి బుధవిధేయ!

నీవంటియుదారమతులు
పావనభావప్రసిద్ధు
లీ వసుధన్ గొందఱుంట
నే నొక కైసరుఁడ నైతి.

ఏ నెఱుఁగని దెంతో కల
దెఱిఁగిన దావంత సుమీ!
యైనను గవితా నిర్మితి
మానలేని వెఱ్ఱినైతి.

మందులతో నా వ్యాధులు
మానవు, కవనమునఁ గాక
విందైనది ముసలిబ్రదుకు
నందైనను నాకీపని.

నీ కవితాభ్యుదయంబును
నీ కీర్తిని, నీ తృప్తిని
నీ కృతకృత్యతను సతత
మాకాంక్షింతును వయస్య!

మధురవాణి నీకున్నది
మంచిమనసు నీ పాలిది
సుధలూరెడికృతులు పల్కి
సుకవిస్తుతు లందుకొమ్ము.

(4-4-1986- దివ్యజ్యోతి)

## శ్రీ బమ్మెర పోతన

పొలము దున్నుచున్న పోతరాజుం గని
వాణి తనిసి బాష్పవారి గురిసె;
పదను చూచి విత్తె బమ్మెరకవి, కాఁపు,
కంకి వెడలె రత్నగర్భ మగుచు

దారిద్ర్యము నరునిన్ బెడ
దారికి మరలించు తులువదయ్యము; సమతా
శ్రీరాశి యగుటఁ బోతన
యీ రక్కసికాళ్ళు విఱిచె హేలామాత్రన్.

విత్తముతో విల్తుము కవి
సత్తముల నటంచు జబ్బ సఱచిన ఱేఁడుల్
చిత్తైరి, పాసె మొల్లక
పత్తెపు గంజిని వరించు బమ్మెర చేతన్.

తెలుఁగువారి పున్నెములు పండిపండి భా
గవత రచన కితఁడు గంట మూనె;
కదలి పొదలి పొంగెఁ గైవల్య కల్యాణ
దాతయైన తీయకైత యిందు.

నిజహృదిన్ రామభద్రుండు నిలుచు; మృదుల
పీఠము నొనర్చి కవిత గుప్పించె నితఁడు;
నందనందన మురళీ స్వనమ్ము మొరసె
నఖిల పదములఁ గాదు - ప్రత్యక్షరమున.

ఏ కథ నేపద్యమ్మున
నే కడఁ గనుఁగొన్న మాయురే! శమ దమ శౌ
చా కాంక్ష గూర్చు పలుకే
వాకొనెఁ బోతన్న పారవశ్యం బెసఁగన్.

శ్రుతిమర్మంబు, లుపనిష
న్మత రీతులు, కానలేని మానవుఁడు కృతా
ర్థత నందఁగలఁడు పోతన
కృతి భాగవతంబు నాలకించిన నర్థిన్.

హరిభక్తి మరగి మనుజుఁడు
చిరంతనానంద పదము చేరుటకై బ
మ్మెర కవిచంద్రుఁడు దిద్దిన
తెరువులు కొడికట్టులేని దివిటీ లయ్యెన్.

ఓనమాలు రాని కూనకున్ గేసన్న
కొడుకు కైత వచ్చుఁ గొంతయేని
యే తెలుంగుకవికి నీ భాగ్య మబ్బె? వే
మన్న కించుకంత యబ్బె నందు.

గాలిలోని దివ్వె కలిమి; వెల్లువ నీటఁ
బొడమి యూఁగులాడుబుడుగ లేమి;
పాయరాని సొత్తు పరు; వన్న పోతన్న
తెలివిలేనికవికి దేశికుండు. (ఫిబ్రవరి- 1986- చక్కట్లు)

**వాఙ్మయమహాధ్యక్ష శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య**

గోపాలకృష్ణకృతి ప్రతి
భా పాండిత్యములు వడసి భాషాపరిచ
ర్యా పరుఁడై తెలుఁగుం బ్రజ
కాపోకలు గూర్చి పేర్మి నందుట మెత్తున్.

మా దారు లక్కడక్కడ
భేదిల్లుట నిక్క; మైనఁ బ్రేమించెద నీ
సోదరు వైదుష్యములో
నాదారుతనమ్ములేని నాలుక యుంటన్.

నన్నయ కేతన తిమ్మన
చిన్నయ మున్నగుబుధుల్ సృజించిన సృతు లీ
పిన్నఁడు మథించెనటె! యీ
విన్నాణ మెఱింగి పొంగు విద్వత్పదముల్.

రాగిరేకులపై, నల్లఱాలమీఁదఁ
బాదుకొనియున్న ప్రాఁబల్కుఁ బసిఁడిపంట
నింటికింటికిఁ బంచు కాఁ పితఁడు; వీని
కరిసనమ్ము తెనుఁగుతల్లి దరిసెనమ్ము.

అరసున్న తా వెలుంగని
నెఱసున్నల కితని మెఱుఁగునెఱి కన్పడునా?
చిరతరతపమ్ము కావలె
గురుతరవాఙ్మయపయోధి గుట్టులు తెలియన్. (జనవరి - 1957)

## కవిరాజు శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి
## (శతజయంతి సమయము)

సత్యనిష్ఠయుంట సాహితీబలముంట
రసవిశిష్టమైన రచనయుంట
నదురుబెదురులేని మదియుంటఁ గవిరాజు
సాటిలేని కీర్తి సంతరించె

త్రిపురనేని కవీంద్రు నుతింతుఁ బలుకుఁ
బరువు డింపని భావవిప్లవవిధాత
నితని సూతపురాణాదు లెసఁగె నార్య
జాతితంత్రచ్ఛటాస్ఫోటహేతు లగుచు.

ఒక విప్లవసారస్వత
శకమునకున్ గర్తయయ్యెఁ జౌదరి; జడతా
ధికతా విధేయభావ
ప్రకరంబుల వ్రక్కలించు పలుకుం బలిమిన్.

మా యన్వయ మగ్రీయము
మా యున్నతిగణ్య మనెడిమానవు నుదుటున్
మాయించె నితఁడు సత్య
స్ఫాయ దజేయోక్తి యుక్తి సంధాచణతన్.

అడఁగిమడఁగి వేల్పునుడి వ్రేగునన్ బెల్లు
తల్లడిల్లుచున్న తల్లిబాస
జంకు దూల్చె నితఁడు, సన్నజాజులఁబోని
తెనుఁగునుడులఁ గైతఁదీర్చి పేర్చి.

తిరము లితనికృతులు తిక్కన్న వేమన్న
చేమకూర కవుల సృష్టులట్లు;
నిక్కమైన తెల్గు నేర్తురుగాక యీ
నేలవారు వీని నెఱినెఱింగి. (20-8-1986-చక్కట్లు)

**చిట్టిప్రోలు కృష్ణమూర్తి**

మచ్చలేని మేలిమనుగడ నీది జ
గా మెఱుంగలీను కైత నీది
కలవు నీకు నైకగౌరవములు తెల్గు
నాఁటియందు నెల్లవీటియందు

**శ్రీ ఉల్లి రామసుబ్బయ్య**

ఇతఁ డుల్లి రామసుబ్బయ
కృతమతి కవితాతపస్వి కేవల సార
స్వత సేవా ప్రవణతమై
నతిదుష్కరమైన చేఁతకైనఁ దెగించున్

ఇతఁడు పదురమేలు నీకొను మంచివా
రున్నదెసకు దూఁక నుత్సహించు
వెచ్చమెంతయైన వేసటయెంతైన
నుజ్జగింపఁ డీ సదుద్యముండు

మజ్జయంతిపేర మాచెర్లపురి సభన్
గూర్చె నితఁ డలంత కోర్చి యోర్చి
మఱవరానిమేలిమన్ననలన్ నన్నుఁ
దనిపె నాప్తు లండదండగాఁగ

సుబ్బుట నా వ్యాపించుట
సుబ్బెడి తీ రున్నవాఁడె సుబ్బయ, గుహలో
గబ్బిలముంబలె నుంటకు
సుబ్బయ తలయూఁపఁ డనుట సూనృతమ కదా!

సుజను లెల్ల రితనిచుట్టాలు, కులమత
చర్చరాదు వీనిసంఘమందు
ఇతనితలఁపు లోకహితమౌట సఫలమై
పకలమానవప్రశంస లందు

నీకోర్కులు సఫలములగుఁ
గాక! దయామూర్తి రాముకరుణను, శిల్ప
శ్రీకలితకవిత లెన్నో
నీకరమున వెడలుఁగాక నెయ్యురు తనియన్

**చిట్టిప్రోలు వేంకటరత్నము**

శ్రీ వేంకటరత్నకవీ!
నీ వనవద్యములఁ గృతుల నిర్మింతువు నిన్
గోవిదకవిమండలి వా
ణీవైభవ మెసఁగఁ బొసఁగ నిచ్చలు మెచ్చున్

కృష్ణమూర్తి కావ్యకృన్మౌళి నీతండ్రి
యగుట నీవు సుకవి వతనిసుతుఁడ
వగుట సూచి లోక మౌనని తలయూఁచు
వెఱ్ఱికవులు గూర్చువెతలు మఱచు

నావంటివారు జగమున
వేవురు గల రైన నేమి వేంకటరత్నా!
నావలన మొగ్గ సూపితి
వీవు ముదిమికేని మార్కు లిచ్చితి వేమో!

నాఁటి నేఁటికవుల మేటికబ్బములను
జదివి శబ్దశాస్త్రసరణు లెఱిఁగి
యుగవిధానుకూల మగుకైత పల్కుట
గణ్యతరము పూర్వపుణ్యఫలము

**శ్రీ ద్వారము వేంకటస్వామినాయుడు**
**(అంధుడు- ఫిడేలు ప్రవీణులు- విజయనగరము)**

చిన్నారి తెలుఁగింటి కన్నె బంగరుటందె -వలకారి జిలుఁగు సవ్వడులు దిద్ది
గౌతమీకృష్ణవేణీతరంగచ్ఛటా - పటుతరార్భటి హరిత్తటుల నింపి

తెలుఁగుభక్తులగుండియల నూరి జాల్వాఱు - తేటపాటల తీరు తీయ మరసి
ఆంధ్రగీతి ప్రపంచాశేషమృదురవ - స్ఫురణ కాచార్యకంబును వహించి

లలితకర్ణాటగానకలా సరస్వ
తీ సవిత్రి సమర్చనాధీనవృత్తి
నలసిపోయిన గీతరత్నాకరునకు
నేఁటి సన్మాన మొక్క పన్నీటిజల్లు

పోయినచూపు లోపలికిఁ బోయి, హృదంతర దివ్యలోక బృం
దా యమునాతటీ విహరణప్రవణ ప్రభు వేణునిస్వన
చ్ఛాయలఁ దెచ్చుకొన్న యొక చక్కనినాదము పొమ్ము నీదహో!
నాయఁడ! ముగ్ధులై మురిసినారు తెలుంగులు నీకమానులోన్. (వయొలిన్)

జాతిని దిద్ది తీర్పఁగలజాణలు గాయకులుం కవీంద్రు లీ
నీతి నెఱింగి ప్రాక్తనులు నేర్చిరి వీరి సమాదరించు; టా
తాతలనాఁటి ధర్మము,నుదారతయున్ దలయెత్తె నేఁటి కీ
రీతులు సాగిసాగి చివురించుతఁ జిత్కళలైన సత్కళల్.

(19-3-1949-పఱిగపంట)

### శ్రీ చిత్తూరు నాగయ్య
### (గొప్ప సంగీతవిద్వాంసుడు, నటుడు)
### (అప్పికట్ల (గుంటూరు జిల్లా) పౌరులు సన్మాంచినతఱి)

తెలుఁగుభాగవతమ్ము తెరదీసి నిద్రాణ - జాతి మేల్కొల్పిన పోతరాజు
ఆటవెలంది యొయ్యారమ్ముతో నభి - రామ సంస్కృతి పంచు వేమయోగి
స్వరరాగమూర్తియై స్వర్గాపవర్గమ్ము - కనులకుంగట్టు త్యాగయ తపస్వి
శీలమ్ము సడలినజీవి కోల్కొనఁ డన్న - రాణ దెల్పిన శివరామ భోగి

రాకచే వచ్చెఁ గోదండరాముఁ డిటకు
నిచట బంగారుపండె నైదేఱు లుబికె
సాధుతరధర్మరేఖ సాక్షాత్కరించెఁ
గలిమి ఫలియించె నేఁ డప్పికట్లపురికి.

ఎవ రీనాగయ? మా త్రిలింగనటరాజే యంచు, మాజాతి పై
భవమే యంచుఁ, దెలుంగువారు జయగర్వస్ఫూర్తి మన్మూర్తులై
చివురుల్ వెట్టఁ "కలామయుండితఁడు, మా సీమన్గదాపుట్టె" నం
చివతాళించెద మేము మాసుకృతసాహిత్యంబు కొండాడుచున్.

కవివరులున్ నటాగ్రణులు గాయకముఖ్యులు జాతిసంస్కృతి
చ్ఛవులు సృజించువా రనుటఁ జాటు నఖండమహీచరిత్రముల్
కవితయు, నాట్యకౌశలము, గానపటుత్వము నిన్నుఁ జేరి నీ
కవిరతకీర్తి గూర్చెఁ జరితార్థుఁడ వీవు కదయ్య! నాగయా!

లక్షలుతెచ్చి తావకకలారమ నిన్ యజియింప, నీ వహో!
భిక్షలు మెచ్చి దైన్యపరిపీడితులన్ భజియింతు, వీ కృపా
దీక్షకు ముగ్ధమయ్యె జగతీవలయంబు వదాన్యమౌళి! నీ
పక్షమునందె సత్కవులు పల్కెద రంజక సాగిపొ మ్మిటుల్

సాగినది తెల్గుతల్లి కాంచనరథమ్ము
పండినది తెల్గుజాతి నిర్భరతపమ్ము
సోదరాంధ్ర వికాసముల్ ప్రోదిసేయ
వలయు, నాకల్పము నటింపవలయు నీవు.

(23-5-1953-శబల)

## సద్గురువులు

భరతభూమిని బుట్టుటే భాగ్య, మందు
నరుఁడుగా నుద్భవించుట పరమభాగ్య
ముత్తమోత్తమ భక్తుల, యోగివరుల
పాద మంటని చోటిందు లేదు గాన.

పుట్టిపుట్టి జీవి పుణ్యబలమ్మున
గట్టకడకు నరుఁడుగా జనించె
నరతఁ జూచి యిదియ పరమభాగ్యం బని
తనియ కీశ్వరత్వ మెనయవలయు.

## శ్రీ శంకరాచార్య

జననమరణముల్ సుహృదహితులు, ధనస్వామి నిస్స్వకులు
వనితాపురుషులు, శీతాతపమ్ములు, వాఁడు వీఁడనెడి
పెనుజంట తెగులు పోకార్ప నోపిన భిషగ్గ్రియుండు
జనియించె భారతక్షోణి నద్వైతసౌధ నిశ్రేణి

ఎఱుక పండినంత నేగు నహంత స
మత్వదృష్టి యొదవు మానవునకు
శంకరుండు మున్ను చండాలునిన్ ద్విజు
నొక్కరీతిఁ జూచె నిక్కతాన.

తనకున్ లాఁతికి వేఱులేదనుట యద్వైతమ్ము; సర్వప్రజల్
తనరీతిన్ సుఖముంట మేలనుట యద్వైతమ్ము; లోకంబు దీ
నిని బాటింపదయేని విప్లవము సంథిల్లున్; దదీయోద్ధతిన్
మఱఁపన్ శక్యముగాదు తంత్రములకున్ మంత్రాల కేనాఁటికిన్.

## భజగోవిందమ్

గోవింద ప్రభు సంతత
సేవావ్రత మూను, మితరచింతన మేలా,
వైవస్వతుఁ డెత్తినతఱిఁ
గావదురా శబ్దశాస్త్ర కౌశల మజ్ఞా !

విత్తము సేకరింపవలె వేలుకువేలను కోర్కి మాని, నీ
చిత్తమునన్ దురాశలను జేర్పక, సారవివేక మూని, నీ
వృత్తముచే వశం పడిన విత్తము కాసయినన్ సహస్రమం
చత్తిన వేడ్క నెంచుకొనుమా, వినుమా, యనుమాన మేటికిన్.

పొలఁతుక గబ్బిగుబ్బలను బొక్కిలిఁగన్గొని మోహవార్ధి లో
పలఁ బడఁబోకు; దుర్గతికిఁ బాల్పడఁబో; కవి చీమునెత్తురుల్
గలిగిన కండలంచుఁ బొడఁగాంచిన వేళల మాటిమాటికిన్
దలఁపుము; పై మెఱుంగులకు దాసుఁడవై చెడిపోకు మజ్ఞుఁడా!

నలినీ పత్రము మీఁది వా:కణము ప్రాణం బౌట కన్గోక, మ
ర్త్యులు తృష్ణామయ పీడితాత్ము లగుచున్, దు:ఖాబ్ధి నిర్మగ్నులై,
తెలివిం గోల్పడి, దారిగానక, కడున్ దేహాభిమానమ్ముతో
నిల వర్తింతురు గాని, సౌఖ్యపడువా రెవ్వార లీ ఱొంపిలోన్.

వేలకువేలు మానవుఁడు విత్తము నార్జన చేయు వేళలం
దాలును బిడ్డలున్ హితులు నందఱు నాతని గారవింతు, రా
యాలును బిడ్డలున్ హితులె యర్థము గూర్పఁగ లేక వృద్ధుఁడై
కాలము పుచ్చువానిఁ బొడఁగాంచరు పిల్చినఁబల్క రొక్కరున్.

బొందిని బ్రాణవాయువులు పోవక నిల్చెడునంతదాఁక, ని
న్నందఱుఁ గూర్మిమైఁ గుశలమా తమ కంచును బల్కరింతు, రో
మందుఁడ! నీవు చావఁగనె, మక్కువ నించిన పెండ్లమైన నీ
కందిన మేను చూచుటకుఁ గాతరతన్ గుడుచున్ విరక్తయై.

కా సొకవేయిగాఁ దలఁచి, కల్లలు పొల్లులు కూసి, సొమ్ము పే
రాస గడింపనేల, విను మర్థ మనర్థమపో, సుఖం బటన్
వీసము కానరాదు సుమి! విత్తము కల్గిన యట్టి వారి కౌ
రా! సుతుఁడైన సంతత భయప్రదుఁడై కనిపించెడిన్ గదా!

చెడుగుడులాడఁ బాడఁగను జిన్నతనంబున నాసచేయు, లేఁ
బడఁతులతోడఁగూడ నెలప్రాయమునం దభిలాష పెంచు, వృ
ద్ధుఁ డయిన పిమ్మటన్ విషయదు:ఖములన్ గృశియించు నింక నె
న్నఁడు మనుజుండు తత్త్వ గమనం బొనరించి తరించు నక్కటా!

ఎక్కడి దీ లతాంగి? సుతుఁ డెవ్వఁడు? వీరికి నీకు నెవ్విధిన్
జిక్కెను బాంధవం? బతివిచిత్రమ యీ తగులాట, మిందు నీ
వెక్కడి నుండి యూడిపడి? తెవ్వనివాడవు? దీని తత్త్వమున్
జక్క నెఱుంగవయ్య సదసత్పరిశోధక బుద్ధి యేర్పడన్

సంగత్యాగము కల్గు సజ్జనులతో సాంగత్యమున్ జేయ, ని
స్సంగత్వంబునఁజేసి మోహము వినాశంబందు, నిర్మోహతన్
భంగంబున్ గనఁబోని తత్త్వ మది సంప్రాప్తించు; నద్దానిచే
వంగై కోలొనరింతు రుత్తములు జీవన్ముక్తి సౌహిత్యమున్

కాయ పటుత్వ మెల్లఁ జెడఁ గామ వికార మదెట్టులుండుఁ, బా
నీయము వట్టిపోవు తఱినిన్ జెరువన్న దిఁకేడనుండు, నా
దాయ మడంగ భృత్య సముదాయము నిల్చునె, తత్త్వ మబ్బుచో,
బాయక యున్నె సంసరణ బంధము లాపదనీక బీజముల్.

భోగము భాగ్యమున్ సతులు పుత్రులు ప్రాయము నిత్యమంచు నీ
వీగతి మోసపోకు, మివియెల్ల హుళక్కి యటంచు, వీనిపై
రాగము మాని, విశ్వపరిరక్షకు నక్షయ సౌఖ్యదాయకున్
బాగుగ నమ్మి తత్పథము పట్టు మసార విచార మేటికిన్.

శిశిర వసంతముల్ మొద లశేషఋతుల్ మఱి సందె వేకువల్
నిశలు పవళ్లు పర్విలిడ నీ బ్రదుకంతయుఁ జెల్లెఁ గాని యో
కృశమతి! నిన్నుఁ గ్రమ్ముకొని క్రిందికి మీఁదికి లాగునేమి నీ
వశమున కింత లోపడక వాంఛలు దుస్సహధాటి నేఁటికిన్.

వనితా కాంచన చింత నిచ్చలు నిషేవ్యంబాయె నౌరౌర! దీ
నిని మానందగు నంచు నింతదనుకన్ నీ కెవ్వరుం జెప్పరో!
ఘన సంసార సముద్ర వీచి గడవంగన్ లోకముల్ మూఁట స
జ్జన సాంగత్య మొకండె నావ యగుచున్ సాయంబు సేయుంజుమీ!

కావిమెఱుంగు వేసములు కట్టి, జటాలురు బోడు లెందఱో
క్ష్మా వలయంబునం గలరు గాని, గిరుల్ పరమాణు మూర్తులున్
దావులుగా, వెలుంగు పరతత్త్వముఁ గాంచిరె, పొట్టకూటికై
యీ విధి దంభవేషముల నెత్తెడి శుంఠలు దాని కర్హులా?

ముడుతలు వాఱె మేను, శిరమున్ నెరసెన్, బదునాఱు దంతముల్
విడివడి పోవఁగా, మొగము వెల్తిపడెన్, శతవృద్ధుఁ డౌటచే
నడుగిడ లేక, దండ మొకఁ డానెఁ గరమ్మున నూఁతకోలగా,
విడువఁడు తృష్ణ నిప్పటికి వెంగలి మానిసి నేమి సెప్పెదన్?

అనయము వ్రేల్చు నాతఁడు హుతాశనుఁ జండమయూఖ తాపరా
శిని, బవలెల్లఁ గ్రాఁగును, నిశీథమునం జుబుకంబు జానులం
దునిచియ నిద్రపోవు, గరయుగ్మమునం దిను భిక్ష, చెట్టు నీ
డను వసియించు, నిట్లయి విడం డొక తృష్ణను మాత్ర మేలొకో!

గంగా సాగర యాత్రలన్ సలిపినన్, గాంగేయ దానంబు లు
ప్పొంగన్ సజ్జన కోటి కిచ్చిన, వ్రతంబుల్ పెక్కు సాగించినన్,
సాంగో పాంగముగా శ్రుతి స్మృతుల యభ్యాసంబు నార్జించినన్,
సంగుం డే గతి నందుకోఁ గలఁడు మోక్షశ్రీ కటాక్షంబులన్.

గుడులను జెట్లనీడలను గూడుచు, నేలను బవ్వళించుచున్,
దడసరి తోలు గట్టి, వనితా ధన దాస తురంగ లబ్ధికై
బడలుట లేక, భోగములపై మది నిల్పు, కెవండు తత్త్వమే
ర్పడఁ బరికించు, వానికి విరాగ మొసంగు సుఖం బలంతియే!

యోగ సమాశ్రితుం డయిన, నుత్తమ భోగ నిధానుఁడైనఁ, దా
రాగ విహీనుఁడైన, ఘన రాగ పరీవృతుఁడైన, నిత్య మ
య్యాగమ వేద్యు, సర్వ జగదాద్యు, ననంతు, నకల్మషున్, బరున్,
బాగుగఁ జిత్తమం దిడిన బ్రహ్మపదంబును జేరకుండునే?

గీతల లోపలన్ వెలయు కీలు నెఱింగిన వాఁడు, స్వర్ధునీ
పూత జలంబు ద్రావిన సుపుణ్యుఁడు, కేశవ నామకీర్తన
ప్రీతుఁడు, ప్రేత నాయకుని భీషణ ముద్గరముం దలంచి, లో
భీతిల నేల, దండధరు బింకము సాగునె వాని ముంగడన్.

పలుమఱు జన్మమెత్తుటయుఁ, బల్మఱు చచ్చుట, మాతృ కుక్షిలోఁ
పలఁ బలుమాఱు సొచ్చుటయుఁ, బాపపు సంసృతిచే నగుం గదా!
తెలియుము కర్మ బంధములఁద్రెంచి సుఖించు పథంబు; దీనికై
వలసిన మేలివెల్గు సిరివల్లభుసేవ యపో త్రిశుద్ధిగన్.

యోగ నిబద్ధ చిత్తుఁడగు యోగివరేణ్యుఁడు, సందుగొందులన్
మూఁగిన రిత్త పేలికల బొంతలు గుట్టుచుఁ, బుణ్య దుష్కృత
త్యాగ మొనర్చి, బాలుని విధంబునఁ, జిత్త వికారి కైవడిన్,
వీఁగని వేడ్కలో మునుక వేయుచు, నిర్మముఁడై రమించెడిన్.

ఎవ్వఁడ వీవు? నే నెవఁడ? నిచ్చటి కెచ్చటి నుండి రాక? యీ
యవ్వయి నయ్య యెవ్వ? రని నప్పుడు సంసృతి స్వప్నతుల్యమై
నివ్వెఱఁగున్ ఘటించు టది నిక్కము, కానఁ దదీయ బంధముల్
త్రెవ్వఁగ నేసి, యున్మిషిత ధీ నిలయుండవు గమ్ము తమ్ముఁడా!

అందఱ లోపలన్ వెలయునట్టి మహాత్ముఁడు విష్ణువొండ, యీ
చంద మెఱింగి,భేదములఁ జంపుము, భూత దయామయుండవై
పొందుము మోక్ష సౌఖ్యములఁ, బుట్టుట గిట్టుట కట్టిపెట్టు, మో
మందుఁడ నీవు నే ననెడు మచ్చర మేటికి మాటి మాటికిన్.

లోపలి శత్రు షట్కమును లోఁచిన వాఁ డపరోక్ష బుద్ధికిన్
బ్రాపయి, తన్నుఁ దా నెఱుఁగు బ్రహ్మముఁగా నవికారమూర్తిఁగా
నే పశు వాత్మతత్త్వ మది యించుకయే నెఱుగం డతం డిసీ
పాప గృహంబు సంసృతికిఁ బాల్పడి నారక వహ్ని మ్రగ్గెడిన్.

గీతా నామ సహస్రమున్ నిరతమున్ గీర్తింపుమా; శ్రీపతిన్
జేతో వీథి నఖండభక్తి వెలయన్ సేవింపుమా; సజ్జన,
వ్రాత స్నేహ మొనర్చి పూతమతివై వర్ధిల్లుమా; విత్తపుం
బాఁతుల్ ద్రవ్వి, దయానికేతనుఁడవై పాలింపుమా పేదలన్.

(ది 30-5-1923)

## శ్రీ నరసీమెహతా

**("వైష్ణవజనతో" అను గుజరీకీర్తన కర్త) (మహాత్మునికి ప్రియమైన కీర్తన)**

వాఁడే వైష్ణవుఁడని పలుకందగు - వాఁడే వలయును జగమునకు
ఇతరజీవులను బాధించెడు వెత - లెఱిఁగి జాలిపడువాఁ డెవఁడో
ఒరులదు:ఖములఁ దీర్చినపిమ్మట - గరువము నందనివాఁ డెవఁడో
అణఁకువతోఁ బ్రజ కంజలిసేయుచు - నన్యుల దూఱనివాఁ డెవఁడో
తలఁపు, పల్కు, పని యొకటై తల్లికి - ధన్యత గూర్చినవాఁ డెవఁడో
సమతనంది, యాశలు విడి, పరసతి - జననిగ నెంచినవాఁ డెవఁడో
దబ్బఱలాడక లాఁతివారిసిరి తాఁకక నిల్చినవాఁ డెవఁడో
మాయామోహము లణఁగి విరాగము మదిలో నిండినవాఁ డెవఁడో
తెలిసి రాము పే ర్విని వినితనువే తీర్థము చేసినవాఁ డెవఁడో
కపటము లోభము కామము క్రోధము కడచి మెలంగెడివాఁ డెవఁడో
కన్నవారి తరతరములపాపము కాల్చివేయఁగలవాఁ డెవఁడో
మేలు! మేలు! సేబా! సని నరసీమెహతా మెచ్చినవాఁ డెవఁడో
వాఁడే వైష్ణవుఁడని పలుకందగు - వాఁడే వలయును జగమునకు

(1968 - మహాత్మకథ)

## శ్రీ అసంగానందయతి

స్త్రీ శూద్రులకును శ్రుత్యుప
దేశము తగునని జగమ్ము దిద్దిన సమతా
కోశ మసంగానంద య
తీశుఁడు తొలుబంతి యొజ్జ యిక్కాలమునన్.

ఎంతచెడిన నొకని కెత్తు మారతి యని
యెంతతగిన నొకని గెంతు మనియు
వక్కణించుమతము వైదికమా యన్న
యతి కసంగమౌని కంజలింతు.

మనుజు నొక్కని దేవతామౌళిఁ జేసి
యొకని నస్పృశ్యతాదోష నికృతుఁ జేసి
నారి నవమానభారావనతను జేసి
దారి దప్పెను హిందూమతప్రవక్త.

అతిథిసేవఁ దగిలి, యధ్యాత్మవిద్యలోఁ
బండి, యార్జవమ్ము పడసి, నిష్ప
రిగ్రహమ్ము నవధరించి, తపస్వియై
పరఁగు నెవ్వఁ డతఁడె బ్రాహ్మణుండు.

పాణి వాణి పిచండ ముపస్థ మనఁగఁ
బరఁగువాకిళ్ళను మనీషి పసిఁడిముట్ట
కనృతమాడక, పెద్దయుం దినక, లాఁతి
మగువనొల్లక మూయు బ్రాహ్మణుఁ డతండె.

ప్రాఁతలైన దాల్చి, పసలేని కూడైన
మెసవి, నేలపైన మేనుమోపి,
ప్రాణికోటికెల్ల బంధువై, సమతమైఁ
బరఁగు నెవ్వఁ డతఁడె బ్రాహ్మణుండు. (1976)

**శ్రీ దయానందసరస్వతి**

సాంస్కృతిక పారతంత్ర్యము సైఁపరాని
కీడు నిడు జాతి; కిది రాజకీయమైన
బానిసము కంటెఁ జెడు; గని దీనిఁ ద్రోయ
నడుముగట్టినయతి దయానంద సుకృతి.

కులము నతకరించి, గుణకర్మముల మెచ్చె
నతివ నుద్ధరించె శ్రుతియు నేర్పి
బ్రహ్మచర్యమునకుఁ బ్రాభవమిడె దయా
నందయతి సమాజబంధుమౌళి.

నాది నీది యన్నభేదము న్నన్నాళ్ళు
తొలఁగ దొకని నొకఁడు దోఁచుకొనుట
సంశయమ్ము లుడిగి సర్వ మీశావాస్య
మన్నదెసకు మరలుఁ డన్నలార!

**ఈశావాస్యము (సర్వవేదసారము)**

ఉపనిషత్తిది; సృష్టి కొకయీశ్వరుండె
యజమానుఁడని చాటె; నతనికి నరుఁడు
సకలార్థ మర్పించి, జగదీశుఁ డొసఁగు
దానితోఁ దనియుట తగుచేఁత యనియె
ఒరుల యున్నతి కీర్ష్య నొందరా దనియె
పరులకల్మికి నాసపడు టొప్ప దనియె
మనుజుండు కర్మముల్ మానరా దనియె
సోమరిబ్రదుకులో సుఖములే దనియె;

పాపంబులకునెల్లఁ బ్రథమకారణము
పనికి దొదవ్వగా బ్రదుకుట యనియె
ఈశ్వరున్ మఱచి యథేప్సితమ్ముగను
భోగముల్ కుడిచెడిపురుషులు, కర్మ
నిష్ఠ మానినజడుల్ నీల్గినపిదప
నజ్ఞతాతమస భయంకరమైన
యసురలోకమ్ముల కరిగెద రనియె
నరుఁ డిటన్ నడచిన నడతకుఁ దగిన
తా వటన్ బడయుట తప్ప దం చనియె;

ఏకైక మగునాత్మ; యిది సుంత కదల
దటులయ్యు మదికంటె నాశువై పఱచు,
నన్నింటిలోపల నది విరాజిల్లు
నన్నింటి వెలుపల నది నిండియుండు
నది యుంటచేఁ బ్రాణి యటునిటున్ దిరుగు
నది యలౌకికము, తర్కాతీత మనియె;

తనయందు నఖిలభూతమ్ములఁ గనుచు
నఖిలభూతమ్ముల యందుఁ దన్ గనుచు
స్వపరభేదమ్ముల జడ్డు లేనట్టి
మనుజుఁ డెల్లరపట్ల మక్కువన్ గురియు

ప్రజ్ఞమై జగమెల్ల బ్రహ్మస్వరూప
మని విశ్వసించిన యతని కానంద
మయ జీవితము దక్కి, మడఁగు మోహమ్ము
సమయు శోకం, బని చక్క వాక్రుచ్చె;

ఆత్మజ్ఞుఁ డగువాని కంటదు పాప,
మతని రోగము లంట, వతఁడు తేజస్వి
యతఁడు సాధించు నిత్యములైన సిరుల
నతఁ డలిప్తుఁడు, కవి యతఁడు, మనీషి,
సర్వస్వతంత్రతాసంపన్నుఁ డనియె;

అంతులేనిది విద్య; యం దొకపాలె
వలయు, నొండొకపాలు వలదు మానవున
కక్కఱగల విద్యయందుఁ బాండితియు
నక్కఱలేని విద్యను మూఢతయును
గలవాఁడు సద్గతిఁ గాంచువాఁ డనియె;
చన దనావశ్యక జ్ఞానార్జనంబు
కారించు బ్రదుకు నక్కఱలేని తెల్వి
యది చీఁకటికిఁ ద్రోయు నని హెచ్చరించె;
అక్కఱయగు తెల్వి నందనివాఁడు
కర్తవ్యములఁ దీర్పఁ గాఁడని చెప్పె;
రవికి నెవ్విధిఁ బగల్ రాత్రియు నుండ
దాత్మ కవ్విధి జ్ఞాన మజ్ఞాన ముండ
దెవఁ డాత్మతత్త్వంబు నెఱుఁగు, నతండు
మృత్యువున్ గెలిచి, యమృత మందు ననియె;
మనుజుని హృదయాన మంచిగుణాలు
చెడ్డగుణాలుంట సిద్ధంబు, కాన
నాత్మవికాసార్థియైన మానిసికి
సద్గుణమ్ములఁ బెంచుజతనమ్ము వలయు
నవగుణమ్ముల నొంచు యత్నమ్మువలయు;

తన యొనరించు చేఁతలు ఫలించినను
సకలప్రజాప్రశంసలు గడించినను
జిత్తశుద్ధికి గుణశ్రీవికాసమున
కావంతయైన సాయంపడవేని
యవి నింద్యకార్యములని యెంచునరుఁడు
ధన్యుఁ, డతం డమృతము నందు ననియె;
మోహంబను పసిండిమూఁతచే నకట!
సత్యంపు వదనమ్ము సంఛన్నమాయె
నోప్రభూ! నేను సత్యోపాసకుఁడను
సత్యమున్ దరిసింప సంతాపపడుదుఁ
ద్రోయవే మూఁతను ద్రోయవే యనుచు
రవిమండలమ్మున రాజిల్లుపురుషు
నర్థింపవలె భక్తుఁ డని ప్రబోధించె;

ఓ జగత్పోషకా! యోమిత్ర! మిహిర!
తిలకింప వలతు నీ దివ్యరూపంబు
దుర్నిరీక్షంబులై తోఁచు నీ వెల్గు
లుడిగించి, నీ తేజ మొక్కచోఁ జేర్చి
సుప్రసన్నాకృతిఁ జూపవే తండ్రి!
యత్యంతశోభనమైన నీ రూపు
గని, దానిలో నన్నె కని, సాటిలేని
తనివి నందుదు నంచుఁ దరణి నర్థింప
వలయు నరుం డని వక్కణచేసె;

గాలిలో నొకనాఁడు కలియుఁ బ్రాణమ్ము
పదడుగా దేహ మేర్పడు నొక్కనాఁడు
జీవుఁడా! నీవు చేసిన కర్మములను
దలఁచి నేఁడే ప్రభున్ దలపోయు మనియె

అగ్నిదేవ! మరుత్సఖా! నీవు సకల
మెఱిఁగిన ప్రాజ్ఞుండ, వీశ్వరుదెసకు

మముఁ జేర్పవే! మంచిమార్గమ్ము చూపి
పెడదారి నుండి తప్పింపవే మమ్ముఁ
దొలఁగింపవయ్య! మా దురితపంకమ్ము
మలఁగింపవయ్య! మా మదినున్న జిడ్డు
జోహారు! నీ కిదే జోహారు!వనుచు
శుచిరూపరమ్యు నీశుని వేఁడువాఁడు
చైతన్యము గడింపఁ జాలువాఁ డనియె. (18-3-1972-నాకథలు)

**మళయాళయతి**

ప్రాఁబలుకు కంటె నుపనిషద్భాషకంటె
గీతనుడి కంటె సాబర్మతీతపస్వి
మాట జవదాఁటరాని ప్రమాణ; మెతని
కతని కర్పింతు మళయాళయతికి నతులు.

ఎల్లరకు నెల్లవిద్యల నీఁగుచనవు
లేమి నఖిలార్థసంపన్నభూమి యయ్యు
భారతము దాస్యమున కగ్గపడియె నన్న
యన్న నర్చింతు మళయాళయతివరేణ్యు.

తగనికోరిక రేఁగినతఱి నరుండు
తలను జెరలాడు తేలును దులిపిట్లు
వైళ మద్దాని వెడలింపవలయు నన్న
యనఘు నగ్గింతు మళయాళయతివరేణ్యు.

**శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి**

బ్రహ్మవిద్య గుట్టు పామరజనకోటి
చేతి యుసిరికాయఁ జేసిచేసి
నతులు నుతులు గన్న నవభారతమహర్షి
వీరగురుని వెల్గు వెలయు సతము.

మతము కులములేని మానవతావాద
మాదరించె నిమ్మహాశయుండు;

కన్ను విచ్చె నితని తిన్నని పల్కుతోఁ
గొలఁదిలేని జడతఁ గుందు వెలఁది.

అంటరానితనము గెంటనిచో జాతి
బాగుపడదు; దీని యోగు సెడదు;
తమ్ములార! లెండు! ధర్మానుసారులై
నడువుఁ డనియె నిమ్మనస్విమౌళి.

నాయందుఁ గలదు బ్రహ్మము;
నీ యందున్ గలదు; జగము నిఖిలము బ్రహ్మ
శ్రీయుతమే; యని చాటిన
ధీయుతు నీపోతులూరి దేశికు నెంతున్.

తత్త్వవేత్తల బోధనద్రఢిమఁగాక
సాంఘికక్రాంతి రాదు శాసనము కతన;
పుట్టె నీకోవలో నాఁడు పోతులూరి;
అవతరించెను నేఁడు మహాత్మగాంధి. (5-3-1984-చక్కట్లు)

## శ్రీ రామకృష్ణ పరమహంస

ఒడలి కతన బెక్కుబెడఁద లున్నవిగాని
యిది పరోపకృతికి నొదవునేని
వేయితనువులైన మోయుదు నను రామ
కృష్ణ పరమహంస కృపను మెత్తు.

జాయ నఖిలభువనజననిఁగా భావించె,
నిదురనైనఁ బసిఁడి కదియ నుల్కె,
పరమహంస యెంతపండెనో, కామినీ
కాంచనేచ్ఛ నిట్లు కత్తిరింప.

మలము నెత్తువాని మఱుఁగుదొడ్డికిఁ జీఁపు
రయ్యెనట్టె! పరమహంసజడలు;

జగతి నెంతమందిజటులు లే రందఱ
జడలు జడలె కుట్రపొడలు గాక.

అనఁటిపండు నొలిచి యఱచేత నిడిన చం
దాన గూఢమైన తత్త్వవిద్యఁ
జిన్నచిన్నకథలఁ జెప్పెఁగదా! రామ
కృష్ణుఁ డఙ్ఞలోకహితము కోరి.

సంస్కృతిన్ నీవు నిల్చుట చనును గాని
చనదు సంస్కృతి నీయందు సందుకొనుట
ఓడ సలిలమ్మునం దుంట యొప్పుఁగాని
యోడలో సలిలంబుంట కీడుదెచ్చు.

విషయములఁ దలంపు విడువక వేదాంత
మెన్నినాళ్ళు విన్న నెఱుక గనఁడు;
నోట నుప్పుఁగల్లు మాటి, లడ్డుం దినఁ
దీయఁదనము నరుఁడు తెలియునోటు?

నేఁటిసుఖము రేపు నిర్భరపీడమై
కలఁచునేని యది సుఖమ్ముగాదు;
వహ్నియందు వేఁడివలె నిచ్చ నిల్చిన
సుఖమె సుఖము ముక్తిసుఖమ యద్ది.

నిలవు భోగము, లొకనాఁడు తొలఁగితీరు,
తొలఁగినపు డివి చేకూర్చు దుర్భరార్తి;
తాన వీనిని దొలఁగించునేని నరుఁడు
తనియు నిర్భరశాంతి కాస్థాన మగుచు.

తన్ను మున్ను గెల్చి, తరువాత నితరుల
గెల్వఁ గోరువాఁడు విల్వనందు

తన్ను గెల్చు టన్నఁ దగుమేరలో నింద్రి
యముల నిల్వరింత యనెను బుధుఁడు.

లోకమెల్ల నీశ్వరాకృతి యని నమ్మ
వగచు నార్తమైన జగముఁ జూచి
విశ్వసేవనంబు వేల్పునూడిగముగా
భక్తుఁ డాచరించి ముక్తిగాంచు (1981-సందేశ సప్తశతి)

ఎన్నఁజాలిన పురుషార్థ మీశ్వరునకు
జీవునకు వేర్మి లేదన్న త్రోవగనుట
యిదియె లక్ష్మమ్ము నరున; కీయెఱుక దక్కి
నతఁడు వెన్కకురాఁడు జన్మాదు లంద

**స్వామి వివేకానందుడు**

కూటికి నస్సురుస్సురని కుందెడి కందెడి కుక్కయేని యీ
నాఁట నొకండు కంటఁబడినన్ మునుముందుగ దాని నేర్చు నా
రాటముఁ దీర్చుటే మతమురా! యని మాయని ధర్మతత్త్వమున్
జాటిన నీవివేకము ప్రసన్న మొనర్పఁగదే జగద్గురూ!

తీయని మన్ననల్ కురిసి, తేర్చి, యధ: పతితప్రజాళికిన్
బాయని బాంధవుండవయి, భారతజాతి భవిష్యభాగ్య సం
ధాయకుఁడౌ మహాత్మున కుదారచరిత్రునకున్ దరిద్ర నా
రాయణ సేవ నేర్పితివిరా! పరమార్థఖనీ! మహామునీ! (29-10-1952- శబల)

**వివేకానంద వాణి**

కుఱ్ఱలార! మీరు గురుతర కార్యంబు
లాచరింప నొదవినట్టివారు
కడలిపొంగుఁగాక పిడుగులుపడుఁగాక
మానకుఁడు మహెూద్య మానురక్తి

మనకు నేఁడు వలయు మగఁటిమిగలవారు
సాటిలేనితెగువఁ జాటువారు

గుండెబెదరులేని కొండలై మీ రందు
కొనుఁడు జయము జాతికొఱకు మనుఁడు.

ఏ నల్పుఁడ, నసమర్థుఁడ,
దీనుఁడ, నని పగలు రేయి దిగులుం గను, నే
మానవుఁ డతఁడే నాస్తికుఁ
డా నరుఁడే పతితుఁ డతఁడె యధమాధముఁడున్.

ఆత్మగతము విజయ; మదిదేహగత మని
విశ్వసించువాఁడు వెఱ్ఱివాఁడు;
ఎవ్వఁ డీ రహస్య మెఱుఁగు నవ్వానికి
మోఁకరించితీరు ముజ్జగమ్ము. (21-2-1963-సమదర్శి)

## వివేకానంద ప్రశంస

ఏను భరతోర్వి కననేల యెల్లమహికి
నాప్తుఁడను, నాకు గిఱిగీయు హక్కు గన్న
దేశ మెద్దియులేదు, నా తెఱఁ గెఱుంగుఁ
డన్న యతి వివేకానందు నభినుతింతు.

కరుడుగట్టిన నాగరికతను ద్రోసి
దీనమానవసేవకై దీక్షపూనుఁ
డన్నలార! వేదాంతము నవలఁ దలఁపుఁ
డన్న యతి వివేకానందు నభినుతింతు.

భగవదనురాగ మార్తులపాల నుండు
నార్తసేవయ హరిసేవ యనుట నిక్క
మనదలన్ దేర్ప నీశ్వరుం డవతరించు
నన్న యతి వివేకానందు నభినుతింతు.

(1981-సందేశసప్తశతి)

**పరమాత్మతత్త్వము - మహాత్మాగాంధి**

"ననుఁజుట్టియున్న యనంతవిశ్వమున -గల చరాచరవస్తుగణము నశించు
బ్రభవించు నెన్నేని పరిణామములకుఁ - బాల్పడుఁ గాని, యీప్రకృతి కాధార
మవికార మక్షరమై పొల్చునట్టి - చైతన్యమే చుఁడీ! చను దేవుఁ డనఁగ
అతఁడు మృత్యువునందఁ డమరుఁడై తనరు-తిమిరంబు నెఱుఁగఁడు
తేజోమయుండు
ఆర్తికి నవలివాఁడానందమూర్తి"

## అనుబంధము

**(తుమ్మలవారిని గూర్చి వివిధకవులు వ్రాసిన ప్రశంసాపద్యములు)**

ఆశీస్సు- రాష్ట్రప్రభుత్వ ఆస్థానకవి, శతావధాని శ్రీ చెళ్ళపిళ్ళ. వేంకటశాస్త్రి

సీతారామయచౌదరి-ఖ్యాతి గడించెన్ కవిత్వ కల్పనయందున్
నూతనతిక్కన యన్నా-రీతని సమకాలికులు కవీశ్వరు లెలమిన్.

విద్యయున్న లేదువినయంబు, వినయమ్ము
కలదయే విద్యగలుగు టరిది
ఇతనిపట్ల నుభయ మెసకమ్మెసంగెఁ ది
క్కన్న బలెనె కీర్తిగాంచుఁగాక! (1949)

**మాన్యకవీంద్రా! -భావవిప్లవవిధాత శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి.**

వ్రాయనేర్తువు ప్రౌఢప్రబంధకవుల
దారిఁ దెలుఁగుభాషాసంప్రదాయ మెఱిఁగి
యుడుకునెత్తుటి పాటల నోలలాడి
రాష్ట్రగానంబుఁ జేతువు ప్రతిదినమ్ము

తెలుఁగునుడికార మెసగన్
దెలుఁగుకవిత్వంబుఁ జెప్పి, దిట్టతనమునన్

దెలుఁ గనిపించెదవో తు
మ్మల సీతారామమూర్తి! మాన్యకవీంద్రా! (1942)

**వలపుకాన్క - శ్రీగుఱ్ఱం జాషువా**

నన్నయ తిక్కనాది కవినాథులు త్రొక్కిన త్రోవద్రొక్కి, యు
త్పన్న మొనర్చినావు రసవత్కృతు లెన్నియొ, వంక లేని నీ
చన్న పథంబులో నడుగు సాగుట దుస్తర, మిట్టి నీ కళా
భ్యున్నతి మెచ్చదగ్గది, సహోదరసత్కవిలోకభూషణా!

మెత్తని నీ హృదయమువలె
మెత్తనికవనంబు నీది, మెత్తఁదనములోఁ
గత్తికివలె పదనున్నది
సత్తాగలవాఁడ వన్న! చౌదరిమిన్నా! (1942)

ముగ్గురుసత్కవుల్ కరఁగిపోసిన భారతకావ్యసృష్టిలో
నిగ్గను ఘంటికాగ్రమున నిల్పిన చౌదరితిక్కయజ్వ! నీ
పగ్గియ యేన్గునెక్కి, వలపాదమునందు పసందు జాళువా
గగ్గెర దాల్చు నన్న నుడి, గర్వముగూర్చె కవీంద్రకోటికిన్. (1949)

**విద్వత్కవీ! శ్రీవేలూరి శివరామశాస్త్రి**

నారీతిం గవనంబు చెప్పఁగల యంతస్సారముంగల్గు వీఁ
డౌరా! వీనికిఁ బోలు గౌరవము నీయాంధ్రప్రజల్ చేయుచు
న్నారంచం గని తిక్కయజ్వ కవితానాథుండు దీవించెడుం
ధారామండలమందు నుండి యిదె సీతారామమూర్తీ ! నినున్.

భారతసీమలోన కనుపట్టిన, పట్టని విప్లవంబునన్
మాఱుపులెన్ని కల్గె, నల మాఱుపులన్నియు నీదు కైతలోఁ
జేరినయట్టులున్నవి, విశేష మిఁకేమన నాంధ్రసీమలో
మాఱని వెన్నియుండె మసిమాదిరిగాఁ గనుపట్టె నన్నియున్.

నీ సమ్మానము నేఁడు శారదకున్ నేత్రోత్సవం, బెంతయున్
వాసిం గాంచిన యీ మహాకవిత కింటం బెండ్లి, విద్వత్తకున్
రాసక్రీడ, తెలుంగునేలకు నపూర్వంబైన సంక్రాంతి, వి
ద్యాసంతోషిత సర్వదిక్సుకవి! సీతారామవిద్వత్కవీ! (1942)

### మిత్రప్రశంస-శ్రీవిశ్వనాథ సత్యనారాయణ

పికముల్ కూయు, శుకంబులున్ మొఱయు, కీవిన్ గేకులున్ మ్రోయు, నీ
సకలోద్యానమునందు నాంధ్రమయభాషాభారతామ్నాయ శ
బ్ద కవిబ్రహ్మరహస్యసంగ్రథనశక్తం బొక్క నీ వాక్కె; కొం
తకు తత్త్వజ్ఞులుకాని వారల వనంతంబుల్ వచోధోరణుల్

నాచేఁగానివి నీ వెఱుంగుదువ యన్నా! బట్టుకైవారముల్
నాచేతంబున శక్తి చాలదని యన్నం గాని కావచ్చు; నే
దాఁచం దోచినయంతవట్టు; భవదుద్యత్సాధునిర్దుష్ట శ
య్యాచిత్రం బెసలారుఁ దిక్కకవి దీవ్యద్భారతస్వచ్ఛమై.

సాధుశీలంబు, శారదాసదనవదన
మమృతహాసంబు, నార్యమర్యాద, దీర్ఘ
మైన తనువును, సత్కులమందు జనువు
నొక పురాజానుషతప: ఫలోద్గమములు.

ఇతరుల్ తా రొక వేయిమంది సఖులై యేతెంచినన్ గాదు, స
న్మతి నీయట్టిఁడొకండు శత్రువయినన్ సాఫల్యమౌ నట్టి నీ
వితరాప్రాప్యసఖిత్వభావమున నన్నెంతేని మన్నింతు వా
హితమే వందకువంద సాధుజనసాహిత్యంబు నన్నందెడున్. (1942)

### ఉపద-శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

కమ్మనితావు జిమ్ము నొడికారపుఁ దీరు వెలార్చు కైత నీ
సొమ్ము; తెలుంగుబాస గడుసుందనముం దులకించు కూర్పు నీ

సొమ్ము; మఱుంగుమాటలును, సొంపుల నింపెడి మంచినేర్పు నీ
సొమ్ము; వలంతిపోకడలఁ జొక్కఁగఁజేసెడి క్రొత్తదారి నీ
సొమ్ము; నిజమ్ముదాఁపక రుచు ల్వెలయించెడి జాను పల్కు నీ
సొమ్ము; సనాతనాంధ్రకవిశుద్ధవచ: పరిపాటికాపరీ
తమ్మగు కైతరీతులకుఁ దావలమై తగు నీదు కబ్బపున్
సొమ్ములఁ దెల్గుభారతికి సూడిద లిచ్చుచునుంటివి........... (1942)
ఎవరున్నా రధునాతనాంధ్రమునఁ దాదృక్ సంప్రదాయార్థ గౌ
రవ పారీణులు! లక్షణాఢ్య రసధారాస్నిగ్ధ సాహిత్య వా
క్ప్రవణుల్! సాత్త్వికభావనాచణులు!"ద్విత్రా: పంచషావా" యఁట
న్న వచోవైఖరి లెక్కలోఁ బ్రథమగణ్యశ్రీ కితం డర్హుఁడౌ

పొలుపు దక్కిన పాడిపాడిప్రాఁతలకుఁ గాక -ఛందోమయానంద సరణి దీర్చి
తలవంచుకొని నిరంతరదీక్ష సభలలోఁ - దలవంపుగొనని కైతలు వెలార్చి
సమకాలికము సమాజము మీలిమఱులేఱి-యనుగలంబుగ సూత్రమునకు గ్రుచ్చి
యితరుల పదబంధగతికి బానిస కాక-తన శైలి నొక స్వతంత్రతకుఁదెచ్చి
సాటి సత్కవివరులలో నేఁటి యాంధ్ర-లోకమున నిట్టు లుత్తమశ్లోకతఁ గొను
బుధహితుండు సీతారామమూర్తికవికి-నతనికృతిసంతతులకు బ్రహ్మాయువగుత!

తెనుఁగుకబ్బపుఁ దోఁటలో ననఁటిచెట్లు
తీయమామిళ్ళు, ద్రాక్షపందిళ్ళు పెంచి
నెమ్మిఁ బండించి; నారికెడమ్ముదెసకు
మనసుపెట్టని సరసుఁ డీ తెనుఁగులెంక.

'ఆత్మకథ' జీవధర్మమర్యాద కొక్క
వ్యాఖ్యగా సంతరించి; 'మహాత్మకథ' ను
నీశ్వరైక్యము భావించె; నింతకంటె
నుండునే యొండొక కవిత్వ యోగసిద్ధి! (1985)

**సీతారామకవీ! -శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి**

గాంధిచరిత్ర మే నమృతఖాద్యముగాఁ జవిగొందు, నందు మ
ద్బంధువు సీతారామకవి పల్కులపొంకము, కూర్పు, తీర్పు, నా
గాంధి పవిత్రభావ పరికల్పన మేల్మికి మేల్మి పైఁడికిన్
గంధము నబ్బఁ జేసిన ప్రకారమునన్ సమకూర్చె వహ్వారే!

**మా తిక్కన - శ్రీ ఏటుకూరి వేంకటనరసయ్య**

నీ కవితాలతాంగి పయనించిన తెల్గుబయళ్ళలోన నా
జూకులు విజ్జిరాలినవి సు మ్మఖిలాంధ్రకవీంద్రకోటిలో
నీకు లభించు గౌరవము నిస్తుల మా కవితామహత్వ, మా
పాకపటుత్వ, మా సరసభావమృదుత్వ మదెట్టు లబ్బెనో?

లోకము నూపునెత్తుగడలోఁ గల దండ, మిఁకందులోన నీ
పోకడ వేరు, భావనకుఁ బూనితివా అసమానకల్పనో
త్సేక కథల్ బయల్పడు, రచించితివా స్థిరకీర్తికారక
శ్రీకము లిద్ధకావ్యరసశిల్పము లుట్టిపడున్ గ్రమమ్ముగన్

**విద్వన్మణీ!- శ్రీ మిన్నికంటి గురునాథశర్మ**

అలఁతియలఁతి కోమల పద
ములు, నిండి తొణంకి దరులఁ బొర్లెడి రస,ము
య్యెల లూఁగు శయ్య, క్రొంద
మ్ముల తావుల రేఁచు భావములు, నీ కవితన్.

**సఖా ! -శ్రీశేషాద్రి రమణకవులు**

ధారాశుద్ధి, యుదారభావములు, గాథాకల్పనప్రౌఢి, నిం
డారన్ వ్రాసిన గాంధిజీవితములోనన్ దెన్గుతెన్నుల్ చమ
త్కారమ్ముల్ ననుఁ దన్పె; ఆంధ్రకవితాతత్త్వంబు నీసొమ్ము; నీ
ధారాళంబగు శయ్య అద్భుతము; సీతారామమూర్తీ ! సఖా? (1949)

**కవీంద్రా! - శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి**

నన్నయభట్టు 'శబ్దనటనమ్ములు', తిక్కనయజ్వ 'యర్థసం
పన్నత', శంభుదాసుని 'ప్రబంధవిభూతి' సమైక్యభావముం

గన్నవి నీ యెడన్; తెలుఁగుగడ్డ భవత్కవితా త్రివేణిచే
కన్నులవిందుగా వెలయుగావుత పచ్చని పైరుపంటలన్ (1949)

**కవీంద్రా! శ్రీకొసరాజు రాఘవయ్యచౌదరి**

అల్లసాని పెద్దన్న నవలఁబెట్టెదవులే-కావ్యనిర్మాణైక కౌశలమున
భట్టుమూర్తిశ్లేష పలుకరించెదవులే-ప్రతిపద్యపద రసాస్ఫాలమున
శ్రీనాధకవిరాజు చేయిగల్పెదవులే-మంజుల జటిలసమాసఘటన
తిక్కనకవి నచ్చుదింపివేసెదవులే-తేటతేనియలూరు తెల్గునుడుల
పుణికిపుచ్చుకొందువు భక్తపోతరాజు-రమ్యసాహిత్య మనువాదరంగమందు
సుధలఁజిందించు సిద్ధహస్తుఁడవు నీవు-అలఘుతరకీర్తిసాంద్ర! తుమ్మలకవీంద్ర!

**సఖా! -శ్రీ రాయప్రోలు సుబ్బారావు**

పొలముల్ పచ్చలసెజ్జలై, ఋతునయంబుల్ సూపరాగిల్లి, తా
రలు విచ్చేసిడి సంభ్రమ శ్రమతమ ప్రస్వేద ముక్తామణుల్
కలయంపుల్వడ, నీసుఖానుశయ సంక్రాంతి ప్రభాతంబులన్
తలిరాకొత్తుత నీమహాకవిత సీతారామ వాచావ్రతీ!

ప్రృధివీ కుశలాధ్వరమయ
మధురసగంధములు, సస్యమంజరులను, సం
గ్రధిత మయిన గతి, సహజ రు
చి ధామమాయె, భవదమృతశీధూక్తి సఖా! (1949)

**మహాకవీ!-శ్రీకాటూరి వేంకటేశ్వరరావు**

నీవు పేదవైన, నీకైత పేద గా - దన్న! ఆభిజాత్యమున్న సాధ్వి;
ఆపె పేదయైన అన్యభోగములు నీ - కెన్నియున్న నీ వకించనుఁడవ.

మకుటము లేల, అశ్వములు, మత్తకరుల్, శిబికాదు లేల, సా
యక నివహమ్ము లేల, చతురంగబలమ్ములు నేల నీకు? మా
ధుకణమృదూక్తి సంపదలతో హృదయమ్ముల నేలు లోక శా
సకుఁడవు; నీ వసించు చిటిచాపకు నోపవు సింహపీఠముల్. (1949)

**ఆశిష:- టిటిడి ఆస్థానపండితశిరోమణి శ్రీ వేదాన్తం జగన్నాథాచార్యులు**

సీతారామకవే! కవీన్ద్ర సమితావస్యాం మహార్థాన్వితా
నిర్దోషా సరసా సుకోమలపదన్యాసా గభీరాశయా
సద్వృత్తా కవితావధూర్జనపదాన్ సర్వాన్ చరిత్వా తవ
ప్రీత్యాయా కనకాభిషేకమకరోత్సా వర్ధతాం వర్ధతామ్. (1949)

**ఆర్యా!- శ్రీబూదూరి రామానుజులురెడ్డి**

పరుగులువారు భావపరిపాకరసామృతసారవాహినీ
స్ఫురణము; గానమాధురి యపూర్వగుణ శ్రవణానురంజకం
బరయ, పదార్థసంపద మహామహిమాన్విత మద్దిరా! కవి
త్వరమ వరించె కోరి నిను వర్ధిలు మార్య! చిరాయురున్నతిన్. (1949)

**తెనుఁగులెంక!- శ్రీ పులిచెర్ల సుబ్బారావు**

తిక్కన బోలిన కవికై
దిక్కులు సూడంగ నాడె తెలియగ వచ్చెన్
దిక్కఱివోయిన తెనుఁగున
దిక్కెవ్వరు మన యభినవతిక్కన దక్కన్?

అరుదగు అభినవతిక్కన
బిరుదము నెపుడో త్యజించె వినయాన్వితుఁడై
బిరుదు మగం డీ తుమ్మల
బిరుదేదీ తెనుఁగులెంక బిరుదము కంటెన్? (1987)

**మాయూరిమధురకవీ!- శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు**

కవితాసింహులుఁ; బండితేంద్రులు మహాకావ్యాళినిర్మాత లీ
భువిపై నుండిరి; కాని నీదు కవితాపూరంబు, మాధుర్య, మా
కవిబృందానికిఁ జిక్కబోదుగద! వాక్చాతుర్యభావాలతో
నవసౌందర్యము పొందుపర్చితివి, యాంధ్రబ్రాహ్మికిన్ చౌదరీ! (1949)

**సీతారామమూర్తీ ! -శ్రీగుండవరపు లక్ష్మీనారాయణ**

తుమ్మలాన్వయుఁడు కవితాత్ముఁడు, స్వభాష
యన, స్వరాష్ట్రమన, స్వదేశమనిన ప్రీతి
నియమబద్ధజీవితుఁడు, గాంధీమహాత్మ
స్ఫూర్తియుతుఁడు, సీతారామమూర్తి పేరు.

**జాతిరత్నమా!- శ్రీదుద్దేల పుల్లయ్య**

నైతికజీవనోన్నతికి నైకవిధమ్ముల దోహదమ్మునై
జాతివికాసమొందఁ దగు సాధనమౌనను ఆశయమ్ముతో
కైతల నల్లి, జాతిపితగాంధి వచస్సుల బోధజేయుచున్
చేతలయందు చాటిన ప్రసిద్ధుఁడు తుమ్మల జాతిరత్నమౌ!

**కవిచంద్రా!- శ్రీమొవ్వ వృషాద్రిపతి**

తెలుగుందోటల కుట్మలించిన సుమార్ద్రీభూతసౌరభ్యముల్
కలయంగ్రమ్మె దిశాంతరంబుల భవద్గంభీరవాగ్ధారలన్
పలుకుందొయ్యలి కొప్పులో విరిసె వీణాక్వాణముల్ నీదు కై
తల పూదండల జుంటితేనియలకై తారాడు భృంగధ్వనిన్.

తెలుఁగుందేశమునందు సత్కవులు సందీపింపరే? స్వచ్ఛ ని
ర్మల సత్కీర్తి దిగంతదేశముల సంవర్తింపగా జేయరే?
వలతిన్నిల్వరె? కాని నీదు పగిదిన్ భాషాభిమానంబు గం
పలలో కెత్తిన వారలేరి? రసభావప్రౌఢశైలీగతిన్

**కవీంద్రా!- శ్రీ కొల్లా శ్రీకృష్ణారావు**

మును తిక్కన్నకు నీకుఁ జుట్టఱికమేమో బోధకాదయ్య, యా
తెనుఁగుం బల్కుల తీరుతీయనలు సాధిష్ఠప్రభాశైలి ని
న్నను సంధించెను లెస్సగాఁ; "సుకవితా యద్యస్తి రాజ్యేన" కి
మ్మ, ను సూక్తిన్ మఱపించు తుమ్మలకవీంద్రా! యెంత ధన్యుండవో!

**అభినవతిక్కనా!- శ్రీ షేక్ దావూద్ సాహెబ్ (కర్నూలు)**

దివి భువి యబ్బురంపడఁగ దెల్గుపొలంబున గట్టిపంట ము
న్నవిరళ మాధురీభరితమై ఫలియించెను బెన్నగట్టునం;
దవుర! యదృష్ట మిప్పుడు రసాశ్రయసస్యము కమ్మతావులం
దవిలి ఫలించె గర్తపురి ధన్యతఁగాంచెడు కృష్ణ గట్టునన్

తలఁపుల కందని సరళతఁ
గలమున నొలికించి, తెలుఁగుఁగబ్బము లల్లం
గలుగుట తప: ఫలంబని
పలికెద మీ సాటివచ్చువారలు లేమిన్.

**తెనుఁగులెంకా!- శ్రీ చిట్టిప్రోలు కృష్ణమూర్తి**

నిలువెల్లఁ దెలుఁగువన్నియలు చిన్నియలు
తలఁపెల్లఁ దెలుఁగుటందములు చందములు
బ్రదుకెల్లఁ దెలుఁగుఁబొల్పములు పోడుములు
మదియెల్లఁ దెలుఁగుఁగమ్మనలు తిమ్మనలు
తెలుఁగువాఁడవు నీవు తెలుఁగు నీయదిర
అదిర! నీ చదు రిట్టిదనఁ దరంబటర!

**తెలుఁగులెంకా!- శ్రీ గిద్దలూరి చెంచుబసవరాజు**

పండినవాఁడు, కైత గడుఁబండినవాఁడు, తెలుంగుసాహితీ
మండనుఁడైనవాఁడు, నవమంజుల సంస్కృతశాబ్దికార్చనల్
నిండినవాఁడు, భావన వినిర్మల ధీ పరిపక్వవాఙ్మయో
ద్దండుఁడు, తెల్గులెంక సముదారమనస్వి, ప్రశంస్యుఁ డెప్పుడున్.

దేశిమార్గసరణి తీరుతెన్ను లరసి
దేశి నాశ్రయించి తేటతెనుఁగు
పలుకుబడులతోడఁబలుకుబడి నెఱపి
తేనెఁజిందఁజేసెఁ దెలుఁగులెంక.

**మా సీతారామమూర్తీ! శ్రీ కర్నాటి లక్ష్మీనరసయ్య**

మకరంద రసబృంద సకలంబు వెసజింద - కవితలల్లిన జ్ఞాన కర్మకుండు
ధీమాన్య సామాన్య దేశికవరులకు - కృతులొసంగిన పుణ్యహితచరిత్రు
డకలంక సుశశాంక ప్రకటకాశపటీర - మల్లికాధవళ సంపద్యశుండు
కంతు వసంత జయంతుల తలదన్ను - అందాలదీవి మాకంద రీవి

తుమ్మల మహాన్వయాంభోది తుహినకరుఁడు
తెలుఁగుకవితావిలాసిని కలితనుతుఁడు
నవరసాంచిత శబ్దసంధానచణుఁడు
రమ్యగుణకీర్తి శ్రీసీతారామమూర్తి

**మహాకవీ!- శ్రీపాపినేని శివశంకర్**

ఆత్మశూన్యమైన ఆవేశ మదియేల
కరుణ కీడు పడిన కవితయేల
సత్యహీనమైన సందేశమదియేల
ఈ యదార్థమే త్వదీయ రచన
జయము! సమస్త శిష్టజన సంస్తుతిపాత్ర కవీంద్రమౌళికిన్!
జయము! జరారుజాభయవిషాదదవీయ కవీశవాణికిన్!
జయ! మమృతోపమేయ రససంభృత కావ్యకలాతపస్యకున్!
జయము! జయమ్ము! శాంతిమయ సత్యపథప్రియచిత్తదృష్టికిన్!

**సత్కవీ!- శ్రీ సూర్యదేవర రవికుమార్**

రేపుల దుక్కిదున్ని చెలరేగెడివాఙ్మయకాంక్షదీఱగా
మాపుల మైళ్ళుమైళ్ళు చని, మాన్యగురూత్తము సేవలన్ మన:
తాపము దీర్చుకొంటివి, సుధామధురోక్తుల తెన్గుబాసలో
నీ పస జూపి, యాంధ్రజననీహృది నిత్యుఁడవైతి సత్కవీ!

ఆ కాలమ్మున పోతన
ఈ కాలమునందు వీర లీ తెనుఁగింటన్
రూకను కోరక భాషకు
చాకిరి యొనరించినారు సర్వులు మెచ్చన్.

గీతను, గాంధి, వినోబా
నేతల బోధనల నమ్మి, నిజమగు మనుజ
వ్రాతములో మేల్బంతై
పూతచరిత్రుండవైతి పుణ్యాత్మ! భళీ!

జ్ఞానపీఠమె మీకు దక్కనిది యనుచు
మాదృశులు చింతనొందక మానలేరు;
మీకు భుక్తోజ్ఝితము లహెూ! మేటిబిరుదు
లుర్వి మీసాటి నిష్కాములున్నవారె.

**మహాకవీ!- శ్రీ బొద్దులూరి నారాయణరావు**

కమ్మని తెల్గుబాస నుడికారపుసొంపులు గుమ్మరించు, హృద
ద్యమ్మగు జానుకైత మధురాసవ మిచ్చిన వార లీ శతా
బ్దమ్మున నెవ్వరంచు - పిడివాదము సేయక - నిగ్గుదేల్చినన్
తుమ్మలవారి పేరు తొలుదొల్తగ చెప్పక తప్పదెప్పుడున్.
తెలుఁగు పలుకుబడుల దివ్యామృతపు సోన
లొడ్డు లొఱసి కొంచు నురవడించి
నిన్ను జేర నిలిచె, నిజమైన జాతీయ
కవివి నీవు, దేశకవివి నీవు.

**యుగకర్తా!- శ్రీ తాళ్ళూరి సత్యనారాయణ**

ఎందరు లేరు సత్కవులు, హృద్యతరప్రతిభాకృతుల్, రస
స్యంది కృతుల్ రచించి, జనసమ్మతిఁబొందిన కోవిదాగ్రణుల్
సుందరభావముల్ మధురసూక్తు లలంకృతు లౌచితుల్, ధ్వనుల్
చిందఁగ నీవలెన్ గృతులు జెప్పెడి సిద్ధి లభింపదేరికిన్

వందలు వేలు పొత్తములు వ్రాయవు, వ్రాసినయట్టి గ్రంథముల్
నందనవాటికాకుసుమ నవ్యమరంద ఝరీతరంగముల్
చిందఁగ జ్ఞానబంధుర వశీకృత వైదుషిపిండి, నిండ నా
నందము గూర్చి, మించి శ్రవణ ప్రవణంబయి దీప్తి నించెడిన్.

అల్పాక్షరముల ననల్పార్థరచనంబు - రూపించు శిల్ప సంరూఢియందు
వడఁబోత నొడఁగూడు నుడికార మెసరేఁపు - కమనీయశబ్ద సంఘటన యందు
రసభావములకు సర్వంబునౌ శబ్ద సౌ - హిత్యమ్ముఁ గూర్చు నౌచిత్యమందు
పదమధ్యముననైనఁ దుదినైన యతి ననా - యాసంబుగాఁ బేర్చు న్యాసమందు
వ్యర్థపదముల నిరసించు ప్రజ్ఞయందు - నాదశక్తిని గూర్చు విన్నాణమందు
తిక్కనామాత్యు నుపమించు దిట్ట వగుట - కలిగె 'నభినవతిక్కన' గణుతి నీకు

కమ్మనిజానుతెన్గు నుడికారపు సొంపు, విమర్శనా పటు
త్వమ్ము, చరిత్రదృష్టి, సమతానవవాద సమర్థనంబు, నీ
సొమ్ములు సుమ్ము; నీదు పరిశోధిత దేశిపదప్రయోగ మా
ర్గమ్ములు జ్ఞాన దీధితి పరాయణముల్ పరిణామహేతువుల్.

యుగయుగముల పర్యంతము
నెగడెడి భావములు చిమ్మి, నిస్తుల ఫణితిన్
యుగకవితలు గుప్పించిన
యుగకర్తా! నీదు గ్రథన యోగము కాదే?

**విరిదండ- శ్రీయార్లగడ్డ వేంకటసుబ్బారావు**

కమ్మనితెల్గుబాస చిరకాలము నోచిన నోముపండె నీ
తుమ్మలవంశమందు, పెడత్రోవలబట్టిన యాంధ్రజాతి బ
గ్గమ్ముల బట్టి తెచ్చుటకుగా విరచించితి వౌర 'రాష్ట్రగా
నమ్ము' మహోజ్జ్వలాంధ్రజననాయకవృత్తములెల్లనెత్తి లో
కమ్మున గ్రుమ్మరించితివి; కాలరథమ్మున కగ్గమైన శి
ల్పమ్ములఁ జూపినావు; పరభాషలకై పరువెత్తువారి లో
పమ్ముల నెత్తి చూపితివి; పశ్చిమమండలవాసు లొండు రా
ష్ట్రమ్మును గోరఁ దెల్పితి విచారము; నాంధ్రులలోన నైకమ
త్యమ్ము తిరమ్ముగా వలయు, దాస్యము ద్రోయుట కంటి; లోక దా
స్యమ్ము నడంపబుట్టిన మహాత్మునివృత్తముఁ జెప్పినావు; పా
ర్య మ్మది యాంధ్ర, చెన్ననగ,రా న్నమలాది కళాలయంబులన్;
మమ్ము క్షమింపగావలయు, మామకు నల్లుఁడు స్వీయమాతృవం
శమ్మును గూర్చి చెప్పినటు, సర్వధరోజ్జ్వలదీపసూర్యబిం

బమ్మను దివ్వెఁజూపినటు వల్కితి నల్లుఁడగాన, ఏల నీ
కమ్మయు, గబ్బమౌ తెలుఁగుకావ్యసుమంబులఁ గమ్మపుప్పొడుల్
చిమ్మగ, లోకమెల్ల మధుసింధువు కుత్తుకబంటిగాగ భృం
గమ్మయి దోగి, తన్మధురకంఠము నెత్తి పఠింపసాగె గీ
తమ్ములు, రోళ్ళరోకళుల దధ్ధిమి తధ్ధిమి మ్రోగు, నీదు కా
వ్యమ్ములు, తెల్గుపూవుల సువాసన  లెల్లడఁ బర్వుగావుతన్!

**అభినవ పోతన- శ్రీవడ్లమూడి గోపాలకృష్ణయ్య**

భుక్తికో, దారిద్ర్యముక్తికో, రాజాను - రక్తికో, కావ్యముల్ వ్రాయకుండ
అంగనాళ్యంగముల్ రంగుజూపులఁజూచి - పచ్చిశృంగారముల్ పల్కకుండ
పొగడుటల్ తెగడుటల్ పొగడితెగడుటలు - స్వార్థమున నొనర్చుపాపి కాక
భాషాపరాయోష పరిపోషిత మహా మ - నీషియై పరవిజగీషి కాక
శాంత్యహింసాపథమ్ముల జనులకెల్ల - క్షేమముల్ గోరి కృతుల రచించు చుండి
మోక్షమందైన నెట్టి యపేక్షలేక - స్వార్థమెఱుఁగని తెలుఁగుపోతన్న యితఁడు.

**యుగకవి తుమ్మల- శ్రీ బీరం సుందరరావు**

దివ్యములై, నవ్యములై,
కావ్యములై, పాఠకజనవిగళితగళ సు
శ్రావ్యములై, సంతత సం
భావ్యములై (మీ)'యుగకవితలు' భాసిలుచుండున్.

**గాంధికవీ!- శ్రీజూపూడి అమ్ములయ్య**

నీ కవిత్వమ్ములో నిష్కల్మషంబైన - జాతీయభావాలు జాలువాఱు
నీ కవిత్వమ్ములో నిర్మలంబైనట్టి - పల్లెసీమల గరిమ పరిఢవిల్లు
నీ కవిత్వమ్ములో నిండుగ పండిన - తేనెసోనల తెల్గు తేజరిల్లు
నీ కవిత్వమ్ములో నిరుపమానంబైన - గాంధేయవాదమ్ము గ్రాలుచుండు
సంప్రదాయకంబైన సంస్కారయుతము - గ్రాంథికంబైన నెంతటి కమ్మదనము
వస్తు వేదేని గాని నవాభ్యుదయమె - గాంధికవి, రాష్ట్రకవి, దేశికవివి నీవె!

**సత్కవీశ్వరా!- ఆదిపూడి సోదరకవులు**
**(శ్రీ అబ్బరాజు వీరరాఘవయ్య శ్రీ అబ్బరాజు సూర్యనారాయణ)**

సరససంస్కృతసమాసరచనా ప్రాగల్భ్య - మొలికింతు నన్నయ పలికినట్లు
అలఁతి యలంతి పల్కుల నర్థగౌరవ - మొదవింతు తిక్కన్న పొదివినట్లు
కమనీయగాథా ప్రకల్పనాచాతుర్య - మడరింతు సూరన్న నుడివినట్లు
ప్రౌఢప్రయోగప్రభావవైచిత్రి - కూర్చెదు రామకృష్ణుండు చెప్పునట్లు
శబ్దసంస్కృతి, నవ్యరసప్రయుక్తి - యర్థసంపుష్టి, హృద్యభావానుయుక్తి
నీదు స్వర్ణలేఖినిలోన నెగడుచుండు - పుణ్యమూర్తి! సీతారామమూర్తి! సుకవి!

**కీర్తిసాంద్ర!- శ్రీమన్నవ నరసింహము**

వ్యర్థోక్తు లుచ్చరింపమిఁ గావ్యమెల్ల - సద్రచనా ధురంధరతను వహించె
నీరసవాక్యముల్ నింపమి గ్రంథవితతి - నెల్లెడ స్సరసత లభించె
దుష్టోక్తు లొక్కింత తోఁపమిఁ జరితముల్ - కవితాపటుత్వసంకలనఁ జెలఁగె
అన్యదేశీయంబు లబ్బమిఁ గబ్బముల్ - మాతృభాషాప్రౌఢమార్గ మూనె
ఔర! రచనాచమత్కృతియందు, సరస
వైఖరిని ప్రౌఢదశఁ బటుత్వమున నీదు
కవిత కవిలోకమున కింపుగా నటించె
కీర్తిసాంద్ర! సీతారామమూర్తి! సుకవి!

**మహాకవీ!- శ్రీనాగభైరవ కోటేశ్వరరావు**

సాటికవులంతాను భావక
స్వాములై ప్రణయాలు పూయగ
మహత్తరమగు మానవత్వం
మాట నిలిపితివి.

మేడిబట్టిన చేతితోనే
మేలికావ్యము లల్లినాడవు
ఏ హిపోక్రసీలేని కవనము
నిచ్చి నావయ్యా!

తెలుగుదనమె నీకుప్రాణము
భారతీయత ఆత్మగానము
మరొక 'సుబ్రహ్మణ్యభారతి'
మాకు నీవయ్యా!

భాషకేమో నియతిగోరితి
భావమునకై స్వేచ్ఛగోరితి
స్థిరము నీ నిశ్చయము, దానికి
చేటులెదెపుడు

మాట సత్యము, మనసు సత్యము
మనసులోగల మమత సత్యము
మనోవాక్కర్మంబులందున
మహారుషివీవు.

నీవు బ్రతికినకాలమందున
నిలచియుండుట మాకు గర్వము
మహాకవి! నీ పరిచయమ్మే
మాకు పర్వమ్ము.

మహాకవినేతా!-శ్రీమాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి

ఏపరమేష్ఠినాట జనియించెనొ యీకవితాకుమారి, నీ
ప్రోపున జేసి సర్వవిధభూషణభూషితయై లసద్రసో
ద్దీపితమయ్యె, నీకు సరిదీటు మహాకవినేత యెన్ని యె
న్నో పురుషాంతరమ్ములకు నొక్కొకఁ డుద్భవమందు తుమ్మలా!

(1949)

## జాతి గర్వించదగ్గ మహాకవి

"సర్వతంత్ర స్వతంత్రుడౌ సత్కవీంద్రు డెన్నడో కల్పమున కొక్కడే లభించు" - తెనుఁగులెంక, అభినవతిక్కన, గాంధి ఆస్థానకవియైన తుమ్మల సీతారామమూర్తిగారు తెలుగుజాతికి, సాహిత్యమునకు 20వశతాబ్దమునందు లభించిన అపూర్వమైనకానుక. వారు కవితాహిమాలయము; పాండితీ మేరునగము, వారు ప్రతిభావంతులేగాదు, వ్యుత్పన్నులు కూడ. వారు ఆకారములో ఆంధ్రుడు; ధర్మములో భారతీయుడు; భావములో విశ్వమానవుడు. వారు ధర్మసంరక్షణార్థము కవితలల్లిన ఋషితుల్యులు. వారు ప్రాతక్రొత్తల మేలుకలయిక. ఆధునికాంధ్ర సాహితీజగత్తులో వారు యుగధర్మమును గుర్తించి, స్వతంత్రమార్గమున పయనించి, యుగకవితను సృష్టించిన యుగకవులు, వారి కవితలో యుగధర్మమును విశ్వరూపమున గాంచగలము. వారు కవిత్వమును సమాజసేవాసాధనముగా భావించి, "సామాజిక కల్యాణము కామించెద నవ్యభవ్యకవితా సృష్టిన్" అని ప్రకటించి, వారు రాజకీయ, మత, సాంఘిక, ఆర్థిక,నైతిక విలువల పరిరక్షణకొరకు చైతన్యవంతమైన కవితను సృజించిన సాహితీప్రవక్తలు. వారు ఆంధ్రావళిమోదము కొరకు జగద్ధితమైనకవితను కళాన్వితముగ గానము చేసినారు. వారి కవిత వ్యవస్థలన్నింటికి సంగమస్థలము, సమధర్మము సహజధర్మమని నమ్మి, సమకాలీన సమస్యలను స్వీకరించి, వాటికి పరిష్కారమార్గములను సూచించుటయేగాక, సార్వకాలీనత నిచ్చినారు. వారి కవితాశయము ఆంధ్రుల అభ్యుదయము, భారతీయుల ప్రగతి, సమగ్రతలు, మానవజాతికల్యాణములు. సంప్రదాయము, సర్వోదయము, సార్వజనీనత, సౌందర్యము, సౌలభ్యములు వారి కవితాలక్షణములు. వారి కవితకు గాంధిధర్మము పట్టుగొమ్మ. గాంధేయ సిద్ధాంతములు భారతీయ ధర్మస్వరూపములని, సర్వోదయసిద్ధాంతములు విశ్వమానవకల్యాణకారకములని వారు విశ్వసించినారు. వారి రచనలు సత్యం శివం సుందరం అను ధర్మములకు నెలవులు. వారి కవితలో మానవతాపరిమళములు వెదజల్లు విశ్వసంస్కృతి కలదు; అది మానవుని సంస్కారమవంతునిగా జేసి, సమాజమును ఉన్నతీకరించును.వారి కవితలో జాతిజీవనము సర్వతోముఖముగ ప్రతిబింబించుచుండును. వారి ప్రతిపద్యమునందు సాంఘికస్పృహ కలదు; అంతే గాదు తెలుగుకవితా సొగసుల పరిమళములు గుబాళించు చుండును. వారి కవిత వంద సం॥ల భారతదేశ చరిత్రకు దర్పణము. వారు జన్మించినది 1901; మరణించినది 1990. ఆధునిక యుగలక్షణములన్నియు వారి కవితలో గాంచగలము. అందువలన వారి కావ్యములు ఆంధ్రుల, భారతీయుల నవయుగహృదయస్పందనలకు రమణీయమైన అక్షరరూపములు. నవీనాంధ్రసాహిత్య చరిత్రలో 20వ శతాబ్దమును "తుమ్మలయుగము" అని పేర్కొనవచ్చును. వారి కవిత పాఠకులకు భావప్రసన్నతను, హృదయవికాసమును, ఆనంద పారవశ్యమును, మానసిక ప్రశాంతతను కలిగించును. త్యాగరాజు సంగీతము, తుమ్మల సాహిత్యము ఒకే కోవకు చెందినవి. అనగా అవి వినినకొలది ఇంకను వినవలెననియు, చదివినకొలది మరలమరల చదువవలెనననియు అనిపించును. అవే నిజమైన కళలు; అజరామరమైనవి. వారిద్దరి సంగీత సాహిత్యములు రసికలోకపు తఱుగనిసిరులు.

తుమ్మలవారు కవిగా ఎంత ఉన్నతులో, వ్యక్తిగా అంతకంటే ఉన్నతులు. వారి జీవితమే ఒక సందేశము. వారు జీవించిన కాలమందు జీవించుటే మహాభాగ్యమని సమకాలికులు భావించిరనిన అతిశయోక్తిగాదు. విశ్వజనీనమైన యుగకవితను సృష్టించిన, ఆదర్శవంతమైన జీవితమునుగడపిన మహాకవి 20వ శతాబ్దమునందు తుమ్మలవారు గాక మరొకరులేరనుట తెగువగాదు. తుమ్మలవారు "నా అమూల్యసంపద, నా గౌరవపతాక" అని జాతి గర్వించదగిన విశిష్టమైన మహాకవులు "తుమ్మల 20వ శతాబ్ధియుగకవి; 21వ శతాబ్దపు యుగకర్త"